తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి


సచిత్రమాసపత్రిక

జూలై 2020 వెల రూ.5/-



## శ్రీచక్రత్తాళ్వార్ జయంతి

**21-07-2020**




ప్రతిభటశ్రేణిభీషణ
వరగుణస్తోమభూషణ
జనిభయస్థానతారణ
జగదవస్థానకారణ ।

నిఖిలదుష్కర్మ కర్శన!
నిగమ సద్ధర్మదర్శన!
జయ జయ శ్రీసుదర్శన
జయ జయ శ్రీసుదర్శన ॥

(శ్రీవేదాంతదేశిక విరచిత శ్రీసుదర్శనాష్టకం-1)



# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** తస్య సంజనయన్ హర్షం కురువృద్ధః పితామహః ।
సింహనాదం వినద్యోచ్చైః శంఖం దధ్మౌ ప్రతాపవాన్ ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-12వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** ప్రతాపవాన్=పరాక్రమవంతుడును; కురువృద్ధః= కౌరవులలో పెద్దవాడును; పితామహః= తాతగారైన భీష్ముడు; తస్య= ఆ దుర్యోధనునికి; హర్షమ్= సంతోషాన్ని; సంజనయన్= కల్గిస్తూ; ఉచ్చైః= బిగ్గరగా; సింహనాదమ్= సింహగర్జనవంటి ధ్వనిని; వినద్య= చేసి; శంఖమ్= శంఖాన్ని; దధ్మౌ= ఊదాడు.

**భావం:** అప్పుడు ప్రతాపం గలవాడూ, కురువృద్ధుడు, పితామహుడు ఐన భీష్ముడు, దుర్యోధనుడికి ఆనందాన్నిగూర్చుతూ సింహగర్జనవంటిధ్వని కలిగేటట్లుగా తన శంఖాన్ని బిగ్గరగా పూరించాడు.

---


## వేంకటగిరినిలయా...

ఆదిదేవ పరమాతుమా
వేదవేదాంతవేద్య నమో నమో ॥

పరాత్పరా భక్తభవభంజనా
చరాచరలోకజనక నమో నమో ॥ (1)

గదాధరా వేంకటగిరినిలయా
సదానంద ప్రసన్న నమో నమో॥ (2)

(సంపుటం-1, సంకీర్తన-289)





"ఆదిదేవా! పరమాత్మా! వేదాలలో, ఉపనిషత్తుల్లో తెలియదగినవాడా! నీకు పునః పునః నమస్కారం. గొప్పవారందరికన్నా గొప్పవాడవు. భక్తుల సంసారబంధాల్ని తొలగించేవాడవు. కదలేవి, కదలనివి- అయిన జీవ జాలంతో కూడిన లోకాలకు తండ్రివి. నీకు నమస్కారం. గదను ధరించిన వాడా! శ్రీవేంకటాద్రిపై వెలసినవాడా! ఎల్లప్పుడు ఆనందమే తానైన వాడా! దయగలవాడా! నమస్కారం" అని అన్నమయ్య సంకీర్తనలో స్వామిని కీర్తిస్తూ, నమస్కరించాడు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి




# బాలవాక్కు!

**పిల్లలూ.... మీరూ రాయండి !**

**పెద్దలూ...... మీరు ప్రోత్సహించండి !!**

బాలబాలికల్లో మన సంస్కృతిపట్ల, ధర్మంపట్ల, పురాణాలపట్ల, భగవంతుని పట్ల, పెద్దలపట్ల చక్కని అవగాహన కలిగించటానికి, ఆధ్యాత్మిక ఆలోచనల్ని పెంపొందించ టానికి **సప్తగిరి** మాసపత్రిక ఈ వినూత్నశీర్షిక **'బాలవాక్కు'**ను ప్రవేశపెట్టింది.

## ఎవరు రాయవచ్చు...

ఆరవతరగతినుండి పదవతరగతివరకు చదువుతున్న బాలబాలికలందరూ రాయవచ్చు.

## ఏం రాయాలి?

మీరు చదివిన లేక మీరు విన్న ధార్మికకథలు, హరికథలు, పురాణాలు, ఇతిహాసాలు, నీతిశతకాలు మొదలైనవాటిల్లోని ఆధ్యాత్మికసారాంశాన్ని ఆధారంగా చేసుకొని, మీరు కథగానో, కవితగానో, వ్యాసంగానో లేక భగవంతుడిపట్ల మీ ఆలోచననో రాయొచ్చు. మీరుపంపే రచనలకు తగ్గట్టు వర్ణచిత్రాలుకూడా వేసి పంపవచ్చు.

## పెద్దలు చేయవలసింది...

పిల్లల్లో మన పురాణ, ఇతిహాసాలపట్ల జ్ఞానాన్ని పెంపొందించడానికి వారికి తగిన సలహాలను ఇచ్చి, చిన్న చిన్న ఆధ్యాత్మికగ్రంథాలు చదివించి, వారిని ప్రోత్సహించి, రాయించండి!

## నిబంధనలు...

1) రచన రెండు అరటావులకు మించరాదు. కాగితానికి ఒకవైపు మాత్రమే రాయాలి. రచన స్పష్టంగా అర్థమయ్యేలా ఉండాలి.

2) పూర్తిచిరునామా, పాస్‌పోర్టుసైజుఫోటోతోపాటు, **రచన మీ సొంతమేనన్న ధ్రువీకరణపత్రాన్ని, మీరు చదువుతున్న పాఠశాల హెడ్‌మాస్టర్ సంతకంతో జతచేయాలి.**


3) **మీ రచనలు పోస్టుద్వారా పంపాల్సిన చిరునామా:** ప్రధానసంపాదకుడు, సప్తగిరికార్యాలయం, తి.తి.దే. ప్రెస్‌కాంపౌండు, కె.టి.రోడ్డు, తిరుపతి – 517 507.

4) **తెలుగులో డిటిపి చేసి మెయిల్‌ద్వారా పంపాలనుకుంటే** పేజిమేకర్‌లో అనుఫాంట్స్‌లో (లేదా) ఎం.ఎస్.వర్డులో యూనికోడ్ ఫాంట్‌లోగాని టైపు చేసిన ఫైల్ మరియు PDF ఫైల్ కూడా తప్పని సరిగా telugusubeditor@gmail.com మెయిల్ ఐడికి పంపగలరు.

5) ప్రచురించిన రచనలకు శ్రీవారిఅక్షరప్రసాదంగా ఐదుప్రతులు మీ చిరునామాకు పంపుతాము.

6) మీరు రచన పంపినతరువాత తుదినిర్ణయం ప్రధానసంపాదకునిదే.

7) రచనలపై ఎలాంటి ఉత్తరప్రత్యుత్తరాలకుగాని, ఫోన్ చేయడంలాంటివాటికిగాని చోటు లేదు.



**బాలల్లారా రాయండి..! శ్రీవారి ఆశీస్సులు పొందండి...!!**

50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 51 జూలై, 2020 సంచిక : 02



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

గౌరవ సంపాదకుడు
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు
ఆచార్య కె.రాజగోపాలన్, పిహెచ్.డి.,

సంపాదకుడు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకుడు
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

ముద్రాపకుడు
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| తొలిఏకాదశి | శ్రీమతి కె.విజయలక్ష్మి | 07 |
| అమ్మ ఉంటే.. ఆనందానికి కరవా? | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 09 |
| జ్ఞానావతారం | శ్రీమతి పి.విజయలక్ష్మి | 10 |
| శ్రీకృష్ణభగవద్విజయం | డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు | 11 |
| సందేహాలు - సమాధానాలు | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 13 |
| శారీరికతపస్సు విజయానికి తొలిమెట్టు | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 14 |
| అన్నమయ్య జీవితచరిత్ర | డా॥ మన్నూరు శివప్రవీణ్ | 15 |
| దేవదేవునికి.. లాలిపాటలు | డా॥ ఎన్.అనంతలక్ష్మి | 17 |
| మహోపకారకులు | డా॥ఈ.ఎ.శింగరాచార్యులు | 19 |
| నాగచతుర్థి | శ్రీ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖరరావు | 21 |
| వ్యాసపూర్ణిమ | శ్రీ డి.వి.ఆర్. భాస్కర్ | 23 |
| సోదర ప్రేమకు... రక్షాబంధనం | శ్రీమతి పూర్ణిమా స్వాతి | 25 |
| దివ్యక్షేత్రం... తిరుమల | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 31 |
| శ్రీవారి ఆణివర ఆస్థానం | డా॥ ఇ.జి.హేమంత కుమార్ | 33 |
| శ్రీవరలక్ష్మీవ్రతకథ | డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య | 34 |
| నవకాయ పిండివంటల వ్రతం | శ్రీమతి వైజయంతి పురాణపండ | 36 |
| చంద్రగిరి- శ్రీకోదండరామాలయం | డా॥ సంగీతం కేశవులు | 37 |
| ప్రహ్లాదుని ఆహ్లాదగుణాలు | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 38 |
| వైనతేయుడికి వందనం | డా॥ కప్పగంతురామకృష్ణ | 40 |
| శ్రీవేంకటాచలమాహాత్మ్యంలో 'వకుళమ్మ' చిత్రణ | శ్రీమతి వరిగొండ సునంద | 42 |
| స్వామి కరుణ ముందు... కరోనా ఎంత? | శ్రీ ఐ.ఎల్.ఎన్.హర్షవర్ధన్‌రావు | 45 |
| సంపద నాకు లభించుగాక! | బ్రహ్మశ్రీ మైలవరపు శ్రీనివాసరావు | 46 |
| దరిదాపులకు రానీయవద్దు! | ప్రాచార్య శలాక రఘునాథశర్మ | 47 |
| హరిదాస వాఙ్మయంలో శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 48 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ టి.వి.కె.పూర్ణప్రసాద సిద్ధాంతి | 51 |
| ఆరోగ్య పరిరక్షణకు ధనియాలు | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 52 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య మరియు కిరణ్ భట్ | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీవారి ఆణివర ఆస్థానం (తిరుమల)
వెనుక చిత్రం : శ్రీవారి పవిత్రోత్సవం (తిరుమల)

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777
2233333

వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

## సంపాదకీయం

# శ్రావణలక్ష్మికి స్వాగతం..

శ్రీచాంద్రమాసానుక్రమణికలో మాసం పేరు చివరలో 'లక్ష్మి' అనే పదం కేవలం రెండుమాసాల విషయంలోనే కనిపిస్తుంది. ఒకటి శ్రావణలక్ష్మి కాగా, రెండోది పౌష్యలక్ష్మి. పైర్లు నాటడం శ్రావణంలో ప్రారంభమవుతుంది. ఫలసాయం పుష్యంలో చేతికి అందుతుంది. మొత్తంగా ఈ రెండుమాసాల్లో ఒకటి ధాన్యలక్ష్మికి అంకురం కాగా, మరొకటి ఫలాన్ని అందిస్తుంది.

శ్రావణమాసం... ఈ పేరు పలికితేనే మహిళలకు మనస్సు పులకరిస్తుంది. ప్రతి ఇంట్లోనూ ఆధ్యాత్మిక శోభ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అప్పటిదాకా ప్రచండకిరణాలతో తన ప్రతాపాన్ని ప్రకటించిన సూర్యుడు చల్లబడతాడు. వానలు ప్రారంభం కావటంతో తాపం తగ్గుతుంది. ప్రకృతిలో కొత్తకాంతి వస్తుంది. ఎటుచూచినా ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తుంది. మరోపక్క నూతనవస్త్రాలు, ఆభరణాలు తదితరసుమంగళద్రవ్యాల కొనుగోళ్ళతో ప్రతి ఇంట్లోనూ సందడి ప్రారంభమవుతుంది. ప్రతిమనసూ ఆనందంతో పరవశిస్తూ ఉంటుంది. మొత్తంగా, ఆధ్యాత్మిక, ఆనందాల సమ్మేళనంతో శ్రావణమాసం సమాజంలో సరికొత్తశోభ తీసుకువస్తుంది.

శ్రావణమాసంప్రారంభం నుంచే ప్రతిఇంట్లోనూ శుభకార్యక్రమాలు శ్రీకారం చుట్టుకుంటాయి. కనీసం పది, పదిహేనురోజుల ముందుగానే సందడి మొదలవుతుంది. కొత్తపెళ్ళికూతుర్లు నోములు పట్టేందుకు ప్రణాళికలు చేస్తుంటారు. వరలక్ష్మీదేవిని అర్చించి, తమ మాంగల్యభాగ్యాన్ని కలకాలం నిలుపుకోవాలని ముత్తయిదువులు ఘనంగా నోములు చేస్తారు. మొత్తంగా, ప్రతి ఇంటా ఆధ్మాత్మికత వెల్లివిరుస్తుంది.

'నభోమాసం' అనే పేరుకూడా ఈమాసానికి ఉంది. చంద్రుడు పూర్ణిమరోజున శ్రవణనక్షత్రంలో సంచరించటం వల్ల ఈ మాసానికి శ్రావణమాసం అని పేరు వచ్చింది. శ్రవణనక్షత్రానికి శ్రీమహావిష్ణువు అధిదైవతం. శ్రీమహావిష్ణువు అర్ధాంగి అయిన శ్రీమహాలక్ష్మిని ప్రత్యేకంగా అర్చించడంకూడా ఈ మాసంలో కనిపిస్తుంది. ఈ కోణంలో పరిశీలనచేస్తే శ్రీమహాలక్ష్మి విష్ణువుల అనుగ్రహం పొందడానికి వీలైనమాసం శ్రావణమాసం అని చెప్పుకోవచ్చు.

వేదాలను కాపాడటానికి శ్రీమహావిష్ణువు హయగ్రీవుడుగా అవతరించింది ఈ మాసంలోనే. శ్రీకృష్ణపరమాత్మ ఈ మాసంలోనే అవతరించారు. హయగ్రీవోత్పత్తి ఈమాసంలోనే జరిగింది. గరుత్మంతుడు అమృతభాండాన్ని సాధించిందికూడా ఈ మాసంలోనే. అళవందారు, బదరీనారాయణ పెరుమాళ్, చూడికుడుత్త నాంచార్ తదితర వైష్ణవముఖ్యుల తిరునక్షత్రాలు ఈ మాసంలోనే వస్తాయి. ఈవిధంగా ఎన్నో ప్రత్యేకతలతో అలరారే శ్రావణమాసవైశిష్ట్యం ఇంత అని చెప్పటానికి సాధ్యం కాదు.

ప్రస్తుతం ప్రపంచదేశాలన్నీ ఆరోగ్యపరంగా విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. కరోనారూపంలో మహమ్మారి ప్రపంచాన్ని కబళిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో శ్రావణలక్ష్మి మనందరికీ ఆరోగ్యలక్ష్మిని తన అనుగ్రహవరప్రసాదంగా అందించాలని, అమ్మవారిని త్రికరణశుద్ధిగా ప్రార్థన చేద్దాం. ఈ మాసంలో చేసే పూజలు, నోచే నోములన్నిటిలోనూ విశ్వ మానవకల్యాణంకోసం అని సంకల్పాన్ని చెప్పుకుందాం.

ఈ మాసంలో చేసే పూజలు, నోములన్నీ పరస్పర సహకార భావనకు నిదర్శనాలు. ఈ మాసంలో జరిపే పేరంటాలు స్నేహబలాన్ని సమకూర్చే ఉత్తమఆచారాలు. ప్రేమాస్పద సౌమనస్య వాతావరణమే లక్ష్మీకృపకు స్థానం. కాబట్టి, పరస్పరశ్రేయస్సు, ఆరోగ్యాన్ని సంకల్పంగా చెప్పుకుంటూ శ్రావణలక్ష్మిని ఆరాధిద్దాం. ఆరోగ్యభాగ్యాన్ని శ్రావణలక్ష్మీ ప్రసాదంగా అందుకుందాం.

# తొలిఏకాదశి


- శ్రీమతి కె.విజయలక్ష్మి

ఆషాఢమాసంలో శుక్లపక్ష ఏకాదశి–'తొలిఏకాదశి'. తొలిఏకాదశికే 'ప్రథమఏకాదశి', 'శయనఏకాదశి', 'హరి శయనఏకాదశి' అని కూడా పేర్లు.

మనకున్న తిథుల్లో 'ఏకాదశి' పదకొండవతిథి. శ్రీమహా విష్ణువుతో ముడిపడ్డ తిథి. అందుకే ఏకాదశిని హరివాసరం, హరిదినం, వైకుంఠదినం అనికూడా అంటారు. నెలలో శుక్లపక్షంలో ఒకటి, కృష్ణపక్షంలో ఒకటివంతున సంవత్సరంలో 24 ఏకాదశులు ఉన్నా, తొలిఏకాదశి, వైకుంఠ ఏకాదశులను మాత్రం పండుగలుగా జరుపుకోవడం జరుగుతోంది.

తొలిఏకాదశి మొదలుకొని నాలుగునెలలపాటు అంటే కార్తికమాసంలో శుక్లపక్షఏకాదశివరకు శ్రీమహావిష్ణువు పాలకడలిలో శేషశయ్యపై శయనించి, యోగనిద్రలో ఉంటాడు. అంటే శ్రీమహావిష్ణువు శయనించే ఏకాదశి కనుక దీనికి 'శయనఏకాదశి' అనే పేరు ఏర్పడింది.

కాగా, ఇది దక్షిణాయనప్రారంభసమయం! ఉత్తరాయణం మకరరాశినుంచి మిథునరాశివరకు ఉంటుంది. సూర్యుడు కర్కాటకరాశిలో ప్రవేశించినప్పటినుంచి మకరరాశిలోకి ప్రవేశించేంతవరకు ఉన్నకాలం దక్షిణాయణం. ఉత్తరాయణం, దక్షిణాయనాలను పరిశీలిస్తే దక్షిణాయనంలో పండుగలు అధికంగా వస్తాయి. ప్రకృతిపరంగా చూస్తే దక్షిణాయనం ప్రారంభం వర్షాకాలం. కొత్తనీరు, బురదవంటి ప్రకృతిలోని మార్పులవల్ల క్రిమికీటకాదులు అధికం కావడం, ఫలితంగా ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపించి, అనారోగ్యాలు కలిగే అవకాశం అధికం. ఇలాంటిస్థితిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే కొన్ని నియమాల్ని పాటించాల్సి ఉంటుంది.



అలాంటి అనేక పండుగల్ని వెంట బెట్టుకుని వచ్చే తొలిపండుగ– 'శయనఏకాదశి'. అందుకే దీనికి తొలిఏకాదశి, ప్రథమఏకాదశి అనేపేర్లు వచ్చాయి.

ఈ ఏకాదశినాడే చాతుర్మాస్య వ్రతం ప్రారంభమౌతుంది. ఈ రోజు నుంచి నాలుగునెలలపాటు నిష్ఠానియమాలతో గడిపే వ్రతమే– 'చాతుర్మాస్యవ్రతం!' ప్రధానంగా ఈ వ్రతంలో నాలుగునెలలపాటు ఎక్కడికీ ప్రయాణాలు చేయకుండా ఒకే చోటఉండడం, ఆహారనియమాలు పాటించడం ప్రధాననియమాలు. అంటే నియమబద్ధమైన జీవితం ప్రారంభిస్తున్న రోజు ఈనాడు.

అత్యంతపవిత్రమైన తొలిఏకాదశి రోజు తెల్లవారు ఝామునే నిద్రలేచి, కాలకృత్యాలు తీర్చుకుని, తలస్నానం చేసి, తొలిఏకాదశీవ్రతాన్ని ఆచరించేందుకు సంకల్పించినట్లు శ్రీమహావిష్ణువుకు నమస్కరించుకోవాలి.

అనంతరం ఇంటిలోని పూజామందిరంలోగానీ, పూజ చేయదలచిన చోటగానీ ఏర్పాటు చేసుకున్న పీఠంపైన కలశాన్ని పెట్టడంతో పాటు శేషశయ్యపై శయనించి శంఖ చక్రాలను ధరించి ఉండగా... శ్రీమహాలక్ష్మి పాదాలవద్ద ఆసీనురాలై ఉన్న శ్రీమహావిష్ణువు విగ్రహాన్ని లేదా చిత్ర పటాన్ని ఏర్పాటు చేయాలి.

వివిధపుష్పాలు, పూలమాలలతో, ఆభరణాలతో అలంకరించుకోవాలి. ముందుగా శ్రీవినాయకస్వామిని పూజించి అనంతరం శ్రీమహావిష్ణువును షోడశోపచారాలు, అష్టోత్తరాలతో పూజించి పండ్లు, ఫలాలను నివేదించాలి. ఆ తరువాత –

'ఓ జగన్నాథా! నీవు నిద్రిస్తే ఈ జగమంతా నిద్రిస్తుంది. ఓ తండ్రీ! దేవాదిదేవా!! పరంధామా! నీవు మేల్కొంటే ఈ జగమంతా మేల్కొంటుంది' అని స్మరించు కుంటూ నమస్కరించాలి.

ఈ విధంగా పగలు, సాయంత్రం పూజించి పగలు, రాత్రి ఉపవాసం ఉండాలి. రాత్రి జాగరణ చేయాలి. జాగరణసమయంలో విష్ణుసహస్రనామం, విష్ణుపురాణం, భాగవతం, భగవద్గీత వంటివి పారాయణం చేస్తూ గడపడం మంచిది.

తొలిఏకాదశినాటి మరునాడు అంటే ద్వాదశిరోజు యథావిధిగా పూజలను చేసి, నైవేద్యాన్ని సమర్పించి, ద్వాదశిఘడియలు ఉండగానే భోజనం చేయాలి. ఈవిధంగా తొలిఏకాదశిని జరుపుకోవడంవల్ల ఆయురారోగ్యాలు, అనంతమైన పుణ్యఫలాలు సిద్ధిస్తాయి.

విశ్వదాభిరామం

## వినయం-ఉన్నతి

వేమన పద్యసూక్తి

**అనువు గానిచోట అధికుల మనరాదు;**
**కొంచె ముండు టెల్ల కొదువ గాదు;**
**కొండ అద్దమందు కొంచెమై యుండదా!**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**అర్థాలు:** అనువు = అవకాశము, అనుకూలము; అధికులము = గొప్పవాళ్లం; కొదువ = తక్కువ.

**భావం:** అనుకూలం కానిచోట గొప్పవాళ్లం అని చెప్పుకో కూడదు. తగ్గి ఉండడం అగౌరవం కాదు. కొండ అద్దంలో చిన్నదిగా కన్పించినా, నిజంగా చిన్నది కాదు కదా! సమయం కానివేళ సర్దుకుపోవడం ఉత్తమం.

**వివరణ:** ఎంత గొప్పవాడైనా, తనగొప్పతనాన్ని గుర్తించలేని వాళ్లదగ్గర సామాన్యుడిలాగా తగ్గిఉండటం మంచిది.



అలా ఉన్నందువల్ల తన గొప్ప తనానికి లోపం లేదు.

ఉదాహరణకు సహృదయత లేనివాళ్లకు, కవిత్వ గుణం గ్రహించలేనివాళ్లకు తన కవిత్వం వినిపిస్తే, వినేవాడు ఆనందించడు, అభినందించడు సరి కదా! తనను ఇబ్బంది పెడుతున్నా డని తిట్టు కుంటాడు. అలా అవమానంపాలు కావడంకంటె తనుకూడా సామాన్యుడిలాగే ఉండడం మంచిది. అంతమాత్రంచేత తనకవితకు గాని, తనకు గాని లోటు లేదు.

అసమర్థుడు గుర్తించకపోయినా, ఔన్నత్యం తగ్గదు కదా! ఉత్తముడు కొండలాగా ఉన్నతుడు.

– విద్వాన్ కట్టా నరసింహులు



కడుపులోపలిపుండు కడలేని యాస

# అమ్మ ఉంటే.. ఆనందానికి కరవా?

- డా॥ కంపల్లె రవిచంద్రన్

శ్లో॥ ఐశ్వర్యం య దశేషపుంసి య దిదం
సౌందర్య లావణ్యయోః,
రూపం యచ్చ హి మంగళం కిమపి
య ల్లోకే స దిత్యుచ్యతే
తత్సర్వం త్వదధీనమేవ య దతః
శ్రీరి త్యభేదేన వా,
యద్వా శ్రీమదితీదృశేన వచసా
దేవి! ప్రథా మశ్నుతే॥
(కూరనాథ రచిత శ్రీస్తవం)

**భావం-** పరమపురుషుడైన భగవానునియందు ఏ ఐశ్వర్యం కలదో, సౌందర్య, లావణ్యాల యొక్క ఏ స్వరూపం కలదో, ఏ మంగళం కలదో, లోకంలో మంచి అని ఏది చెప్పబడుతోందో, అదంతా నీ అధీనంలోనే ఉంది. అమ్మా! అందువల్లే, 'శ్రీః' అనీ, 'శ్రీమాన్' అనీ అభేదభావం గల ఇలాంటి మాటతో నీ మహత్త్వం విఖ్యాతమై ఉంది.



**వ్యాఖ్య-** విష్ణువు పరమపురుషుడైన భగవానుడు. సమగ్రమైన ఐశ్వర్యం, ధర్మం, యశస్సు, శ్రీ, జ్ఞానం, వైరాగ్యం- అనే ఆరులక్షణాలు కలవాడు భగవంతుడు. ఇవన్నీ పురుషోత్తముడైన శ్రీమహావిష్ణువులో సంపూర్ణంగా ఉన్నాయి. అతడు సౌందర్యలావణ్యాలకు నిధి. మంగళ స్వరూపుడు. ఇలాంటి విష్ణుభగవానుని మహిమ అంతా లక్ష్మి వల్లనే అతనికి చేకూరింది. మరియు లోకంలో మంచిదిగా చెప్పబడుతున్నదంతా శ్రీదేవి అధీనంలోనే ఉంది.

కనుకనే, 'శ్రీ' కీ, 'శ్రీమంతుని'కీ భేదం లేదు. శ్రీయందున్న శక్తులన్నీ, శ్రీమంతునియందున్నాయి. లక్ష్మి-శ్రీ; విష్ణువు-శ్రీమంతుడు. ఇందులో శాబ్దికమైన లింగభేదం తప్ప, గుణభేదం లేదు. గీతలో "యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవవా। తత్తదేవావగచ్ఛత్వం మమ తేజోఽంశ సంభవమ్" అని ఉంది. (ఈ లోకంలోని ఐశ్వర్యవంతం, శోభాయుతం, ఉత్సాహభరితం అయిన ప్రతివస్తువు నా తేజస్సులోని అంశనుండే కల్గిందని గ్రహించుము) ఇంతటి శక్తి ఆ స్వామికి కల్గడం శ్రీలక్ష్మీకటాక్షంవల్లనే!!

భగవంతుడు జగదేకసౌందర్యలావణ్యశోభితుడు. లావణ్యమంటే ముత్యంలో తిరిగే నీరువలే అవయవాల్లో ప్రకాశించే సౌందర్యకాంతి. లక్ష్మి సౌందర్యలక్ష్మి, లావణ్య లక్ష్మి, ఐశ్వర్యలక్ష్మి, మంగళలక్ష్మి ఇత్యాదిగా అనేకదివ్య రూపాలతో విరాజిల్లుతోంది. ఆమె భోగవైభవసంధాత్రి. ఈ ప్రపంచంలో ఉత్తమవస్తువులు, మహిమలు, శక్తులు, తేజాలు మొదలైనవన్నీ శ్రీస్వరూపాలే! ఆమెఅధీనంలో ఉండేవే! అన్నిటికీ లక్ష్యమైంది గనుక శ్రీదేవి లక్ష్మి అయింది. అందరిచేతా ఆశ్రయింపబడేది- గనుక 'శ్రీ' అయింది. ఇప్పటికీ స్త్రీలకు 'శ్రీమతి', పురుషులకు 'శ్రీయుత' శబ్దాల్ని గౌరవ వాచకాలుగా వాడుతుండడం గమనింపదగ్గ విశేషం. 'శ్రీ' శబ్దం మొదట ఉంటే చాలు సర్వశుభాలూ సిద్ధిస్తాయి!

# జ్ఞానావతారం

- శ్రీమతి పి.విజయలక్ష్మి

విష్ణుదేవుడు లోకశ్రేయస్సును కోరి, మొట్టమొదట హయగ్రీవుడై అవతరించాడు. **ఇది జ్ఞానావతారం.** వాసుదేవుని అన్నిఅవతారాల్లో ఇదే మొట్టమొదటిది. అన్నిటికీ మూలం జ్ఞానమే! హయగ్రీవు డంటే గుర్రం మెడవంటి మెడ కలవాడు. గుర్రం సకిలించేధ్వనిని 'హేష' అంటారు. ఈ ధ్వని ప్రణవరూపంగా భగవంతుడైన హయగ్రీవస్వామినుండి వెలువడింది. కనుక ఈ హేషాధ్వనిప్రభావం మహత్తరం. సృష్టియజ్ఞంలో విరాడ్రూపునినుండి మొట్టమొదట వెలువడింది - అశ్వం. "తస్మా దశ్వా అజాయంత" (పురుష సూక్తం) అని వేదం పేర్కొంది. హయ మంటే శీఘ్రంగా పోయే దని వ్యుత్పత్తి. సృష్టిలో మొదటిరూపం కనుక హయగ్రీవావతారాన్ని భగవంతుని ప్రథమావతారంగా మహర్షులు నుతించారు.

'హేషా' అంటే అవ్యక్తంగా మ్రోగేది. సాక్షాద్విష్ణువే ఈ హయగ్రీవస్వామి కనుక సర్వత్రగమనశక్తి, సర్వవ్యాపకత్వం, శీఘ్రగామిత్వం కల్గి, ప్రణవ (ఓంకారం) స్వరూపుడై హయగ్రీవుడు జ్ఞానదాత అయిన ఆదిగురువు అయ్యాడు. ఈ స్వామి విద్యామూర్తి. ఈయన జ్ఞానానందమయుడు. నిర్మలమైన స్ఫటికంవంటి ఆకారం కలవాడు. సర్వవిద్యలకూ ఆధారమైనవాడు. హయగ్రీవుడనే రాక్షసుణ్ణి ఈ రూపంతో సంహరించా డనీ, మధుకైటభుల్ని ఈ రూపంతో కూల్చి, వేదాలు ఉద్ధరించా డనీ పురాణాలు పేర్కొన్నాయి.

**హయగ్రీవస్వామిని పూజించడానికై మొదట బ్రహ్మ తన భార్యయైన సరస్వతిని నియమించాడు. ఆమె ఈ మూర్తికి విగ్రహరూపం కల్పించుకొని పూజించింది. శ్రీరామానుజులవారూ, శ్రీవాదిరాజులవారూ ఈస్వామిని సేవించి, మహాజ్ఞాను లయ్యారు.**

సరస్వతి రామానుజులవారికి సాక్షాత్కరించి, కాశ్మీరంలో శ్రీలక్ష్మీహయగ్రీవమూర్తిని ప్రసాదించింది. వారినుండి- వారిశిష్యులు పిళ్లైగారికి, వారినుండి వేదాంతదేశికులవారికీ గురుశిష్యక్రమంలో సంక్రమించింది. ఆ దివ్యవిగ్రహమే నేడు మైసూరులోని శ్రీబ్రహ్మతంత్ర స్వతంత్ర పరకాలమఠంలో ఆచార్యులచే అర్చించబడుతూంది. ఇలా భూలోకంలో హయగ్రీవమూర్తిపూజ ప్రారంభమయ్యింది.

వేదాంతదేశికులవారు శ్రీహయగ్రీవస్తోత్రంలో హయగ్రీవస్వామిని త్రిమూర్త్యాత్మకునిగా, అందుకు మూలమైన పరమాత్మగా నుతించారు. దేవలోకంలోనూ, భూలోకంలోనూ జ్ఞానమూర్తిగా, జ్ఞానదాతగా గురుస్థానీయుడై నతులూ, నుతులూ అందుకొన్న ఆదిగురువు- హయగ్రీవులవారు. ఈ ఆదిగురువును ఉపాసించేవారికి భౌతికవిద్యలే కాక- పురుషుడు పురుషోత్తముడు కాగల ఆధ్యాత్మిక జ్ఞానమూ సిద్ధిస్తుంది. సంసారసముద్రాన్ని దాటడానికి హయగ్రీవుని దయ నావ.

విద్యార్థులు ప్రతిదినం ఉదయం-

**జ్ఞానానందమయం దేవం, నిర్మలస్ఫటికాకృతిమ్ ।**
**ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవ ముపాస్మహే ॥**

అని నుతించడంవల్ల ఉత్తమవిద్యాసంపన్నులు కాగలరు.



గత
సంచిక
తరువాయి
భాగం..

ధారావాహిక-15

# శ్రీకృష్ణభగవద్విజయం

డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు

హంసడిభకులు ప్రేమాదరహృదయాలతో తమ మందిరాలలో ప్రవేశించి తమభార్యలను సమీపించారు. వారిభార్యలు నేలమీద చాపలమీద శయనించి ఉన్నారు. మాసినచీరలు ధరించి, విడివడిన జుట్టు కలిగి, ఏకభుక్తనియమంతో నీరసంగా ఉన్నారు. భర్తలు తపోభూమికి వెళ్లినప్పటినుండి ఆ భార్యలిలా భూశయనవ్రతాన్ని పాటిస్తున్నారు.

సమీపించిన భర్తలను చూడగానే ఆ జవరాళ్లకు జవసత్త్వాలు తిరిగి వచ్చాయి. కనుకొలకులలో ఆనందబాష్పాలు నిలిచాయి. ప్రణయరసం పొంగినహృదయాలతో హంసడిభకులు తమ ప్రియభార్యలను మృదువుగా స్పృశించి, ప్రక్కనే కూర్చుండబెట్టుకుని కురులు సవరించారు.

అ

**హంసుడు :** దేవీ! వచ్చేశాను.

**హంసుని భార్య :** వచ్చేశారా ప్రాణేశ్వరా! గిరిజాశంకరుడు కరుణించాడా?

ఆ

**డిభకుడు :** సాధారణంగా కరుణించటం కాదు దేవీ! దివ్యశక్తులిచ్చి కరుణించాడు.

**డిభకునిభార్య :** అంబికానాథుడు ఆశుతోషు దని మనవిషయంలో కూడా రుజువైంది. చాలా సంతోషం నాథా!

అ + ఆ

**హంసుడు :** నేటితో భూశయనవ్రతం సమాప్తం.

**డిభకుడు :** ఇక హృదయశయనవ్రతం ప్రారంభం దేవీ!

రాజనందనులు అనురాగాతిశయంతో తమ ఇల్లాళ్లను గాఢంగా హృదయాలకు హత్తుకున్నారు. ఆనందబాష్పాలతో భార్యలు భర్తల హృదయాలను అభిషేకించారు. చతుర్వదనాలలో ప్రణయశోభ పరిఢవిల్లింది.

14

మగధచక్రవర్తి జరాసంధుడు భైరవార్చన ముగించి వచ్చి, తనమందిరంలో ప్రవేశించాడు. అతని రాకకోసమే నిరీక్షిస్తున్న హంసడిభకులు, శిశుపాలదంతవక్త్రులు అతణ్ణి చూడగానే ఆసనాలనుండి లేచి నిలబడ్డారు. అతడు సమీపించగానే ఆనలుగురు ఒకేసారి "మగధ సమ్రాట్టులకు ప్రణామాలు" అంటూ చేతులు జోడించారు. కూర్చోండి – అని మగధపతి కూర్చున్న తరువాత ఆసోదరులు, ఈ సోదరులు ఆసీనులయ్యారు.

**జరాసంధుడు :** మిత్రులారా! హంసడిభకులారా! మీరు మీ రాజధానికి చేరినట్లు విన్నప్పటినుండి మీరాకకోసమే ఎదురు చూస్తున్నాను. ఇప్పుడు ఎదురుగాచూస్తూ ఆనందిస్తున్నాను. నిష్ఠతో నీలకంఠుణ్ణి మెప్పించి వచ్చినందుకు మీఅన్నదమ్ములను అభినందిస్తున్నాను.

**హంసడిభకులు :** కృతజ్ఞులం చక్రవర్తీ!

**జరాసంధుడు :** మేముకూడా మీపట్ల కృతజ్ఞులమే సాల్వ రాజకుమారులారా! మథురానగరదండయాత్రలలో మీరు మా సైన్యాధ్యక్షులై వ్యవహరించినతీరు, మీ పోరు మేము స్మరిస్తూనే ఉన్నాము.

**శిశుపాలుడు :** ఆ కుటిలయాదవుడు, పశుపాలుడు, వాసుదేవుడు కూడా స్మరిస్తూనే ఉంటాడు... భయంతో.

శిశుపాలునిచమత్కృతికి అందరూ పెద్దగా నవ్వుకున్నారు.

**హంసుడు :** తమ భైరవార్చన ఆటంకం లేకుండా సాగుతున్నది కదా మగధేశ్వరా?

**డిభకుడు :** ఎందుకు సాగదన్నా, చెఱనిండా ధరణీపతులుండగా.

**జరాసంధుడు :** సొబగు పలికావు డిభకా!

**శిశుపాలుడు :** మగధనాథా! మహేశ్వరుడు తమరిని బ్రాహ్మణ పూజతో తరించమని ఆదేశించిన సంగతి తెలిసి, నానా దేశాలనుండి బ్రాహ్మణులు తమ దర్శనానికి వస్తున్నారట! వారడిగింది లేదనకుండా తమ రనుగ్రహిస్తున్నారట! విప్ర సంఘాలు తమరిని వేనోళ్ల పొగడుతుంటే మా చెవులారా విని పులకించిపోతున్నాము బృహద్రథనందనా!

**జరాసంధుడు :** అవును దమఘోషనందనా! బ్రాహ్మణులడిగింది లేదనకుండా ఇవ్వటంవల్ల ఇటు బ్రాహ్మణపూజ నిర్వ హించినట్లు, అటు నీలగ్రీవునిశాసనాన్ని పాలించినట్లు అవుతుంది కదా!

**హంసుడు :** కాని....

**జరాసంధుడు :** కానీ?

**హంసుడు :** ఆ బ్రాహ్మణులలో కొందఱు తమభైరవపూజను వ్యతిరేకిస్తున్నట్లు వినికిడి.

**జరాసంధుడు :** మేమూ విన్నాము హంసా! అందఱికీ ఇష్టమైన పనులు ఎవ్వరూ చేయలేరు.

**డిభకుడు :** లెస్సమాట చక్రవర్తీ! ఈసమస్య మాకూ ఉంది. మాకు జనార్దను డని బ్రాహ్మణమిత్రుడున్నాడు. మాపనులు కొన్ని అతనికి నచ్చవు. అతనిపనులు కొన్ని మాకు నచ్చవు. ముఖ్యంగా ఆ యాదవవాసుదేవుణ్ణి మా జనార్దనుడు నిరంతరం స్మరించటం మాకేమాత్రమూ నచ్చదు.

**శిశుపాలుడు :** మూఢభక్తులు ఆ పసులకాపరిని భగవంతుడని నమ్ముతున్నారు. దగ్గఱిబంధువులమైన మేముమాత్రం సామాన్య మానవునిగానే నిశ్చయించాం. మా నిశ్చయంలో మార్పు లేదు, రాదు.

**జరాసంధుడు :** స్థిరనిశ్చయాలే ఉన్నతగతికి బాటలు వేస్తాయి– శిశుపాలా!

**దంతవక్త్రుడు :** నాకొక సందేహం చక్రవర్తీ!

**జరాసంధుడు :** ఏమిటది దంతవక్త్రా?

**దంతవక్త్రుడు :** బ్రాహ్మణులడిగిందే తడవుగా వారు కోరింది వారికిస్తున్నారు తమరు. ఎప్పుడైనా తమరంటే గిట్టని బ్రాహ్మణులు గాని, కపటబ్రాహ్మణులు గాని వచ్చి, తమరి ప్రాణాలే కావాలని యాచిస్తే?

**జరాసంధుడు :** సంతోషంగా సమర్పిస్తాం. శివశాసనాన్ని శిరస్సున తాల్చటమే ఈ మాగధునిపరమకర్తవ్యం. యశస్సంపదముందు ప్రాణాల విలువెంత?

అంటూ గంభీరంగా నిలబడ్డాడు. మిత్రులుకూడా విస్మయమగ్నచిత్తులై నిలబడ్డారు. వెంటనే అర్ధరాత్రఘంటా నాదం వినిపించింది. పరస్పరం శుభరాత్రి చెప్పుకుని శయన మందిరాలకు మరలారు.

## 15

ఋతుచక్రం ఋజుపద్ధతిలో కదిలిపోతున్నది. సాల్వ రాజనందనులు హంసడిభకులు ఋతుశోభల కనుకూలంగా తమ భార్యలతో విహరిస్తూ శృంగారరసాబ్ధితరంగాలమీద తేలి యాడుతున్నారు. వారికి ప్రతిదినమూ నవానందసంధాయకమై సాగిపోతున్నది.

పద్మావతీజనార్దనులు మాత్రం సంసారంలో ఉన్నా కంసారినిమాత్రం మఱవకుండా జీవిస్తున్నారు. దినచర్యలో సింహభాగం శ్రీకృష్ణపూజావిధానాలకే వినియోగిస్తున్నారు. వారు ఏపని చేసినా పనిప్రారంభంలోను, పనిముగింపులోను వాసు దేవస్మరణం తప్పనిసరి.

ఇక సర్వజ్ఞుడైన చక్రధరుడు సంసారిలాగా, సామాన్యుని లాగా నటిస్తున్నాడు. మనస్సులోనే కాలబలాన్ని గౌరవిస్తూ, దుష్ట శిక్షణకోసం వేచిచూస్తున్నాడు. తన ప్రణాళికలన్నీ అంతరంగం లోనే రచిస్తున్నాడు.

ఒకనాడు ముకుందుడు జాంబవతీమందిరంలో ఉండగా జాంబవతితోపాటు కాళింది, మిత్రవింద, భద్ర, నాగ్న జితి, సులక్షణ– కలసి స్వామికి శృంగారాలంకారం చేస్తున్నారు. అంతలో మధురిక అనే చెలికత్తియ ప్రవేశించి, "జయము జయము శ్రీకృష్ణదేవులకు" అని వినయంగా నిలిచింది. ఏమిటి మధురికా? అని ప్రశ్నించాడు–ప్రభువు.

మగధనుండి ఒక బ్రాహ్మణుడు తమదర్శనానికి వచ్చా డట! గోష్ఠీ మందిరంలో బలదేవులతోను, తమ్ములుంగారితోను భాషిస్తున్నాడట! బలదేవులు తమరిని రమ్మన్నారట!

అని విన్నవించి వెళ్లింది– మధురిక. జాంబవతీ! కిరీటం–స్వామి పలకగానే జాంబవతి స్వామిశిరస్సుపై కిరీటాన్ని అమర్చింది. సాలోచనగా స్వామి గోష్ఠీమందిరంవైపు సాగి పోయాడు.

*(ఇంకా ఉంది)*

# సందేహాలు - సమాధానాలు

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ



**1) 'సాకేతం' అనే మాటకు అర్థం ఏమిటి? అయోధ్యకు ఈ పేరెందుకు వచ్చింది? మోక్షపట్టణాల్లో ఒకటిగా దీన్ని పేర్కొనడంలో కారణం ఏమిటి?**

'సాకేతం' అంటే 'సంపూర్ణజ్ఞానంతో కూడినది' అని అర్థం. అలాగే 'అయోధ్య అంటే 'ఇతరులు యుద్ధం (దాడి) చేయలేనిది' అని అర్థం. 'కిత' ధాతువు జ్ఞానార్థకం. దాని నుండి జనించిన 'కేత' శబ్దం, 'అఙ్' పూర్వకమై సంపూర్ణ జ్ఞానాన్ని తెలియజేస్తుంది. ఆకేతం=సంపూర్ణజ్ఞానం. అటువంటి జ్ఞానంతో కూడింది- స+ఆకేతం=సాకేతం. నిజానికి ఈ రెండింటికీ వైకుంఠపరమైన అర్థం ఉంది. ప్రకృతివికారాలకు లోనుకానిది 'అయోధ్య'. కేవల చిన్మాత్రభూమిక కనుక 'సాకేతం'. మాయాతీతమైన బ్రహ్మజ్ఞానస్థితి. భూమిపై వైకుంఠవిభూతి కలిగిన పట్టణం ఈ మన్వంతరారంభంనుండి సూర్యవంశీయులైన మనువు మొదలుకొని దివ్యచక్రవర్తులు ఈ ప్రాంతాన్నే రాజధానిగా చేసుకొని భూమండలాన్ని పరిపాలించారు. ఇలాంటి వైకుంఠవిభూతి కల ప్రాంతంలోనే వైకుంఠవాసుడు అవతరించాడు. అసలు వైకుంఠకళే అక్కడ ఉంది. ఆపై-శాంతి, జ్ఞానం విలసిల్లే ఆ దివ్యనగరంలో తారకబ్రహ్మమైన శ్రీరాముడు జన్మించి, పాలించిన కారణంగా అది మోక్షపట్టణం అయింది.

**2) పూజాదికాలు చేస్తున్నప్పుడు మధ్యలో తుమ్మువంటివి వస్తే, పూజ నిష్ఫలమా?**

శాస్త్రరీత్యా పూజాదికాల సమయంలో కన్నీరు కారినా, క్రోధం కలిగినా, అపానవాయువు, తుమ్ము వంటివి కలిగినా, అశౌచులను చూచినా-ఆచమనం చేస్తే ఆ దోషాలు పోతాయి. అదేవిధంగా కుడిచెవిని కుడిచేతితో తాకాలి.

**3) 'దశదానాలు' అంటే ఏమిటి?**

పదిరకాల దానాలను 'దశదానాలు' అంటారు. శాస్త్రపరంగా ఆ పది- 1)గోవు, 2)భూమి, 3)తిలలు (నువ్వులు), 4)సువర్ణం, 5)ఘృతం (నేయి), 6)వస్త్రం, 7)ధాన్యం, 8)బెల్లం, 9)వెండి, 10)లవణం (ఉప్పు).

**4) దీపం పెట్టేటప్పుడు వత్తి ఏ ముఖంగా ఉండాలి. రాత్రి దీపం ఎంత వరకు ఉండాలి?**

దీపం తూర్పుముఖంగా ఉంటే ఆయుస్సు, ఉత్తర ముఖంగా వెలిగిస్తే ధనప్రాప్తి. పడమరముఖంగా, దక్షిణ ముఖంగా వెలిగించరాదు. పడమరముఖం దుఃఖాన్నీ, దక్షిణ ముఖం కీడును కలిగిస్తాయి.

సూర్యుడు అస్తమించింది మొదలు, మళ్లీ సూర్యోదయం వరకు ఇంట్లో దీపం వెలుగుతుండాలి. అలా దీపం వెలిగే ఇంట్లో దరిద్రం ఉండదు.

**5) వడ్డించేటప్పుడుకూడా మనవాళ్లు పదార్థాలు ఏ వైపున వడ్డించాలో, ఎలా వడ్డించాలో చెపుతుంటారు. ఆ నియమాలు ఏమిటి? ఎందుకా నియమాలు?**

మన ప్రాచీనులదృష్టిలో అన్నం తినడం కేవలం కడుపు నింపుకోవడం కాదు. అనేక దేవతాశక్తుల ప్రభావం అన్నంపై ఉంటుంది.

జీవకోటికి దేహ, మనః, ప్రాణాలను సమకూర్చే అన్నాన్ని పవిత్రం చేసుకోవడంవల్ల జీవితం శుద్ధమై, సిద్ధులను పొందగలదు. అందుకే నియమాలు.

అరటి ఆకును వేసేటప్పుడు ఈనె తీయకూడదు. ఆకు చివరిభాగం ఎడమవైపుగా ఉండేటట్లు పెట్టుకోవాలి. విస్తరిలో మొదట ఎదురుగా కూరలు, కూరల వద్దన అయిన తరువాత విస్తరిమధ్యలో అన్నం, ఆ పిమ్మట విస్తరిలో కుడివైపున పాయసం, పప్పు-ఎడమవైపున పిండివంటలు, చారు, చివరకు పెరుగు వడ్డించాలి. భోజనం ప్రారంభించక ముందే ఉప్పును వడ్డించకూడదు. ఉప్పు ఒక్కదానిని ప్రత్యేకించి వడ్డించరాదు. తినడానికి ముందే ఉప్పునూ, తినడం ప్రారంభమైన తరువాత నేతినీ, పాయసాన్నీ వడ్డించరాదు. పాయసాన్నీ, నేతిని ముందుగానే వడ్డించాలి. పూర్ణిమ, అమావాస్యలలో రాత్రిపూట భోజనం చేయరాదు. వడ్డన అయిన పిమ్మట అన్నాన్నీ, పిండివంటలనూ, పాయసాన్నీ ఘృతంతో అభిఘరించాలి. కూరలు, పచ్చళ్లను అభిఘరించనవసరం లేదు.

# భగవద్గీత-యువత

## శారీరిక తపస్సు విజయానికి తొలిమెట్టు

డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్

ఈ జగత్తులో ఏది సాధించాలన్నా మనిషికి తపోబలం ఉండాలి. నిజానికి ఈ జగత్సృష్టి జరిగినప్పుడు మొట్ట మొదటగా వినిపించినశబ్దం "తప". నారాయణుని నాభి కమలంలో ప్రభవించిన బ్రహ్మదేవుడు తన కార్యమేమిటో తెలియకుండ ఉండిపోయినప్పుడు "తప" అనే మాట రెండుసార్లు వినిపించింది. అది విని బ్రహ్మదేవుడు తపస్సులో మునిగి, ఆ తరువాత అద్భుతంగా సృష్టికార్యం చేశాడు.

మనంకూడా ముచ్చటగా మూడురకాల తపస్సులు చేస్తూ తపోబలాన్ని పొంది విజయాలను సాధించవచ్చునని భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు తెలిపాడు. ఆయన చెప్పిన తపస్సులేమిటో తెల్సుకొందాం!

విజయం వైపునకు నడిచేమార్గంలో తొలిఅడుగు శారీరికతపస్సుద్వారా వస్తుంది. "దేవదేవుణ్ణి, బ్రాహ్మణుల్ని, గురువును, తల్లిదండ్రులవంటి పెద్దలను పూజించడం, శుచిత్వం, సరళత్వం, బ్రహ్మచర్యం, అహింస అనేవి శారీరికతపస్సులో ఉంటాయి" అని భగవద్గీత (17-14) చెబుతోంది.

ప్రతీ మానవుడు ఈ తపస్సులను ప్రతినిత్యం చేయాలి. యువత వీటిని అప్పుడప్పుడు చేయడం మనకు కనిపిస్తూనే ఉంటుంది. ఉదాహరణకు భగవంతునికి, తల్లిదండ్రులకు దండం పెట్టడం, ముఖ్యంగా పరీక్షల సమయంలో వారిలో కనిపిస్తుంది. అలాగే, పుట్టినరోజు, పండగరోజున, పరీక్షలో ఉన్నతమైన ర్యాంకు వచ్చినరోజున తల్లిదండ్రులపట్ల పూజ్యభావం సర్వసాధారణంగా ఉంటుంది. అయితే, గీతాచార్యుడు చెప్పినట్లు భగవంతుడిని, బ్రాహ్మణులను, గురువులను, తల్లిదండ్రులవంటి పెద్దలను నిత్యము పూజించాలి, వారికి భక్తిప్రపత్తులతో నమస్కరించాలి. ఇది శారీరికతపస్సులో ఒక భాగం. తల్లి దండ్రులకు వంగి నమస్కరించగానే సహజంగానే వారి నోటి నుండి, హృదయం నుండి ఆశీర్వాదం లభిస్తుంది.



దీంతోపాటు శుచిత్వం, సరళత్వంకూడ శారీరిక తపస్సుగానే చెప్పబడ్డాయి. శుచిత్వమనేది బాహ్య, అంతర శుచిత్వాలను సూచిస్తుంది. రోజుకు రెండుసార్లు స్నానం చేయడం బాహ్యశుచిత్వానికి గుర్తు అయితే, రోజుకు కనీసం 15 నిముషాలు భగవద్ధ్యానంలో గడపడం అంతరశుచిత్వానికి గుర్తు. మృదుస్వభావాన్ని కలిగి ఉండడం, నెమ్మదితనం సరళత్వంగా చెప్పబడతాయి. బ్రహ్మచర్యంకూడా శారీరిక తపస్సే. అనేకవ్రతదీక్షలు పట్టేవారు ఈ బ్రహ్మచర్యాన్ని తప్పకుండ పాటించడం కనిపిస్తుంది. ఇది గీతలో చెప్పబడ్డ సూత్రం. యువత దీన్ని కచ్చితంగా పాటించి నిర్మల మనస్కులై ఉండాలి. అలాగే అహింసను పాటించాలి. మాంసభక్షణ చేయకపోవడమే అహింస. శాఖాహారంద్వారా మనస్సు నిర్మలంగా ఉంటుంది. శరీరం ఆరోగ్యంగా ఉంటుంది, అది ఒక శారీరికతపస్సులాగా అవుతుంది. ఈ విధంగా శారీరికతపస్సు చేసేవ్యక్తి నిశ్చయంగా తపోబలసంపన్నుడై వాంఛితఫలాలను సాధిస్తాడు. కావాలంటే మీరు ఒక నెల రోజులపాటు ఈ శారీరకతపస్సును ఆచరించి చూడండి. గీతావాక్యమహిమ మీకే తెలుస్తుంది!

*విజయోఽస్తు!!*

గత సంచిక తరువాయి భాగం.....




## అన్నమయ్య బాల్యం

పుట్టింది కారణజన్ముడు. తల్లిదండ్రులు పరమభాగ్యవంతులూ, ధర్మపరాయణులూను. పుష్పం పుట్టగానే పరిమళం అబ్బినట్లు అన్నమయ్యకు చిన్నవయసులోనే పరమసుజ్ఞాన సంపద అలవడింది. నందకాంశజుడు కావడంవల్ల అన్నమయ్యకు చిన్నతనంనుండే ఆధ్యాత్మికచింతన అలవడింది. ఆ జ్ఞానంతో తల్లి నేతిబువ్వ తినిపించే ప్రయత్నం చేస్తే తినేవాడు కాదు. ఇది తిరుమలేశుని దివ్యప్రసాదమని చెబితేనే తినేవాడు.

నీటికి పల్లం ఎటుందో ఒకరు చెప్పాలా? తేనెటీగకు మందారపూలలోని మకరందాన్ని ఒకరు రుచి చూపించాలా? రాజహంసలకు మందాకినీవీచికలలో తేలియాడడం ఒకరు నేర్పించాలా? మావిచిగుర్లు తిని, మత్తుగా కూసే కోకిలకు ఒకరు స్వరాలు నేర్పించాలా? నిండు జాబిల్లి వెన్నెలను ఆస్వాదించమని చకోరకపక్షికి ఒకరు తెలియజెప్పాలా? కారణజన్ములకు అంబుజోదరదివ్యపాదారవిందచింతనామృతపానము స్వతసిద్ధంగా అలవడుతుంది. అన్నమయ్యజన్మభగవత్సంకల్పం. అన్నమయ్యగానం భగవంతునిలీలావిన్యాసం. తనపై పదం కట్టి, పాట పాడి, తనను పరవశింపజేయాలని కలియుగదైవమైన ఏడుకొండలవాడివరంతో, శ్రీహరిసంకల్పమాత్రావశిష్టుడిగా జన్మించిన అన్నమయ్యకు శ్రీహరి భక్తి ఒకరు నేర్పించాలా?

ఎడపక తొట్టెలో నిడి యెంత పాటు
పడి యెంతవడి జోలఁ బాడెనేనియును
వేంకటపతిపేరు వివరించి పాటఁ
బొంకించ కుండినఁ బోరూఅడిలఁడు;
కొండలప్పనికి మ్రొక్కుమటంచు ననక
యొండులాగుల జతులొనరించఁ దతఁడు
ఈ లీల శేషశైలేంద్రునిమీఁద
బాళినే పడియుండుఁ బసిబిడ్డఁ దయ్యు
(అన్నమాచార్యచరిత్ర ద్విపద, పుట. 109, 110)

ఊయలతొట్టిలో పడుకోపెట్టి ఎంతసేపు ఊపినా, ఎన్ని జోలపాటలు, లాలిపాటలూ పాడినా శ్రీవేంకటేశ్వరునిపేరు వినపడకపోతే నిద్రపోయేవాడు కాదు. ఎన్నిపూజలు చేసినా కొండలరాయుడికి మొక్కమంటే తప్ప- కనీసం నమస్కారమైనా పెట్టేవాడు కాదు. లోకం తెలియని పసిబిడ్డకు వేంకటేశ్వరునిపై ఇంతటిభక్తి ఎలా సాధ్యమౌతుంది? పూర్వపువాసనలు తప్ప. కారణజన్ములకు, తమజన్మకారణాన్ని ఎప్పుడూ ఒకరు పని కట్టుకొని చెప్పాల్సిన అవసరం లేదు. అలాగే శ్రీవేంకటేశ్వరుని భక్తిరసాస్వాదన అన్నమయ్యకు ఒకరు నేర్పించాల్సిన అవసరం లేదు.

## అన్నమయ్య విద్యాభ్యాసం

అన్నమయ్య శుక్లపక్షచంద్రునిలా దినదినప్రవర్ధమానమౌతూ అయిదవ వసంతంలోకి అడుగుపెట్టాడు. అపార పాండితీగరిమ కలిగిన నారాయణసూరి బిడ్డడికి ఉపనయనం చేయించాడు. ఆజన్మసుజ్ఞాననిధికి బ్రహ్మోపదేశం చేశాడు. అన్నమయ్యచేత తండ్రి వేదాధ్యయనం చేయించాడు. శేషశైలేంద్రుడైన శ్రీవేంకటేశ్వరునికృపాకటాక్షవీక్షణ పుష్కలంగా కలిగిన అన్నమయ్య జిహ్వాపై వైదిక,నైతికవిద్యలు నాట్య

మాడాయి. ఆ చిన్నవయసులో అతను మనసుకిష్టం వచ్చి  నట్లు మాట్లాడిన మాటలన్నీ అమృతకావ్యమైనాయి. పాడిన పాటలన్నీ పరమగానంగా పరిఢవిల్లాయి. తనకవిత్వాన్ని, తన గానాన్ని తాళ్లపాకపురప్రజలు వేనోళ్ల కొనియాడుతుండగా వేంకటపతి మీద అబ్బురపరిచేరీతిలో స్తుతిగీతాల్ని పాడాడు.

ఇంట్లోని వారు అన్నమయ్యకు ఏ పని అప్పజెప్పినా విసుగు చెందకుండా చేసేవాడు. తల్లిదండ్రులు పురమాయించిన పనులు ఆనందంగా పూర్తిచేసే వాడు.  కుటుంబసభ్యులు ఏ పనిచెప్పినా మారుమాట్లాడకుండా చేశాడు.

అలా ఒకనాడు తల్లిదండ్రులు ఆవులకు గడ్డి కోసుకు రమ్మని పురమాయించారు. అన్నమయ్య పదునైన కొడవలి పట్టుకుని, పశువులకు గడ్డికోసం ఊరిబయటకు వెళ్లాడు. చేత పదునైన కత్తిపట్టుకుని పోయింది పశువులకు గడ్డి కోసం కాదు. కత్తికంటే పదునైన తనపదాలతో శ్రీహరిని ఉర్రూత లూగించడంకోసం. అది శ్రీవేంకటేశ్వరునిసంకల్పం.

పశుగ్రాసంకోసం వెళ్ళిన అన్నమయ్య చేతిలోని కొడవలితో గడ్డికోయబోయి చిటికెనవేలు కోసుకున్నాడు. చేయి రక్తమోడుతోంది. చేతిలోని కొడవలి నేలజారింది. కాసేపు ఏమి జరుగుతోందో అర్థంకానిఅవస్థలో ఉన్నాడు. ఆ క్షణంలో తాను ఎందుకొచ్చాడో? ఏమి చేస్తున్నాడో? అనే ప్రశ్న మనసులో మెదలినట్లైంది. తనకు పనులు పురమాయించే వాళ్లు  ఏనాటిచుట్టాలు? తాను వాళ్లకు ఏనాటిబంధువు? అనే ప్రశ్న వేధించింది.

చరాచరసృష్టి అంతటికీ శ్రీహరే బంధువు. ఆ శేషాద్రి రమణుడే తనకు తల్లీ, తండ్రీ, గురువూ, దైవం, నెచ్చెలీ సర్వమున్నాను– అని అనుకుంటున్న సమయంలో ఎక్కడినుండో గోవిందనామస్మరణ చెవులపడింది.

నాలుగువైపులా పరిశీలించి చూడగా రామదండులా కోలాహలంగా తాళ్లపాకనుండి తిరుమలయాత్ర చేస్తున్న భక్త బృందం కనిపించింది. ఆ సమూహంలో కొందరు తంబురలు వాయిస్తున్నారు. ఇంకొందరు కంచుతాళాలతో తాళం వేస్తు న్నారు. మరికొందరు పెద్దపెద్దమృదంగాలు వాయిస్తున్నారు. ఆ శబ్దాలకు రసరమ్యంగా గానమాలపిస్తున్నారు కొందరు. అన్నమయ్యకు ఆ భక్తజనసమూహం ఆక్షణంలో సనకసందాది మహర్షులవలె తోచారు. ఆ భక్తజనసమూహంతో పాటు తనకు తెలియకుండానే అనుసరించాడు– అన్నమయ్య.

## అన్నమయ్య తిరుమల ప్రయాణం

కోనేటి రాయఁడె కొండలవాఁడె
కానిక రూకల కణఁజాలవాఁడె
వరుస బంగరు మేడవాఁడె తిమ్మప్ప
వరముల రాయఁడె వాఁడె తిమ్మప్ప
గొద్దురాలికి నైనఁ గొమరుల నొసఁగి
వడ్డికాసులఁ గొనువాఁడె తిమ్మప్ప

(అన్నమాచార్యచరిత్ర ద్విపద, పుట. 109, 110)

కోనేటిరాయడు, ఏడుకొండలవాడు, వడ్డికాసులవాడు, బంగారుమేడలవాడు, వరాలు గుప్పెడువాడు అంటూ పరిపరి విధాలుగా స్తుతిస్తూ సాగుతున్న ఆ భక్తజనసందోహం వెంట అన్నమయ్య వెళుతున్నాడు. ఆ భక్తజనంతోపాటు యాత్ర సాగించిన అన్నమయ్య తిరుపతి గంగమ్మగుడికి చేరుకుని ఆమెకు అనేకనమస్కారాలు చేశాడు. అక్కడినుండి తిరుమలకు కొండ ఎక్కుతూ నరసింహస్వామివారిని, కాలిబాటలోని తల యేరుగుండును సందర్శించుకున్నాడు. పవిత్రమైన, పరమ పావనమైన, తిరుమలకొండల అందాలను తనివితీరా సంద ర్శిస్తూ, పులకరించిపోతూ, మైమరచిపోతూ మోకాళ్లపర్వతం చేరుకున్నాడు. పుట్టినదాదిగా తల్లిని విడిచి ఎప్పుడూ బయటకు రాని అన్నమయ్య ఆకలితో సుదీర్ఘప్రయాణం సాగిస్తూ ఉండడం వల్ల అలసిపోయాడు. అలసిసొలసి ఒక బండపై పరున్నాడు.

*(ఇంకా ఉంది)*




**భక్తులకోసం...**

అలిపిరినుండి కాలిబాటలో భక్తులకు
దారిపొడవునా త్రాగునీటి వసతి కల్పించబడింది.

మరియు రక్షణనిమిత్తం తి.తి.దేవస్థానం
సెక్యూరిటీ గార్డులను నియమించింది.



# దేవదేవునికి... లాలిపాటలు

– డా॥ ఎన్. అనంతలక్ష్మి

లాలి అనే మాటను జోల అనే అర్థంలోనే ఉపయోగించటం జరుగుతుంది. జో కొడుతూ లాలించటమే జోల. ఈ లాలి, లేక, జోలపాటలు ఉయ్యాల ఊపుతున్న లయలో సాగుతాయి. లాలి అన్న మాటే ఎంత లలితంగా ఉన్నదో కదా! పాటలోని సాహిత్యం, సంగీతం తల్లికంఠ స్వరంలోని ఆప్యాయతతో మేళవించి, బిడ్డకు భద్రత్వ భావాన్ని, హాయిని కలిగిస్తాయి.

బిడ్డని లాలించటం, లాల పోయటం, గోరుముద్దలు పెట్టటమే కాదు– జోలపాడి నిద్రబుచ్చుటంకూడా తల్లి చేసినట్టు మరెవ్వరు చేయలేరు.

తాళ్లపాకఅన్నమాచార్యులవలే తనజీవితాన్ని, సాహిత్యాన్ని వేంకటకుధరాధ్యక్షుడికి ముడుపు కట్టిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ భక్తకవయిత్రులలో అగ్రగణ్య. ఆమెరచనల్లో నృసింహతత్త్వం, వేంకటేశ్వరతత్త్వం, కృష్ణతత్త్వం, భక్తి, ప్రపత్తి, యోగశాస్త్రవిషయాలు ఉంటాయని అందరికి తెలుసు. ఆమెలో ప్రకృతిసహజంగా అంతర్నిహితంగా ఉన్న మాతృత్వ భావన రచనల్లోనూ సందర్భానుసారంగా తొంగిచూచింది. వెంగమాంబవంటి వసుధైవ కుటుంబకం అయినవారి మాతృప్రేమ విశ్వమంత విస్తరిస్తుంది. అది ఆమెజీవితంలో తారసపడ్డ వ్యక్తులమీదనే కాదు సాహిత్యంలోనూ ప్రతిబింబించింది. అందుకే అందరి చేత మాతృశ్రీ అని మన్నించబడింది.

ఈ మాతృభావన వెంగమాంబ లాలిపాటల్లో వ్యక్తమౌతుంది.

జలక్రీడావిలాసంలోనూ, విష్ణుపారిజాతంలోనూ వెంగమాంబ రచించిన జోలపాటలు విడిగా సంకీర్తనలుగా కూడా ప్రఖ్యాతిపొందాయి. 'జలక్రీడావిలాసం'లో బాలకృష్ణుణ్ణి బంగారుఊయలలో పరుండజేసి, యశోదాదేవి చెలికత్తెలు ఊయల ఊపుతూ నిద్రపుచ్చుటానికి జోలపాటలు పాడారట.

లాలిముద్దుల బాల! – లాలి గోపాలా!
లాలి కాంచనచేల! – లలిత గుణజాలా! ॥లాలి॥

ప్రవిమలాచార! యా – దవ కులోద్ధారా!
కవిబృందమందార! – కలికలుషదూరా! ॥లాలి॥

నందనందన! సదా – నంద గోవిందా!
సౌందర్యవదనార – వింద! ముకుందా! ॥లాలీ॥
వరచిన్మయాకార! – వనధిగంభీరా!
నిరుపమగుణహార! – నిగమసంచారా! ॥లాలీ॥

శైలజస్తుతనామ! – సంపూర్ణకామా!
నీలమేఘశ్యామ! – నిర్జరలలామా! ॥లాలీ॥

తరిగొండపురవాస! – తారకవిలాసా!
చిరరమ్యదరహాస! – శ్రీ శ్రీనివాసా! ॥లాలీ॥

వెంగమాంబ తను కూడా యశోదాదేవిచెలులలో ఒకతెగా మారిపోయి తన్మయత్వంతో ఆలపించినట్టు



ఉంటాయి– ఈ జోలలు. గోపకాంతలకు పసిబిడ్డడు శైలజ స్తుతనాముడని తెలుస్తుందా? ఉయ్యాలలో ఉన్న శిశువుని దైవస్వరూపుడని భావించటం ఉంటుంది. అంతే! వర చిన్మయాకార! నిరుపమగుణహార! వంటి విశేషణాలు కవయిత్రిభావాలుమాత్రమే!

యశోదాదేవి చెలులు కృష్ణుడికి చిచ్చికొడుతూ పాడిన జోలపాట–

జో జో జో జో కృష్ణా! జో జో జో కృష్ణా! ।పల్లవి।
నీకు, వాజ గాదు పోరుబెట్ట- వద్దుకృష్ణా! ॥జోజో॥

చెలగుచు మా మోములు జూ- చేవు కృష్ణా!
నీవు, మొలకనవ్వులు నవ్వేవు- ముద్దుకృష్ణా! ॥జోజో॥

వూచితే హాయిగా నూగు - చుండి కృష్ణా!
మే, మూచకుంటె వూకొట్టేవ? వోరి! కృష్ణా! ॥జోజో॥

తరిగొండ నారసింహుడు - దయను కృష్ణా!
నీకు, చిరతరాయు వియ్యవలె-చిన్నికృష్ణా! ॥జోజో॥

చిన్నపిల్లలకు నిద్రపోవటం అంటే ఇష్టం ఉండదు. ప్రయత్నపూర్వకంగా మెలకువ తెచ్చుకోవటానికి చూస్తారు. కళ్లు విప్పి ముఖాల్లోకి చూస్తూ ఉంటారు. నవ్వుతూ ఉంటారు. ఆ నవ్వుకి మాయలో పడిపోతారు పెద్దలు. అందులోనూ జగన్మోహనుడి నవ్వు అయితే చెప్పేదేముంది? అందుకే వాళ్లకు సుఖంగా ఉండేట్టు చిచ్చికొడుతూ నిద్రలోకి జారుకునేందుకు వీలుగా మంద్రస్వరంతో లయబద్ధంగా పాడుతారు. నిద్రను జయించటానికి ప్రయత్నం చేస్తున్న కృష్ణుడితో "మా ముఖాలు చూస్తున్నావు. మొలకనవ్వులు చిందిస్తున్నావు. మమ్మల్ని ఇబ్బందిపెట్టకు" అని వేడు కుంటున్నారు. ఇవి వాత్సల్యంతో ఆర్ద్రమైనవి.

విష్ణుపారిజాతంలో పత్నీసమేతుడై ఉన్న శ్రీకృష్ణుణ్ణి ఆనందంతో కొనియాడిన సువ్వాలపాట లాలిపాటకూడా!

సువ్వి సువ్వి యదుకులేశ! - సువ్వి శేషాచలేశ!
సువ్వి సువ్వి జగదధీశ! - సువ్వి లాలీ! ॥సువ్వి॥

పరమధర్మానుగుణ్య! - భక్తసంతతిశరణ్య!
సురుచిరామరాగ్రగణ్య! - సువ్విలాలీ! ॥సువ్వి॥

విమలపరమపదవిహార! - వేదవేదాంతసార!
సుమహితాంబునిధిగభీర! - సువ్వి లాలీ! ॥సువ్వి॥

శ్రీ తరిగొండనారసింహ! - శోషితాంహ! చి
జ్జ్యోతిరూప! శ్రీప! భూప! - సువ్వి లాలీ! ॥సువ్వి॥

విష్ణుపారిజాతంలో జోల పాడింది అభం శుభం తెలియని పసివాడికి కాదు. పత్నీసమేతుడైన కృష్ణుడికి. కనుక జగదధీశ!, పరమధర్మానుగుణ్య!, సురుచిరామరాగ్రగణ్య! విమల పరమపద విహార! వంటి విశేషణాలతో కీర్తించింది వెంగమాంబ.

చెంచునాటకం అనే యక్షగానంలో చెంచిత కుమారుడికి కడుపు నిండా పాలిచ్చి "జోలలు" పాడి నిద్రపుచ్చింది. అంటే ఎన్నో జోలపాటలు పాడింది– కుమారుడు నిద్రపోయే వరకు. గాఢంగా నిద్రిస్తేనే భర్త చెంచునాయకుడికి ఆహారం తీసుకురావటానికి వీలౌతుంది.

కడుపూ నిండుచు పాలు - కంఠమానెను, చాలు
గారాబు నా పట్టి! జో! జో! ॥పల్లవి ॥

తడవూ నిను:గన్నా మీ - తండ్రి తొడల మీ:ద
మోదముగా పవళించూ జో! జో! 1

పొలుపొందగా మా - కుల ముద్ధరించుటకు
గల ముద్దులా పట్టి! జో! జో! 2

తెలివిగల ధరణీ పై - దీర్ఘాయువు గాను
వర్ధిల్లు నా పట్టి! జో! జో! 3

బలమొప్పగా పుత్ర - పౌత్రాభివృద్ధి నా
ప్రబలూరా! నా పట్టి! జో! జో! 4

చెలగి తరిగొండ నర- సింహుని వరముచేత
పుట్టిన బాలా! జో! జో! 5

కడుపు నిండా పాలు పట్టాను, సుఖంగా నిద్ర పొమ్మని చెప్పింది– చెంచిత.

వెంగమాంబ భక్తిపరవశత్వంతో తన రచనలలోని భక్తులపాత్రలలో లీనమైపోవటం గమనార్హం.


# మహోపకారకులు

- డా॥ ఈ.ఎ. శింగరాచార్యులు

భగవద్రామానుజులకు పూర్వం జన్మించినఆచార్యులలో నాథముని మొదటివారు. ముఖ్యులుకూడా! గురు పరంపరాస్తుతిలో 'నాథయామునమధ్యమామ్' అని నాథమునులపేరు చోటు చేసుకొంది. నాథమునుల పూర్తి పేరు శ్రీరంగనాథమునులు.

నాథముని తమిళనాడురాష్ట్రంలోని కడలూర్ ప్రాంతంలో వీరనారాయణపురమని పిలువబడే 'కాట్టు మన్నార్ కోయిల్' అనే ఊరిలో 824 సం॥లో జన్మించారు. జ్యేష్ఠమాసం అనూరాధానక్షత్రంలో వీరు జన్మించారు. వైష్ణవ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన ఈ ఆచార్యులు బహుముఖీనమైనప్రతిభను, శాస్త్రపాండిత్యాన్ని కలవారు.

ఒక పర్యాయం కర్ణాటకప్రాంతంనుండి కొందరు భక్తులు వీరనారాయణపురానికి వచ్చి, నమ్మాళ్వార్ల తిరువాయ్‌మొళి ప్రబంధంలోని 'ఆరావముదే' అని ప్రారంభమయే పాశురదశకాన్ని గానం చేశారు. ఆ విధమైన పాశురాలను నాథమునులు అప్పటివరకు వినలేదు. ఉన్నట్లుకూడా తెలీదు. నాథమునులకు చాలాకాలం ముందే ఆళ్వార్ల ప్రబంధాలు రచింపబడినా అవి కాలవశంచేత అదృశ్యమైపోయాయి. భక్తులు గానం చేసిన దశకం చివరలో గల పాశురం వల్ల అలాంటి పాశురాలు మొత్తం వేయి ఉన్నట్లు, వాటిని నమ్మాళ్వార్లు రచించినట్లు, తెలుసుకుని నాథమునులు వాటి వివరాల్నిగూర్చి ఆ భక్తులను అడిగాడు. వారు తమకు ఆ పదిపాశురాలు మాత్రమే తెలుసునని, మిగిలినవి తెలీవని చెప్పారు.



ఏ విధంగా అయినా ఆ పాశురాలను సంపాదించాలనే పట్టుదలతో నాథమునులు కర్ణాటకదేశానికి, ఆళ్వార్లు జన్మించిన ఆళ్వార్ తిరునగరికి వెళ్లి విచారించారు. మధురకవి ఆళ్వార్లు నమ్మాళ్వార్లను కీర్తిస్తూ రచించిన 'కణ్ణినుణ్ శిరుత్తాంబు' అనే ప్రబంధాన్ని జపిస్తే నమ్మాళ్వార్ల అనుగ్రహంతో ఆ పాశురాలను తిరిగి సంపాదించవచ్చునని తెలుసుకున్న నాథమునులు ఆ విధంగానే ఆ ప్రబంధాన్ని పన్నెండు వేలసార్లు జపించారు. అప్పుడు నాథమునులకు నమ్మాళ్వార్లు కలలో ప్రత్యక్షమై వేయిపాశురాలు కల తిరువాయ్‌మొళి ప్రబంధాన్నే కాక, మిగిలిన మూడువేల పాశురాలనుకూడా ఉపదేశించారు. ఈ నాల్గు వేలపాశురాలకే నాలాయిర దివ్యప్రబంధమని, ద్రావిడవేదమని పేర్లు. నాథమునుల అచంచలదీక్షవల్ల అదృశ్యమైన ఆళ్వార్ల ప్రబంధాలు లోకానికి తిరిగి అందాయి.

అందువల్ల వీరు ఆచార్యపరంపరలో మొదటి ఆచార్యులుగా కొలువబడు తున్నారు.

వైష్ణవసంప్రదాయానికి నాథమునులు చేసిన మరో సేవకూడా అమోఘమైంది ఉంది. తాము నమ్మాళ్వార్లవల్ల గ్రహించిన పాశురాలను ఆయా పాశురాలకు తగినరీతిలో రాగతాళాలను నిర్ణయించి, నిర్దేశించారు. గానానుకూలమైన ముదల్ ఆయిరమ్, పెరియతిరుమొళి, తిరువాయ్‌మొళి అనే మూడుప్రబంధాలలోనిపాశురాలను 'ఇశైప్పా' ప్రబంధాలుగా, గేయరూపాలైన పాశురాలను 'ఇయల్‌పా' ప్రబంధంగాను- మొత్తం నాల్గుగా వర్గీకరించారు. ఈ అంశం నాథమునుల గానకళాప్రావీణ్యానికి చిహ్నం. ఆళ్వార్లపాశురాల్లోని అర్థానికి తగినట్లుగా వాటి అభినయప్రకారాన్నికూడా నాథమునులు నిర్ణయించి తెలిపారు. ఇది వారినాట్యకళా కౌశలానికి గుర్తు. తాము ఏర్పరచిన ఆళ్వార్లు పాశురాల గాన, అభినయప్రకారాలు శాశ్వతంగా నిలచి ఉండేటట్లుగా వాటిని తన మేనల్లులైన 'కీళై అకత్తాన్, మేలై అకత్తాన్' అనే ఇద్దరికీ నేర్పించారు. వీరినుండి 'అరైయర్'ల గానాభినయ సంప్రదాయం మొదలైంది. ఆళ్వార్ల పాశురాలను పాడి, అభినయించేపద్ధతి శ్రీరంగం, మేల్‌కోట మొదలైన క్షేత్రాలలో ఉంది.


## అధికారిక వెబ్‌సైట్లలోనే...

**శ్రీవారి దర్శన టిక్కెట్లు,**
**ఆర్జితసేవా టిక్కెట్లు, వసతి గదులను**
**బుక్ చేసుకునేందుకు అధికారికంగా..**
**www.tirupatibalaji.ap.gov.in**
**వెబ్‌సైట్ మాత్రమే ఉంది.**
**తిరుమల తిరుపతి దేవస్థానములకు**
**సంబంధించిన సమాచారం కోసం**
**www.tirumala.org**
**వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.**
**ఈ వెబ్‌సైట్లకు సంబంధించిన**
**సమాచారం, ఇతర వివరాలకోసం**
**తి.తి.దే. కాల్‌సెంటర్ నెంబర్లు**
**0877-2277777, 0877-2233333**
**మరియు తి.తి.దే. టోల్ ఫ్రీ నంబర్లు**
**1800 425 4141, 1800 425 333333**


శ్రీవైష్ణవసంప్రదాయంలో విలక్షణమైన ఉభయ వేదాంతసమన్వయప్రక్రియకు కూడా నాథమునులు ఆద్యులు. ఆళ్వార్లపాశురాలు నాల్గువేదాలసారాలను ప్రతిపాదిస్తున్నాయనే విషయాన్ని నిరూపిస్తూ, ఆ పాశురాలను నాల్గుప్రబంధాలుగా విభాగించారు. ఇంతేకాదు, వైష్ణవ సంప్రదాయంలో రహస్యంగా చెప్పబడే నారాయణ అష్టాక్షరి, ద్వయమంత్రం, శ్రీకృష్ణచరమశ్లోకాల మూడింటి అర్థానికి, ఆళ్వార్ల ప్రబంధాల్లోని అర్థానికి మధ్య ఉండే సంబంధాన్ని పురస్కరించుకునికూడా నాథమునులు ఆళ్వార్ల ప్రబంధాలను వర్గీకరించారు. ఈ క్రమాన్ని అనుసరిస్తూ తరువాతికాలంలోని వైష్ణవాచార్యులు ఆళ్వార్ల ప్రబంధాలను వ్యాఖ్యానించారు.

నాథమునులు గొప్పకవి. తిరువాయ్‌మొళి ప్రబంధానికి ప్రార్థనారూపమైన 'భక్తామృతమ్' ఇత్యాదిశ్లోకాల్ని నాథమునులు రచించారు.

నాథమునులు గొప్పయోగశాస్త్రవేత్త. ఆ శాస్త్రాన్ని తమ శిష్యులలో ఒకరైన కురుకైకావలప్పన్‌కు నేర్పారు.

నాథమునులభక్తి అనితరసాధ్యమైంది. వీరు చివరి దశలో- విల్లును ధరించిన ఇద్దరువ్యక్తులను, వారి వెంట ఉండే ఒక స్త్రీని చూచి, వారిని సీతారామలక్ష్మణులుగా భావించి, వారిని అన్వేషిస్తూ వెళ్లి, చివరకు, వారిని చూడలేకపోయాననే ఆర్తివల్ల పరమపదించారు.

ఈ విధంగా నాథమునులు కవి, విమర్శకులు, సంగీతాభినయకళాప్రవీణులు, యోగవేత్త, అన్నిటికీమించి అదృశ్యమైన ఆళ్వార్లసాహిత్యాన్ని తిరిగి సంపాదించి లోకానికి అందించిన మహోపకారకులు.

# నాగ చతుర్థి

- శ్రీ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖరరావు

శ్రావణమాసంలో శుక్లపక్షచతుర్థి- 'నాగచతుర్థి' 'నాగులచవితి' అని పిలిచే ఈ పండుగను తెలుగురాష్ట్రాల్లోని కొన్నిప్రాంతాలలో శ్రావణమాసంలో జరుపుకుంటే-మరికొన్ని ప్రాంతాల్లో కార్తికమాసంలో శుక్లపక్షచవితినాడు జరుపుకుంటారు. కాగా, శ్రావణమాసంలోని శుక్లపక్షపంచమిని అందరూ 'నాగపంచమి'గా జరుపుకుంటారు. సర్పాన్ని పూజించేపండుగే- నాగులచవితి.

హైందవులపూజల్లో సర్పారాధనకూడా ఒకటి. సర్పజాతిలో ప్రధానమైనవాడు- ఆదిశేషుడు?

ఆదిశేషుడు కశ్యప్రజాపతి, కద్రువల కుమారుడు గొప్పపండితుడు. అనంతమైన శక్తిసామర్థ్యాలు కలిగినవాడు. ఆదిశేషుడికే అనంతుడు అని పేరు. ఈ ఆదిశేషుడే భూమిని మోస్తూ ఉన్నట్లుంటాడు.

శ్రీమహావిష్ణువుకు ఆదిశేషుడు ప్రియమైనవాడు. శ్రీమహావిష్ణువు శయనించి ఉండే ఆదిశేషుడు, పరమశివుని మెడలో ధరించిఉండే వాసుకివంటి సర్పాలు ఎన్నో మన పురాణాల్లో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. సూర్యభగవానుడిరథానికి పగ్గాలు సర్పాలేకాగా వినాయక, భైరవులకు సర్పాలే యజ్ఞోపవీతాలు. శనిదేవుడికి సర్పమే ఆయుధం. క్షీరసాగరమథనానికి ఉపయోగించిన మందర పర్వత కవ్వానికి సర్పమే తాడుగా నిలిచి, అమృతం ఆవిర్భవించేందుకుకూడా కారణమైంది. సర్పాన్ని సుబ్రహ్మణ్యస్వామిగా కూడా ఆరాధిస్తాం.

నాగులచవితి రోజు స్త్రీ, పురుషులిద్దరూ నాగేంద్రుడిని పూజిస్తారు. పుట్టదగ్గరకు వెళ్లి, పుట్టను షోడశోపచారాలు, అష్టోత్తరాలతో పూజించి, పుట్టలో పాలుపోసి నైవేద్యం సమర్పిస్తారు.


అంతేకాకుండా వెండితోగానీ, రాగితోగానీ సర్పం విగ్రహాన్ని తయారుచేయించి, దాన్ని పూజామందిరంలో ఉంచి, పూజించి నైవేద్యం సమర్పించాలి. నువ్వులు, బెల్లం కలిపి చేసిన నువ్వులపిండిని, బియ్యపుపిండి, బెల్లం కలిపి చేసిన చలిమిడిని నైవేద్యంగా సమర్పిస్తారు. చవితిరోజు ఉపవాసం ఉండి, మరునాడు సర్పానికి పూజచేసి, నైవేద్యాన్ని సమర్పించాలి. తర్వాత భోజనం చేసి ఉపవాసాన్ని విరమించాలి. ఈ విధంగా నాగరాజును పూజించడంవల్ల శివకేశవులిద్దరూ అనుగ్రహిస్తా రని విశ్వాసం.

నాగులచవితిని ఆచరించడంవల్ల అనేకసత్ఫలితాలు లభిస్తా యని తెలిపే ఒక కథ...

**నాగులచవితిరోజు ఆచరించాల్సిన విధులు పూజా విధానాల, గురించి, స్వయంగా శివుడే పార్వతీదేవికి వివరించాడు. "నాగులచవితిరోజు ద్వారాలకు ఇరువైపులా గోమయంతో సర్పచిత్రాలను గీసి, పూజించాలి. చతుర్థిరోజు ఉపవాసం ఉండి, పంచమినాడు బంగారంతోగానీ, వెండితోగానీ, కర్రతోగానీ, లేదంటే మట్టితోగానీ ఐదుపడగల సర్పాన్ని చేయించాలి. లేదంటే పసుపుతోగానీ, చందనంతోగానీ ఐదుపాముల బొమ్మలను గీయాలి. వీటిని భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా పూజించాలి. పంచమినాడు పాలు, పాయసాలను నైవేద్యంగా సమర్పించాలి. ఈ రెండురోజులూ పగలుగానీ, రాత్రిగానీ భూమిని దున్నడంగానీ, తవ్వడంగానీ, భూమిలో బొరియలు ఉంటే వాటిని పూడ్చి వేయడంగానీ చేయరాదు" అని శివుడు పార్వతితో చెప్పినట్లు పురాణకథనం.**

పూర్వం మణిపురం అనే గ్రామంలో ఒక గౌడ బ్రాహ్మణుడు నివసిస్తూ ఉండేవాడు. అతను ఒకసారి భూమిని దున్నుతూ ఉండగా భూమిలోని ఒక బొరియలో ఉన్న పాములపిల్లలు అన్నీ నాగలికర్రకు తగిలి చని పోయాయి. తర్వాత కొద్దిసేపటికి వచ్చిన ఆ పిల్లలతల్లి చచ్చిపోయి ఉన్న పిల్లలను చూచి, కోపానికి లోనై తన పిల్లలను చంపిన వ్యక్తిని వెతికేందుకు బయలుదేరింది. తిరిగి తిరిగి గౌడబ్రాహ్మణుడి ఇంటికి చేరి నాగలికి ఉన్న రక్తపుమరకలను చూచి, ఆ బ్రాహ్మణుడే తన పిల్లలను చంపి ఉంటాడని గుర్తించి, నిద్రపోతూ ఉన్న ఆ బ్రాహ్మణుడి కుటుంబసభ్యులను కాటువేసి చంపివేసింది. అయినా, ఆ నాగుపాముకోపం చల్లారలేదు. ఆ బ్రాహ్మణుడికూతురు పొరుగు ఊరిలో ఉండేది. ఆమెనుకూడా చంపేందుకు పాము బయలుదేరి ఆమెఇల్లు చేరింది.

ఆ సమయంలో ఆమె సర్పాన్ని పూజిస్తూ ఉంది. దీంతో పూజ ముగిసేంతవరకూ ఆ పాము వేచి ఉండి, అనంతరం నైవేద్యంగా సమర్పించిన పాలు, చలిమిడిని సేవించింది. దీంతో పాముకోపం తగ్గింది. పూజను ముగించిన ఆమెకు ఎదురుగా పడగవిప్పినపాము దర్శన మివ్వగా... తన భాగ్యానికి సంతోషించి ఆమె పాముకు



నమస్కరించింది. ఆమెభక్తిని చూచి మెచ్చిన ఆ పాము తాను ఆమె తల్లిదండ్రులను, సోదరులను చంపిన విషయం తెలిపింది. దీంతో బ్రాహ్మణుడికూతురు దుఃఖించి, తన తండ్రి తెలీక చేసిన తప్పును మన్నించి తిరిగి బ్రతికించమని సర్పాన్ని వేడుకుంది. అందుకు అంగీకరించిన సర్పం కొంత అమృతాన్ని గౌడబ్రాహ్మణుడికుమార్తెకు ఇవ్వగా– ఆమె తన పుట్టింటికి వెళ్లి మృతదేహాలపై అమృతాన్ని చిలకరించగా వారు తిరిగి జీవించినట్లు పురాణకథనం.

అందువల్లనే నాగులచవితి, పంచమిరోజుల్లో చెట్లు, పుట్ట కొట్టడం, భూమిని త్రవ్వడం, దున్నడం చేయరాదు. అంతేకాదు పాములు భూమిలో ఉండి, భూసారాన్ని కాపాడు తాయనికూడా అంటారు.

సంతానం లేనివారు శివాలయాల్లో రావి, వేపచెట్లు నాటి, వాటిమధ్యలో నాగప్రతిష్ఠ చేస్తే సంతానం కలుగుతుం దని మనవారినమ్మకం. పిల్లలు పుట్టి, చనిపోతూవున్నవారు కూడా నాగప్రతిష్ఠ చేయడంవల్ల పిల్లలు బ్రతుకుతారనీ ఒక విశ్వాసం. సర్పాన్ని ఆరాధించడంవల్ల కళ్లకు, చెవులకు, చర్మానికి సంబంధించినవ్యాధులు నయమౌతాయని విశ్వాసం. అంతేకాకుండా సర్పారాధన చేసేవారివంశం అభి వృద్ధి చెందుతుందని భవిష్యపురాణం పేర్కొంది.

దీర్ఘకాలికవ్యాధులున్నవారు పుట్టకు ప్రతిరోజూ ప్రదక్షిణలు చేసి, భక్తితో పాలుపోస్తే ఆరోగ్యవంతులౌతా రని కూడా పెద్దలు చెపుతారు. పిల్లలకు చెవినొప్పి, చీము కారడం వంటి వ్యాధులు వస్తే– పుట్టమట్టి తెచ్చి చెవికి పూసే ఆచారం నేటికీ గమనించవచ్చు.

మానవశరీరాన్ని తొమ్మిదిరంధ్రా లున్న పాముల పుట్టతో పోల్చుతారు. పుట్టలో చుట్టచుట్టుకుని పాము ఉన్నట్లే నవరంధ్రాలు ఉన్న మానవశరీరంలోని కుండలినీ శక్తి కూడా సత్త్వరజస్తమోగుణాలను చిమ్ముతూ ఉంటుందనీ, సాధనద్వారా కుండలినీశక్తిని మేల్కొలిపి మనలోని మంచి గుణాలను పెంపొందించుకోవచ్చునని యోగశాస్త్రం చెబు తోంది.

# వ్యాసపూర్ణిమ

- శ్రీ డి.వి.ఆర్. భాస్కర్

ఆత్మను పరమాత్మను అనుసంధానం చేస్తూ, శిష్యుణ్ణి తరింపజేసేమార్గంలో నడిపిస్తూ జీవైక్యస్థితిని అనుగ్రహించే సద్గురువులను పూజించే పండుగ 'గురుపౌర్ణమి'.

గురుపౌర్ణమినాడు గురువుకు పాదపూజ చేయడం, ముక్కోటిదేవతల్నీ ఒకేసారి పూజించడంతో సమానం. ఇంతకూ ఈ గురుపూర్ణిమ ఎందుకు? ఎప్పుడు జరుపుకుంటున్నామంటే వేదవ్యాసుడి జయంతి అయిన ఆషాఢశుద్ధపూర్ణిమనాడు. అసలు వేదవ్యాసుడు ఎవరని ప్రశ్నించుకుంటే- ఆయన సాక్షాత్తూ విష్ణు స్వరూపుడు.

అమోఘమైన, అనితరసాధ్యమైన తన రచనలద్వారా వ్యాసుడు భారతీయసంస్కృతిని రూపుదిద్దాడు. వేదాలను విభజించి చక్కగా పరిష్కరించి, వేదవ్యాసుడయ్యాడు. పంచమ వేదమైన 'మహాభారతం'గా ప్రకటించాడు. అందులో సర్వోప నిషత్తుసారమైన 'గీత'ను ఇమిడ్చాడు. భాగవతాదిపురాణాలను లోకానికి అందించాడు.

వ్యాసుడు తన శిష్యుల్లో పైలుడికి ఋగ్వేదాన్ని, వైశం పాయనుడికి యజుర్వేదాన్ని, జైమినికి సామవేదాన్ని, సుమం తుడికి అథర్వణ వేదాన్ని అప్పగించి, లోకంలో ప్రసరింపజేశాడు. వ్యాసుడు పరిపూర్ణతత్త్వజ్ఞానంతో బ్రహ్మసూత్రాలు రచించాడు. వాటిలో విశ్వంలోని ఏ తాత్త్వికధారనూ విడిచిపెట్టకుండా సరళ సుందరశైలిలో చర్చించాడు.

యోగి అయినవాడు ఎలాంటి పరిస్థితుల్లోనూ ఘర్షణకు తావులేకుండా కర్తవ్యాన్ని బాధ్యతాయుతమైన లీలగా ఎలా నిర్వహిస్తాడో వ్యాసుడిజీవితంలో మనం దర్శించవచ్చు. లోక హితార్థమై ఒకవంక తపస్సు, మరోవంక శిష్యులకు శిక్షణ, ఇంకోవంక ఆశ్రితరక్షణ నిర్వహిస్తూనే, అవసరమై నప్పుడల్లా జన్మనిచ్చినతల్లిని దర్శిస్తూ, తగినరీతిలో సేవిస్తూ వచ్చాడు వ్యాసుడు.

'వైరాగ్యం అంటే బాధ్యతలను వదిలిపెట్టడం కాదని, వ్యామోహపడకుండా బాధ్యతలను పరిపూర్ణంగా నిర్వహించడ మనే సందేశాన్ని మహాభారతంలో వ్యాసుడిపాత్ర మనకంది స్తుంది.'

శ్రీకృష్ణుణ్ణి మానవమాత్రుడిగా గాక పరిపూర్ణావతార పురుషుడిగా దర్శించిన మొదటివాడు- వ్యాసుడు.

వ్యాసుడి జననతిథి 'ఆషాఢపూర్ణిమ'. పూర్ణిమ అంటే సమగ్రత. వ్యాసపూర్ణిమ భారతీయసంప్రదాయంలో గురు పూర్ణిమ. శ్రీకృష్ణుడు గీతోపదేశంద్వారా జగద్గురువైతే, శక్తి మంతమైన సంస్కృతిని, దానికి అవసరమైన విశాలవిజ్ఞానాన్నీ సృష్టించిన వ్యాసుడూ లోకానికి గురువే! గురువు జ్ఞానప్రదాత. జ్ఞానం బ్రహ్మస్వరూపం.

అందుకే గురువు బ్రహ్మ, విష్ణు, పరమేశ్వర స్వరూపుడు. సర్వగురువులకూ గురుస్థానీయుడు వేదవ్యాసుడు. అందరు గురువుల్లోనూ అంశల భేదంతో వేదవ్యాస మహర్షి ఉంటాడు. ఈ విధమైన ఏకత్వగురుభావన మనదేశసంప్రదాయం.

యమునానదీద్వీపంలో సత్యవతి సద్యోగర్భంలో మహా జ్ఞానతేజస్సంపన్నుడైన వ్యాసుడు జన్మించాడు. ఈ ద్వీపంలో జన్మించడంవల్ల కృష్ణద్వైపాయనుడయ్యాడు. సత్యవతీ, పరా శరులపుత్రుడగుటవల్ల సాత్యవతేయుడు, పారాశర్యుడుగా పిలవబడ్డాడు. ఈ కృష్ణద్వైపాయనుడు హిమాలయాల్లోని బదరి కాశ్రమంలో సుదీర్ఘకాలం గొప్పతపస్సు చేసిన కారణంగా బాద రాయణుడుగా ప్రసిద్ధి పొందాడు.

వ్యాసమహర్షి నాలుగువేదాలను విభజించి, లోకానికి అందించాడు. పూర్వం సోమకాసురుడు వేదాలను సముద్రంలో దాచేస్తే.. శ్రీమహావిష్ణువు మత్స్యావతారంలో ఆ వేదాలను తీసుకొచ్చాడు. అలా వచ్చిన వేదాలు ఒకదాంతో ఒకటి కలిసి కలగాపులగం అయిపోగా.. వాటిని వ్యాసమహర్షి విడదీసి విభజించి, నాలుగువేదాలుగా లోకానికి అందించాడు. వేద రాశిని నిత్యకర్మలలో, క్రతువుల్లో వాడే ఉపయోగాలనుబట్టి

ఋక్–యజుర్–సామ–అథర్వణ వేదాలుగా విభజించి, వేద వ్యాసుడైనాడు. ఆతర్వాత బ్రహ్మదేవునిఆజ్ఞతో విఘ్నేశ్వరుడు రాయగా, వేదసారాన్నంతా చేర్చి, పంచమవేదంగా ప్రసిద్ధికెక్కిన భారతేతిహాసాన్ని గ్రంథస్థం చేశాడు. అంతేకాక భాగవతాన్ని, అష్టాదశపురాణాలను మనకు ప్రసాదించాడు.

## విష్ణుసహస్రనామపీఠికలో కూడా.....

వ్యాసునికి, విష్ణువుకు అభేదం చెప్పబడింది, వేద వ్యాసుడు అనంతంగా ఉన్నవేదాలను విభజించి పైలుడనే శిష్యునకు ఋక్సంహితను, వైశంపాయనునకు యజుస్సం హితను, జైమినికి సామసంహితను, సుమంతునకు అథర్వణ సంహితను బోధించి, వాటిని లోకంలో వ్యాప్తిచేయండని ఆదేశించాడు. వ్యాసుడు వేదాలను విభజించటమే కాకుండా అష్టాదశపురాణాల్ని, ఉపపురాణాలను రచించాడు. బ్రహ్మ సూత్రాల్ని వివరించాడు, భారత,భాగవతాలను రచించాడు. తాను గ్రంథస్థం చేసిన పురాణేతిహాసాలను సూతునకు తెలియ జేసి, ప్రచారం చేయమని చెప్పాడు.

వ్యాసభగవానునిఅనుగ్రహంవల్ల జ్ఞానం విస్తరించి విశ్వవ్యాప్తమైంది. సూతమహాముని ప్రధానప్రచారకుడై విషయాలు బహుళప్రచారం చేశాడు.

స్మృతికర్తలలో వ్యాసులవారు ఒకరు. రెండధ్యాయాల ఈ గ్రంథానికి లఘువ్యాసస్మృతి అని పేరు. ఇందులో మాన వులకు ఉపయోగపడే ఆచారవిషయాలు అనేకం ఉన్నాయి. ఇదే వ్యాససంహితగా విఖ్యాతి పొందింది.

వ్యాసమహర్షి సుపుత్రునికోసం తపస్సు చేసి, శివుని నుంచి వరాన్ని పొందాడు. ఆయనకు ఘృతాచి అనే అప్సరస వల్ల బ్రహ్మజ్ఞాని ఐన శుకుడు జన్మించాడు. వ్యాసభగవానులు సప్తచిరంజీవులలో ఒకరు.

## పూజా విధానం

### (వ్యాసపూజ / గురు పూజావిధానం)

కొత్త అంగవస్త్రం మీద (భూమి మీద పరచి) బియ్యం పోస్తారు. ఆ బియ్యంపైన నిమ్మకాయలు ఉంచుతారు. శంకరులు, అతని నలుగురుశిష్యులు వచ్చి, దానిని అందుకుంటా రని నమ్మకం. పూజ అయ్యాక ఆ బియ్యం తీసుకెళ్లి పిడికెడు చొప్పున తమ ఇళ్లల్లో బియ్యంలో కలుపుతారట! బియ్యం, కొత్తవస్త్రం లక్ష్మీచిహ్నం. నిమ్మపళ్లు కార్యసిద్ధికి సూచన. బియ్యం, నిమ్మ పళ్లు లక్ష్మీకటాక్షానికి చిహ్నం. దక్షిణాదిన కుంభకోణంలో, శృంగేరీలో, శంకరమఠాలలో వ్యాసపూర్ణిమను ఎంతో వైభవంగా జరుపుతారు.

ఈ రోజున సన్న్యాసులంతా వ్యాసునిరూపంలో ఉన్న తమగురువును కొలుస్తున్నారన్న మాట! వ్యాసుడు సకలకళా నిధి, సకలశాస్త్రవేత్త, శస్త్రచికిత్సవేది, మేధానిధి, వైద్యవరుడు, ఆత్మవిద్యానిధి, వైద్యవిద్యానిధి. ఈ రోజున అష్టాదశ పురాణ నిర్మాత అయిన వ్యాసుణ్ణి తప్పక పూజించాలి.

## వ్యాసుని సందేశం

వేదవ్యాసుడు తన రెండుచేతులనూ పైకి ఎత్తి లోక మంతటికీ నమస్కరిస్తూ చెప్పిన మాటల్లో విశిష్టమైంది ఏమిటంటే–

'ఇతరులు మీపట్ల ఏ విధంగా ప్రవర్తిస్తే మీరు బాధ పడతారో మీరు ఇతరులపట్ల ఆ విధంగా ప్రవర్తించవద్దు.' పరమ ధర్మపథాలన్నింటిలోకీ పరాయణమైన ఈఒకే ఒక్క విషయాన్ని త్రికరణశుద్ధిగా పాటించినట్లయితే మనసమాజం కచ్చితంగా శాంతిధామమౌతుంది.

సర్వప్రాణులయందు దయకలిగి ఉండుట, సత్య మార్గంలో నడుచుట, శాంతగుణాన్ని కలిగియుండుట–ఈ మూడుగుణాలను అందరూ అలవరచుకోవాలి అని వ్యాసుల వారు తెలియచేశారు.

ఇంతటి ఆదిగురువును పూజించడం మనకర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని తరవాతితరాలకు అందించడం మనధర్మం.

మనపిల్లలకు ఇతిహాస, పురాణాలపట్ల, ప్రాచీన సంస్కృతీసంప్రదాయాలపట్ల, అభిరుచి కలిగించటం మన కర్తవ్యం. వీటిలో కొన్నయినా సాధించగలిగితే వ్యాసులవారి ఋణం కొంతైనా మనం తీర్చుకున్నట్లు అవుతుంది. ఆ వ్యాసభగవానుని కృపకు మనం పాత్రులం కాగలమని ఆశిద్దాం. అందుకే గురుపూజను చేసుకుందాం. సాటిగురువులో భగ వంతుణ్ణి దర్శిద్దాం!

శ్రావణమాసంలో వచ్చే ఎన్నో పర్వదినాలలో అందరినీ అలరించే ముఖ్యపర్వదినం రక్షాబంధనదినోత్సవం. శ్రావణ పూర్ణిమనాడు సోదరులముంజేతు లన్నీ రక్షాబంధనాలతో కళకళలాడుతూ కనిపిస్తాయి. రక్షాబంధనం కట్టడంకూడా రాని పసిగుడ్డు నుంచి, కట్టడానికి శక్తిలేక చేతులు వణుకుతున్న వృద్ధుల వరకూ, ఇతరులసాయంతోనైనా సరే సోదరులు లేదా తాము శ్రేయస్సును కోరుకునే వారిముంజేతికి రక్షాబంధనం కట్టి, తీపి తినిపించడం మన ఆచారం. రక్షించగలిగిన పూర్ణిమ, రక్షణ కోరుకునే వారికోసం ఉద్దేశింపబడ్డ పూర్ణిమ అని ఈ రక్షాపూర్ణిమకు అర్థాలు. ఈ పండుగ కాలక్రమంలో రాఖీపూర్ణిమగా ప్రసిద్ధమైంది.

భారతీయసంప్రదాయంప్రకారం ఇంటిఆడపడచు శక్తిస్వరూపిణి. సాక్షాత్తూ శ్రీమహాలక్ష్మికి ప్రతిరూపం. అందుకే ఆమెను తల్లిదండ్రులు మంగళ, శుక్రవారాలలో పుట్టింటినుంచి పంపరు. వివాహసమయంలో అప్పగింతల కార్యక్రమంకూడా శుక్రవారం గడిచేదాకా ఆగి, ఆ తర్వాతనే పూర్తిచేస్తారు. అంతటి శక్తి గల సోదరిచేత రక్షా బంధనం కట్టించుకుంటే అరిష్టాలన్నీ తొలగి, దేవతలందరి అనుగ్రహం కలిగి, రక్షణ ఏర్పడుతుందనే దృష్టితో ప్రాచీనులు ఈ సంప్రదాయాన్ని ఏర్పరిచారు. అందుకే శ్రావణమాసంలో వచ్చే పూర్ణిమకోసం సోదరీ సోదరులిరువురూ ఎదురు చూస్తుంటారు.


### ఈవేళ ఇలా చేయాలి

శ్రావణపూర్ణిమనాడు సూర్యోదయకాలంలోనే స్నానం చేసి, మనం ఎవరిని రక్షించదలిచామో– అంటే నేటి నుండి ఒక సంవత్సరం పాటు ఎవరికి అండగా ఉండదలిచామో ఆ వ్యక్తి ముంజేతికి మనం కట్టబోయే రక్షిక (రాఖీ)ని దైవం ముందుంచి పూజ చేయాలి.

వరుడు కట్టబోయే మంగళసూత్రానికి ఎలా మాంగల్యబలపూజ చేస్తారో, ఆ పూజాశక్తి దానిలో ప్రవేశించి ఆ సూత్రాన్ని కట్టించుకున్న ఆమెకూ, కట్టినవ్యక్తికీ ఆపదల్లేకుండా చేస్తుందో అంతటిశక్తిగల ఈ రక్షికకీ పూజ చెయ్యాలి. అంటే పూజాశక్తిని దానిలోనికి ప్రవేశింప చెయ్యాలన్నమాట! అలా పూజాశక్తితో కూడుకున్న ఈ రక్షికను

# సోదరప్రేమకు... రక్షాబంధనం

–శ్రీమతి పూర్ణిమా స్వాతి



**సోదర, సోదరీసంబంధానికి సూచిక ఈ రక్షాబంధనం. రాఖీకట్టి, మిఠాయిలు తినిపించుకుంటూ... అందరూ ఉత్సాహంగా జరుపుకునే పర్వదినం ఇది.**

## పురాణాలలో...

**ఒకసారి రాక్షసులు ఇంద్రలోకంపై దండెత్తారు. దేవేంద్రుడు రాక్షసులతో తీవ్రంగా పోరాడాడు. అయితే, ఈ పోరులో రాక్షసులదే పైచేయిగా మారింది. ఇంద్రునిబలం క్షీణించి, అలసిసొలసి నేలపైకి ఒరిగిపోయాడు. ఈ పరిస్థితుల్లో... మహేంద్రునిభార్య శచీదేవి యుద్ధంలో విజయం సాధించడానికి తన భర్తకు తగినబలం ప్రసాదించాల్సిందని త్రిమూర్తులను ప్రార్థిస్తూ, ఒక రక్షాసూత్రాన్ని (దారాన్ని) భర్త చేతికి కట్టి, ఆయనను ఉత్సాహపరుస్తూ, తిరిగి యుద్ధానికి పురికొల్పింది. రక్షాబంధన ధారణతో నూతనోత్తేజం పుంజుకున్న ఇంద్రుడు ఈసారి యుద్ధంలో రాక్షసులను జయించాడు. రక్షాబంధన ప్రాశస్త్యాన్ని గుర్తించిన దేవతలు నాటినుంచి ప్రతిశ్రావణపూర్ణిమరోజు ఎవరిశ్రేయస్సునైతే తాము ఆకాంక్షిస్తున్నారో వారికి బలాన్ని, శక్తిని ప్రసాదించి, రక్షణనివ్వాల్సిందిగా కోరుతూ, వారిముంజేతికి రక్షాకంకణాన్ని కట్టడం ఆచారంగా మారింది.**

సోదరుడు లేదా సోదర సమానంగా భావించినవ్యక్తి ముంజేతికి కడుతూ– ఆ రక్షిక మీద అక్షతలను వేయాలి. ఆ తర్వాత తీపి తినిపించాలి.

రక్షాబంధనం కట్టడం పూర్తయ్యాక ఆ సంవత్సరకాలం పాటూ ఆమెకు అన్నింటా అండగా నిలవాలి. మహారాష్ట్ర, కర్ణాటకలలో దీనిని నారికేళ పూర్ణిమగా జరుపుకుంటారు.

స్థితికారుడైన శ్రీహరి జన్మనక్షత్రం శ్రవణం నిండుగా ఉండే ఈ శ్రావణపూర్ణిమనాడే! నేను ఫలానివారికి రక్షణకోసం కడుతున్నాను. నిరంతరం లోకాల్ని రక్షిస్తూనే ఉండాలనే తపన గల ఆ శ్రీహరిఅనుగ్రహం నా మీద ప్రసరించి, నేనూ రక్షించేవాడిగానే ఉండాలని అర్థం చేసుకోవడానికే శ్రావణపూర్ణిమను ఈ పండుగరోజుగా నిర్ణయించారని గమనించాలి.

ఒకప్పుడు తెల్ల ఆవాలతోనూ, అక్షతలతోనూ పూజించిన రక్షికను ఇంటి పురోహితుడు ఆ దేశపురాజుముంజేతికి ముడి వేసేవాడు. క్రమేణా ఈ ఆచారం కాస్తా సోదరీసోదరులకే పరిమితమైంది. ఏది ఏమైనా ఈ రక్షిక అనేది సంవత్సరకాలం పాటు ఉంచుకోవాల్సిన బంధనం. జీవితకాలం పాటు గుండెలో పదిలం చేసుకోవలసిన బంధం.

ఏడాదికి వచ్చే ద్వాదశపూర్ణిమల్లో శ్రావణపౌర్ణమికి చాలా విశిష్టత ఉంది. సాధారణంగా జంధ్యాన్ని ధరించేవారు ఈ రోజునే పాతది వదిలి, కొత్త దాన్ని ధరిస్తారు. యజ్ఞోపవీతం ధరించినవారు– ద్విజులు. ద్విజులు అంటే రెండుజన్మలు కలవారని అర్థం. తల్లి గర్భంనుంచి జన్మించడం మొదటిది కాగా, ఉపనయనం అనంతరం గురువునుంచి జ్ఞానాన్ని పొందడం రెండోది.

రక్షకోరిన తన సోదరిని బలిచక్రవర్తి రక్షిస్తూ ఎలాంటి ఆటంకాలెదురైనా తడబడక ధైర్యంతో ఎదురొడ్డి నిలిచాడు. అటువంటి మహావీరునితో తన సోదరుడిని పోలుస్తూ సోదరి తనకు రక్షణ నివ్వమని కోరుతుంది. ఈ రాఖీకట్టిన సోదరికి తగిన బహుమానం ఇస్తూ ఆశీర్వదిస్తాడు. రాఖీపౌర్ణమి, శ్రావణపూర్ణిమ, జంధ్యాలపూర్ణిమ ఇలా ఎన్నో రకాలుగా దేశమంతా ప్రజలు ఆనందోత్సాహాలతో ఈ పండుగను జరుపుకుంటారు. దేవతలు, ప్రకృతిఆరాధన, ఆత్మీయత, అనురాగబంధాలు, సకలపూజారాధనలు. అందుకునే ఈ శ్రావణపౌర్ణమి తన విశిష్టతను చాటిచెబుతూ సోదరప్రేమపటిష్ఠతకు దోహదపడుతుంది.



వందే పద్మకరాం ప్రసన్నవదనాం సౌభాగ్యదాం భాగ్యదాం
హస్తాభ్యా మభయప్రదాం మణిగణైర్నానావిధైర్భూషితామ్,
భక్తాభీష్టఫలప్రదాం హరిహరబ్రహ్మాదిభి స్సేవితాం
పార్శ్వే పంకజ శంఖ పద్మనిధిభిర్యుక్తాం సదా శక్తిభిః.

సరసిజనయనే సరోజహస్తే
ధవళతరాంశుకగంధమాల్యశోభే,
భగవతి హరివల్లభే మనోజ్ఞే
త్రిభువనభూతికరి ప్రసీద మహ్యామ్.

# లాక్‌డౌన్ విరామానంతరం తిరుమలలో ప్రారంభమైన శ్రీవారి దర్శన దృశ్యమాలిక





























Please carry your personal sanitizer
Please wear Mask
SARVA DARSHANAM TOKENS
Reach Tirumala As per TIME SLOT only






తిరుమల శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా ఆణివర ఆస్థానం జరిగింది. శ్రీశ్రీశ్రీ పెద్ద జీయంగారు స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయంగారు స్వామి, తి.తి.దే. ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ వై.వి. సుబ్బారెడ్డి దంపతులు, కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఎ.వి. ధర్మారెడ్డి దంపతులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.







కరోనా వైరస్ నశించి సమస్తలోకం ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థిస్తూ తి.తి.దే నిర్వహించిన రాహుగ్రహ చూడామణి సూర్యగ్రహణ జపయజ్ఞం.

# దివ్యక్షేత్రం... తిరుమల


11

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

*గత సంచిక తరువాయి భాగం...*

కాని “నాలాంటి భక్తుడు ఎక్కడైనా ఉంటాడా! ఒక వేళ ఉన్నా,నాలాగా ప్రతిరోజు బంగారుపూలతో అర్చించే భక్తుడు, ఎక్కడా కనపడదు గాక కనపడదు” అని తొండ మానునికి అహంకారం కలిగింది. అంతే! మరునాడు ఆలయంవాకిళ్లు తెరచి చూడగా, స్వామివారిపాదాలమీది బంగారుపూలన్నీ దూరంగా తొలగిపోయి, అక్కడ కేవలం ఐదారుమట్టిపూలుమాత్రం కనపడ్డాయి.

అది చూచిన అర్చకులు, తొండమానుడు ఆశ్చర్యపడి.. ఆందోళనతో, వేంకటేశ్వరస్వామిని ప్రార్థించారు. వెంటనే స్వామివారు ఇలా అన్నారు “రాజా! నేనే పరమభక్తుణ్ణి, బంగారుకమలాలతో పూజిస్తున్నాను” అని అహంకారంతో విర్రవీగు తున్నావు. జాగ్రత్త! నీకంటే పరమభక్తులు ఎందరో ఉన్నారు. వాళ్లల్లో భీముడు అనే కుమ్మరభక్తుడు సమర్పించిన మట్టి పూలే ఇవి! నీ బంగారుపూలకంటే ఆ మట్టిపూలే నాకు చాలాఇష్టం. తెలిసిందా! ఆ భక్తుణ్ణి చూచి, అహంకారం తగ్గించుకో!” అంటూ స్వామి ఇంకా ఇలా అన్నాడు.



తిరుమలకొండకు ఒకయోజనం దూరంలో (10 మైళ్లు) ఉన్న పల్లెలోని పూరి గుడిసెలో ఉన్నాడు- భీముడు. నిరంతరం పొద్దున్నుంచీ సాయంత్రందాకా నాకు (శ్రీనివాసుడు) నైవేద్యంవంటలకోసం మట్టికుండలు తయారు చేస్తుంటాడు. నా దర్శనానికి రావాలనే కోరిక ఉన్నా, క్షణం తీరికే లేని ఆ భీముడు తన సారెపక్కనే శ్రీనివాసుని చిన్నచెక్కబొమ్మను పెట్టుకొని, పనిముగించే సమయంలో భక్తితో తనవేళ్లకు అంటిన బంక మట్టితో నాలుగైదుపూలను చేసి, సమర్పిస్తూ “స్వామీ! నా భాగ్యం ఇంతే!” అని ప్రార్థించే వాడు. ఏరోజు కారోజు అతనికోరిక కోరిక గానే మిగిలిపోయేది. ఇదిగో ఆ భీముడు సమర్పించిన మట్టిపూలే ఇవి” అని పలికాడు - స్వామి.

వెంటనే తొండమానుడు, స్వామి మెచ్చిన భక్తుడైన కుమ్మర భక్తుణ్ణి చూద్దామని అతను ఉండే పల్లెకు వెళ్లాడు. అప్పటికే భీముడు మట్టిమూకుట్లో పెట్టిన సంకటిని ప్రియంగా తింటున్న స్వామివారు అక్కడ కన్పించారు. దగ్గరికి వెళ్తుండగానే ఇంతలో శ్రీవైకుంఠం నుంచి బంగారు

విమానం వచ్చింది. అందులో కుమ్మరభీమునిదంపతులు ఎక్కగానే విమానం వైకుంఠానికి వెళ్లిపోయింది. వేంకటేశ్వరస్వామికూడా అదృశ్యమయ్యాడు. ఈదృశ్యాన్ని కళ్లారా చూచిన తొండమానుడు తిరుమలకొండకు చేరుకొని, అహంకారం తగ్గించుకొని, మరుజన్మలో వైకుంఠాన్ని పొందాడు. ఇది ఈ భక్తులదివ్యగాథ!!

## తిరుమలనంబి

శ్రీవేంకటేశ్వరస్వామిసేవలో జీవితాంతం తరించిన మరో భక్తుడు తిరుమలనంబి. వీరికే 'శ్రీశైలపూర్ణులు' అని మరోపేరు ఉంది. వీరు శ్రీనివాసుని అభిషేకానికి ప్రతిరోజు పాపవినాశనతీర్థజలాన్ని తెచ్చి ఇచ్చేవారు.

ఈయన ప్రతిరోజు తెల్లవారుజామున శ్రీవారిఆలయం నుండి బయిలుదేరి, పాపవినాశనతీర్థజలాలను తీసుకొని వచ్చి, "గోవిందా! గోవిందా!" అంటూ స్మరిస్తూ, ఆలయంలో అభిషేకానికి జలాన్ని సమర్పించేవారు. ఆయిన ఒక రోజు అలా తీర్థాన్ని తెస్తుండగా, వేంకటేశ్వరుడు ఒక బోయకుర్ర వాడిగా మారి, "తాతా! తాతా! నాకు చాల దప్పికగా ఉంది. నీళ్లు ఇవ్వండి" అంటూ తిరుమలనంబివెంటపడ్డాడు.

ఒరే! ఈ పవిత్రజలం స్వామివారిఅభిషేకకైంకర్యం కోసం తీసుకు వెళ్తున్నాను. నీకు ఇవ్వనుగాక ఇవ్వను. వేళ మించిపోతున్నది. తొందరగా గుడికి చేరుకోవాలి, దూరంగా జరుగు అంటూ వాణ్ణి అరచి, మళ్లీ 'గోవిందా' అంటూ వడివడిగా నడక ప్రారంభించాడు. ఆ బోయకుర్రవాడు, తిరుమలనంబివెంట వెనుకనే నక్కి నక్కి నడుస్తూ, తన బాణంతో ఆయనతలపైవున్న నీటికుండకు రంధ్రం చేశాడు. అంతే 'ఆ కుండకు పడిన చిన్నరంధ్రంద్వారా, ధారగా కారుతున్న నీటిని దోసిలిపట్టి తాగుతూ వెంటనడిచాడు. కొంతసేపటికి కుండ ఖాళీ కావడం, భుజం తడిసి చల్లగా కావడంతో తిరుమలనంబి వెనక్కు తిరిగి చూచాడు. తనకుండకు రంధ్రం చేసి నీళ్లను తాగుతూ వెంటవస్తున్న బోయవాణ్ణి చూచి, "ఎంతపని చేశావురా! స్వామివారి కైంకర్యంకోసం తెచ్చేతీర్థాన్ని తాగావే! మళ్లీ తీసుకురావ డానికి వేళ మించిపోయిందే. ఎలారా!" అంటూ వాణ్ణి గట్టిగా తిట్టాడు.

"తాతా! తాతా! అలా తిట్టకు, నీకు ఈ దగ్గర్లోనే మంచి తీర్థం చూపిస్తాను. రా!" అంటూ తన బాణంతో ఆ కొండ వాలుకు కొట్టాడు. అంతే! ఆ రంధ్రంలోంచి స్వచ్ఛమైన జలం ధారగా పెల్లుబికింది. తిరుమలనంబి ఆనందంతో ఆ జలాన్ని తీసుకొని ఆలయానికి వచ్చాడు.

ఆలయంలో వేంకటేశ్వరస్వామి, అర్చకుణ్ణి ఆవేశించి "తాతా! తిరుమలనంబీ! దారిలోనే నీవు ఇచ్చిన తీర్థంతో నాకు దాహం తీరింది. తాతా! నా అభిషేక కైంకర్యానికి దూరంగా ఉన్న పాపనాశనతీర్థం నుంచిగాక, ఇప్పటి నుంచి, దగ్గర్లో ఉన్న ఈ కొత్తతీర్థాన్ని తీసుకొనిరా" అని పలి కాడు.

అయ్యో! ఆ బోయవానిరూపంలో స్వామి వచ్చి జలం స్వీకరించి దప్పిక తీర్చుకున్నాడా! ఎన్ని తిట్లుతిట్టాను. క్షమించమంటూ భక్తిగా సాష్టాంగనమస్కారం చేశాడు – తిరుమలనంబి. ఆనాటినుంచి తిరుమలనంబి, 'తిరుమల తాతాచార్యులు'గా ప్రసిద్ధి పొందాడు. ఇంతటిభక్తుడైన తిరుమలనంబి మరెవరోకాదు. భగవద్రామానుజులవారికి మేనమామ, అంతేకాదు అలిపిరిలో రామానుజులవారికి శ్రీరామాయణాన్నిగూర్చి ప్రతిరోజు పాఠం చెప్పినగురువు గారుకూడ ఈ తిరుమలనంబి. ఇలా శ్రీరామానుజులవారికి గురువుగా, శ్రీవేంకటేశ్వరస్వామివారికి "తాత"గా ప్రసిద్ధి పొందిన భక్తశిఖామణి తిరుమలనంబి! ఇదీ ఈ మహనీయుని దివ్యగాథ!

నేటికీ ఈ దివ్యగాథను స్మరిస్తూ, ప్రతిసంవత్సరం ధనుర్మాసంలో 'తణ్ణీరముదు ఉత్సవం' జరుగుతుంది. అంటే 'అమృతజలోత్సవం' అన్నమాట, తిరుమలనంబిని స్మరింప జేసే ఈ రోజున తిరుమలనంబి వంశీయులు నేటికీ చందన తాంబూలాలతో సత్కరింపబడుతున్నారు. ఇదీ తిరుమల నంబి దివ్యగాథ!

*(ఇంకా ఉంది)*


వెగటుగా నడిచితే విసిగించు వలపు

# శ్రీవారి ఆణివర ఆస్థానం

డా॥ ఇ.జి. హేమంత కుమార్

తిరుమల వైఖానసాగమానికి చెందిన వైష్ణవదేవాలయం. తమిళసంప్రదాయంతో విడదీయలేని అనుబంధం ఈ క్షేత్రానికుంది. కనుకనే, జూలై నెలలో తమిళ సంప్రదాయాన్ననుసరించి ఆని, ఆడిమాసాల మధ్యలో సౌరమానంప్రకారంగా కర్కాటక సంక్రాంతినాడు తిరుమలలో నిర్వహింపబడే కొలువు ఉత్సవం ఆణివరఆస్థానం.

ఒకప్పుడు శ్రీవారి దేవస్థానానికి సంబంధించిన వార్షిక లెక్కలు ఈ రోజునుండే ఆరంభమయ్యేది. 'తిరు ఆండు ఎళుత్తు ఇడుం పోదు' (అంటే వార్షికప్రారంభం) అనే మాట శాసనోక్తంగా కనబడుతున్నది. గడచినసంవత్సరం యొక్క జమాఖర్చులను ఖచ్చితంగా నిర్ధారించి, ఈ రోజు స్వామివారికి జరిగే ఆస్థానంలో ఆదాయ, వ్యయ వివరాలను మరియు క్రొత్తబేరీజుల వివరాలను వినిపిస్తారు. 16-07-1843లో ఆలయ పరిపాలనాధికారం బాధ్యతను బ్రిటీష్‌వారినుండి మహంతుల వారిచేతికి ఇవ్వబడిన రోజు ఈ రోజు. అందుకు గుర్తుగా ఈ ఆస్థానం ఆనాటినుండి నేటివరకు అవిచ్ఛిన్నంగా నిర్వహింపబడుతున్నది. 90సం॥రాల మహంతులపాలన పిదప ధర్మకర్తలమండలి ఏర్పడి బడ్జెట్‌లెక్కలు మార్చి-ఏప్రిల్‌కి మార్చుకోవడం జరిగినా, దక్షిణాయనపుణ్యకాలప్రారంభంలో ప్రప్రథమంగా నిర్వహింపబడే ఈ కొలువు అత్యంతప్రాధాన్యతను సంతరించుకొన్నది. ఆణివర ఆస్థానానికి ముందువచ్చే మంగళవారం ఆలయాన్ని శుద్ధిచేస్తారు. దీన్నే కోయిలాళ్వార్‌తిరుమంజనంగా పిలుస్తారు.

ఆణివరఆస్థానంరోజు స్వామివారికి సుప్రభాతం, విశ్వరూపదర్శనం, తోమాలసేవ నిర్వహింపబడిన తర్వాత సర్వభూపాలవాహనంలో మలయప్పస్వామి ఉభయదేవేరులతో సర్వాభరణాలంకారశోభితుడై, పరిమళభరితపుష్ప మాలాలంకృతుడై బంగారువాకిలిముందుగల గరుత్మంతునికి అభిముఖంగా కొలువుతీరుతారు. స్వామివారి సర్వసేనాధిపతి శ్రీవిష్వక్సేనులవారు కూడా శిరస్త్రాణాన్ని, ఖడ్గాన్ని ధరించి దక్షిణాభిముఖంగా వేంచేపు చేసి స్వామివారి ఆజ్ఞలను అమలుపరచడానికి సర్వసన్నద్ధంగా ఉంటారు.

మూలవిరాట్టుకు బంగారువాకిలి దగ్గర వేంచేపు చేసి ఉన్న ఉత్సవమూర్తులకు, సేనాధిపతికి విశేషమైన ప్రసాదాలు నైవేద్యంగా నివేదింపబడతాయి. శ్రీమాన్‌పెద్దజీయంగార్లు చక్కగా మడతపెట్టిచుట్టబడిన పట్టువస్త్రాలను పళ్లెంలో తలమీద ధరించి వెండివాకిలి ముందున్న ధ్వజస్తంభానికి ప్రదక్షిణగా వెళ్లి ఆనంద నిలయవిమానానికి ప్రదక్షిణచేస్తూ, మూలమూర్తికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం బంగారువాకిలి దగ్గర వేంచేపు చేసిఉన్న ఉత్సవమూర్తికి, విష్వక్సేనులవారికి నూతనవస్త్రాలను సమర్పించి అలంకరింపజేస్తారు.

ఆణివరఆస్థానంరోజున ప్రధానఅర్చకులు శ్రీవారిపాద వస్త్రంతో తనతలకు పరివట్టంకట్టుకుని (తలకు చుట్టూ కట్టే చిన్నపట్టువస్త్రం) మహాదర్పంగా, ఠీవిగా కొలువుదీరి ఉన్న శ్రీనివాసమూర్తిపై, శ్రీవిష్వక్సేనులవారిపై కుంకుమాక్షతలు చల్లుతారు. ఆ తర్వాత, సేనాధిపతికి కూడా పరివట్టం కట్టి స్వామివారిపై వేసిన అక్షతలను విష్వక్సేనులవారిపై కూడా చల్లి శఠారి మర్యాదలు జరుపుతారు.


ఆణివరఆస్థానం రోజున అర్చకస్వాములు పెద్దజియ్యంగారికి పరివట్టంకట్టి స్వామివారి పాదలవద్ద ఉంచబడిన 'హనుమన్ముద్ర'గా కీర్తింపబడే పెద్దజియ్యంగారి సొంత మొహరును (అంటే సీలు వేసే పరికరాన్ని) దేవస్థానంవారి 'లచ్చన' అని పిలువబడే పెద్దతాళం చెవులగుత్తిని పెద్దజియ్యంగారి కుడిచేతికి తగిలించి, స్వామివారికి హారతినిస్తారు. పెద్దజియ్యంగారికి తీర్థం చందన, తాంబూల, శఠారిమర్యాదలు చేసి తర్వాత తాళం చెవులగుత్తిని స్వామివారి పాదాలవద్ద ఉంచుతారు.

చిన్నజియ్యంగారికి కూడా వారి స్వంతమొహరును, తాళాల గుత్తిని చేతికి తగిలించి హారతి, తీర్థం, చందన, తాంబూల, శఠారి సత్కారం జరుపబడుతుంది. ఏకాంగికి కూడా ఈ మాదిరి గౌరవం నిర్వహిస్తారు. ఆ తర్వాత తి.తి.దే. ఉన్నతాధికారి అయిన శ్రీకార్యనిర్వహణాధికారి వారికి పరివట్టం కట్టి సర్కారు మొహరును, తాళంచెవులగుత్తిని చేతికి తగిలించి హారతి, తీర్థం, చందన, తాంబూల,శఠారిసత్కారాలు నిర్వహిస్తారు. తాళంచెవులు చేతియందు ధరింపచేయడం అంటే బాధ్యతలు స్వీకరించడం అన్నమాట. ధర్మకర్తలమండలి అధ్యక్షులు, సభ్యులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారులు మరియు యావన్మంది సిబ్బంది మరోమారు స్వామివారి సేవలో వారివారి వృత్తిపట్ల పునరంకితమవ్వడానికి నాందిపలికే పర్వదినం ఈ ఆణివర ఆస్థానం.

# శ్రీవరలక్ష్మీ వ్రతకథ

- డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య

వ్రతం చేయించినవారు చదువుతుంటే శ్రద్ధాభక్తులతో వినాలి. తామే చదువుకున్నా- ఏకాగ్రమైన భక్తితో చదువుకోవాలి. అక్కడ చేరిన వాళ్లందరిచేతికి పూలూ, అక్షతలూ ఇచ్చి, కథ అయ్యాక, అమ్మవారికి సమర్పించి, నమస్కరించాలి అని చెప్పాలి



కైలాసపర్వతశిఖరంలో సమస్తమునులూ చేరారు. అక్కడ అనేకవృక్షాలున్నాయి. కుబేరుడు, ఇంద్రుడు, వరుణుడు మొదలైన దిక్పాలకులూ, నారదుడు, అగస్త్యుడు, వాల్మీకి, పరాశరుడు మున్నగు ఋషులూ ఉన్నారు. అక్కడ కల్పవృక్షంసమీపంలో రత్నసింహాసనంపై పరమశివుడు కూర్చొని ఉన్నాడు. ఆయన సకలలోకాలకూ శుభాన్ని కల్గించేవాడు.

అట్టి శివుణ్ణి చూచి, పార్వతీదేవి సంతోషంతో 'సకలలోకేశ్వరా! దయానిధీ! రహస్యమై, పావనమైన ఒక శుభవ్రతాన్ని నాకు వివరించండి' అని లోకక్షేమాన్ని కోరి, ప్రార్థించింది.

శివుడుకూడా సంతోషించి, "పార్వతీ! వ్రతాలలో ఉత్తమమైనవ్రతం ఒకటి ఉంది. అది సకలసంపదలకూ మూలమైంది. పుత్ర, పౌత్రుల్ని అనుగ్రహిస్తుంది. ఈ వ్రతం శ్రీవరలక్ష్మీవ్రతం. దీన్ని శ్రావణమాసంలో పూర్ణిమకు ముందుగా వచ్చే శుక్రవారంనాడు ఆచరించాలి. ఈ వ్రతం చేసిన స్త్రీకి మహాపుణ్యఫలం చేకూర్తుంది"- అనగానే పార్వతి ఎంతో ఉత్సాహంతో "నాథా! ఈ వ్రతాన్ని ఎలా ఆచరించాలో, ఈ వ్రతంలో ఏ దేవతను పూజించాలో, ఈ వరలక్ష్మి దేవిని ఇంతకు ముందు ఎవరు ఆచరించి, ఆమె దయకు పాత్రులయ్యారో తెల్పండి" అనింది.

అందుకు శివుడు "పార్వతీ! పరమపవిత్రమైన శ్రీవరలక్ష్మీవ్రతప్రభావాన్ని వివరిస్తాను- విను. పూర్వం సకల సంపదలకు నిలయమైన కుండిన మనే పేరుగల పట్టణం ఒకటుండేది. ఆ పట్టణంలో 'చారుమతి' అనే సద్గుణవతి- బ్రాహ్మణస్త్రీ ఒకామె ఉండేది. ఆమె పతిసేవాపరాయణు



ఆసలకు తనివేది? ఆసలకు మితియేది?

రాలు విద్యావినయసంపన్న. ఆమెకు లక్ష్మీదేవి కలలో కన్పించి, 'చారుమతీ! రావమ్మా! నీకు మంచి జరుగుతుంది. వరలక్ష్మీదేవిని వచ్చాను. శ్రావణమాసంలో పున్నమకు ముందుగా వచ్చే శుక్రవారం నన్ను పూజించు. నీకు కోరినవరాలు ఇస్తాను" అనింది. చారుమతి స్వప్నంలోనే శ్రీవరలక్ష్మీదేవిని ఎంతగానో ప్రస్తుతించింది. "తల్లీ! నీవు ఎవర్ని కరుణిస్తావో వాళ్లు ధన్యులు, పుణ్యాత్ములు. వాళ్లే అన్నీ కల్గినవాళ్లు. ఎన్నిజన్మలలో ఎంతపుణ్యం చేశానో! లేకపోతే మీ పాదపద్మదర్శనం నాకు లభిస్తుందా?" అంటూ స్తోత్రం చేసింది. చారుమతి చేసిన స్తోత్రానికి సంతోషించిన వరలక్ష్మీదేవి ఆమెకు అనేకవరాలిచ్చి, వెళ్లింది.

చారుమతి కలగన్న తర్వాత మేల్కొనింది. ఆ రాత్రంతా మేల్కొని, ఉదయాన్నే లేచి, రాత్రి వచ్చిన స్వప్న విశేషాలు తన బంధువులకు తెల్పింది. వాళ్లు 'చారుమతీ! నీ కల చాలా మంచిది. మనమందరం ఆ తల్లి చెప్పినట్లే చేస్తామని, నిశ్చయించుకొని, అమ్మవారు తెల్పిన శుక్రవారం ఎప్పుడు వస్తుందా? అని ఎదురుచూచారు. వాళ్లఅదృష్టం వల్ల వరలక్ష్మీవ్రత శుక్రవారం వచ్చింది. స్త్రీలు పరిశుద్ధ మనస్సులతో కలశంలో బియ్యం, మర్రిచిగుళ్లు ఉంచి, వరలక్ష్మీదేవిని ఆవాహనం చేసి, అందరూ భక్తితో అమ్మ వారిని షోడశోపచారాలతో అర్చించారు. తొమ్మిదిముళ్లు గల తోరాల్ని పూజించి, కుడిచేతికి తోరాలు కట్టుకొన్నారు. నెయ్యితో చేసిన పిండివంటలు, మధురపదార్థాలూ అమ్మ వారికి నివేదించారు. నిష్ఠావంతుడైన ఒకబ్రాహ్మణునికి పన్నెండుభక్ష్యాలతో, దక్షిణతాంబూలాలతో వాయనమిచ్చారు. అమ్మవారికి నమస్కరించి, పిదప సంతోషంతో భోజనాలు చేశారు. వరలక్ష్మీదేవిదయవల్ల చారుమతిమొదలైన స్త్రీలంద రికీ అనేకఆభరణాలు చేకూరాయి. అందరూ సంతోషంగా ధరించారు. ఇలా సంపదలేకాక– అందరూ పుత్రపౌత్రవతులై శోభిల్లారు. ధనధాన్యాలు పుష్కలంగా సిద్ధించాయి.

పార్వతీ! చారుమతీదేవి ద్వారా ఆ వరలక్ష్మీవ్రతాన్ని గూర్చి ఒకరిద్వారా మరొకరుగా తెలుసుకుని, వ్రతాన్ని ఆచరించి, భాగ్యవతులై ఆనందించారు. వాళ్లందరూ 'మనం చారుమతివల్ల ఎంతో ధన్యుల మయ్యాము. చారుమతి



ఎంతో ధన్యురాలు. పుణ్యాత్మురాలు. ఆమెకు వరలక్ష్మీదేవియే ప్రత్యక్షమై ఈ వ్రతాన్ని ఉపదేశించింది' అని పొగడారు. పార్వతీ! అప్పటినుంచీ, ఈ వ్రతం 'వరలక్ష్మీవ్రతం' అని లోకంలో ప్రసిద్ధికెక్కింది. ఇది మిక్కిలి ప్రశస్తమూ, ఉత్తమమూ అయిన వ్రతం. దీన్ని నీకు పూర్తిగా వివరించాను.

ఈ వ్రతాన్ని గూర్చి ఎవరు వింటున్నారో, లేక విన్పించుకొంటున్నారో వాళ్లకు శ్రీవరలక్ష్మీదేవీప్రభావంవల్ల సకలకార్యాలూ తప్పక సిద్ధిస్తాయి అని వివరించాడు శివుడు. చారుమతివంటి భక్తిప్రపత్తులున్న వాళ్లకు లక్ష్మీకృప తప్పక సిద్ధిస్తుంది.

ఇది భవిష్యోత్తరపురాణంలోని పార్వతీపరమేశ్వరుల సంవాదంలోనిది.

-- శుభమస్తు --



# నవకాయ పిండివంటల వ్రతం



- శ్రీమతి వైజయంతి పురాణపండ

ఏటా శ్రావణమాసంలో వచ్చే రెండవశుక్రవారం తెలుగువారికి ప్రత్యేకం. ఆ రోజున లక్ష్మీదేవిని వరాలిచ్చే వర లక్ష్మిగా ప్రీతితో కొలుస్తారు. శక్తికొద్దీ అమ్మవారిప్రతిమ తయారుచేస్తారు. కొత్తబట్టలు ధరిస్తారు. ఈ వరలక్ష్మీవ్రతాన్ని చాతుర్వర్ణాలవారు అత్యంతభక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. అమ్మవారికి నిండుగా నైవేద్యాలు సమర్పించటం ఈ పండుగ ప్రత్యేకత. ముఖ్యంగా తొమ్మిదిరకాల పిండివంటలు తయారు చేసి అమ్మవారికి నివేదిస్తారు. నవకాయ పిండివంటలు అంటే రకరకాల పిండివంటలు తొమ్మిది రకాలు తయారుచేస్తారు. అలాగే అష్టలక్ష్ములకు శ్రీవరలక్ష్మీ అమ్మవారిని జతచేసి, తొమ్మిది మంది మహాలక్ష్ములకు తొమ్మిదిరకాల నైవేద్యాలు తయారు చేస్తారు.

వాస్తవానికి శ్రీరామనవమి తర్వాత సుమారు రెండున్నర నెలలపాటు పెద్దపండుగలంటూ ఉండవు. తొలి ఏకాదశినాడు ఉపవాసం ఉంటారు. ఆ రోజు పిండివంటల ప్రస్తావనే ఉండదు. ఆ తర్వాత వచ్చే శ్రీవరలక్ష్మీవ్రతం వర్షాకాలంలో రావటంవల్ల, ప్రజలలో ప్రశాంతత నెలకొని ఉంటుంది.

ఇంకా, వానలవల్ల శరీరానికి వేడి పుట్టించే పదార్థాల ఆవశ్యకత అధికంగా ఉంటుంది. ఈ పండుగకు తప్పనిసరిగా తయారుచేసే నైవేద్యం అపూపములు లేదా ఉండ్రాళ్లు. కుండిన నగరంలో చారుమతి చేసిన ఈ వ్రతంవల్ల ఆమెకు సకలసంపదలు చేకూరినట్లుగా వ్రతకథ. ఆ రోజున రకరకాల పిండివంటలు తయారుచేసి, బండ్లమీద ఊరుచివర ఉన్న అమ్మవారిఆలయానికి వచ్చి, ఆ తల్లికి నివేదన చేసి, ఆ ప్రసాదాన్ని తోటివారితో కలిసి తిన్నట్లుగా వరలక్ష్మీవ్రతకథ చెబుతోంది.

అంటే పండుగ అనేది బంధుమిత్రులతో కలిసి, విందుగా, కనువిందుగా చేసుకునే పండుగ. కలిమిలేములకు దూరంగా అందరూ అమ్మవారిని ప్రార్థించి, సమర్పించిన ప్రసాదాన్ని అందరూ సమానంగా సేవించటమన్న మాట.

ఈ పండుగనాడు ఒక్కో ప్రాంతంవారు, ఒక్కో కులం వారు వారివంశాచారంగా వచ్చే ఆనవాయితీని అనుసరిస్తారు. ఎవరు ఎన్నిరకాలు చేసినా ఉండ్రాళ్లు, కొబ్బరికాయ, మొలకెత్తిన సెనగలు తప్పనిసరి. ఈ పండుగనాడు గారెలు, రవ్వకేసరి, చక్కెరపొంగలి, చలిమిడి, బూరెలు, పులిహోర, బొబ్బట్లు, ఉండ్రాళ్లు, బాదుషా, కజ్జికాయలు, కొబ్బరిలడ్డు, రవ్వలడ్డు, సేమ్యా, పరమాన్నం, అటుకుల పాయసం, అప్పాలు, చంద్ర కాంతలు, బెల్లంగారెలు, బూరెలు, చిట్టిబుడగలు, పెరుగు గారెలు, కట్టెపొంగలి, సెనగగుగ్గిళ్లు, దద్ధ్యోదనం ఇలా రకరకాలు తయారుచేస్తారు.

ఒక్కోరకంనుంచి తొమ్మిదేసి చొప్పున వేరు చేసి, తొమ్మిదిరకాలు ఒక ముత్తయిదువకు వాయనం ఇస్తారు. సర్వ సాధారణంగా బ్రాహ్మణస్త్రీకి ఈ వాయనం అందచేస్తారు. తమకు వాయనం ఇచ్చే అదృష్టం కలిగించినందుకు అమ్మవారిని మన స్ఫూర్తిగా స్మరించుకుంటారు.

మనకు ఉన్నదాన్ని నలుగురితో పంచుకోవటమే మన పండుగలలోని పరమార్థం. దాంతో పాటు ఆరోగ్యం ప్రధానం. ప్రతిపండుగకు ప్రత్యేకంగా నైవేద్యాలు ఉంటాయి. ఇవి ఆయా ఋతువుల ఆధారంగా రూపొందించినవే! ఉగాదికి ఉగాది పచ్చడి, శ్రీరామనవమికి పానకం, సంక్రాంతికి పొంగలి.., వీటిని పరిశీలిస్తే మనప్రసాదాలలోని పరమార్థం అర్థమౌతుంది.

పండుగ ప్రధానలక్ష్యం 'లోకాస్సమస్తాస్సుఖినోభవంతు' అనే నినాదమే! అందరూ సుఖంగా, హాయిగా ఉండాలి. పేద, గొప్ప తారతమ్యాలు లేకుండా అంతా ఒక్కటే, మనమంతా ఒక్కటే అనేభావనలో జీవించాలని ప్రతిపండుగ మనకు బోధి స్తుంది. పండుగలోని పరమార్థాన్ని అర్థం చేసుకుని, తోటివారి కడుపునింపటానికి పండుగలను సాధనంగా ఉపయోగించు కుందాం!



# చంద్రగిరి-శ్రీకోదండరామాలయం

- డా॥ సంగీతం కేశవులు

అచ్యుతదేవరాయుల ప్రతినిధిగా రామభట్టు చిత్తూరు జిల్లా, చంద్రగిరిరాజ్యాన్ని పరిపాలిస్తుండేవాడు. ఆయన చంద్రగిరి దుర్గంకొండక్రింద 'తిరువేంకటాపురం' అనే అగ్రహారాన్ని నిర్మించి, అక్కడ రఘునాథఆలయం నిర్మించాడు. అందులో శ్రీకోదండరామస్వామిని ప్రతిష్ఠించాడు. ఈ ఆలయనిర్మాణం క్రీ.శ.1535లో జరిగింది. ఈ ఆలయమే తర్వాత కాలంలో శ్రీకోదండరామాలయంగా ప్రఖ్యాతి గాంచింది.

ఈ కోదండరామాలయంలో సీతారాములతో పాటు, భరతశత్రుఘ్నులు విగ్రహమూర్తులుగా కొలువై ఉన్నారు. ఈ ఆలయంలో శ్రీఆంజనేయస్వామిరూపం తిరుమల క్షేత్రంలో ఉన్న జాపాలితీర్థంలోని ఆంజనేయస్వామిని దర్శించిన అనుభూతిభక్తులకు కలుగుతుంది.

ఆ ఆలయంలో విశేషంగా చెప్పుకోదగ్గవి - గరుడుడు, శ్రీలక్ష్మీనరసింహుడు, గోదాదేవి, శ్రీవేణుగోపాలస్వామి, విష్వక్సేనులవారు, చక్రత్తాళ్వార్, పన్నిద్దరు ఆళ్వారుల విగ్రహ ప్రతిమలు.

అచ్యుతదేవరాయలకాలంలో ఈ కోదండరామాలయం ముందు పెద్దకోనేరు ఉండేది. సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తెప్పోత్సవాలు నిర్వహించబడేవి అని చరిత్ర చెబుతోంది. ఈ ఆలయంలో శ్రీరామనవమిఉత్సవాలుకూడా తొమ్మిదిరోజులు వైభవంగా నిర్వహించేవారు.

ఈ ఆలయంలో పూర్వంనుండి అనేకరకాల పండుగలు, విశేషమైన పూజాకార్యక్రమాలు నిర్వహించబడేవి. రథసప్తమి, ధనుర్మాసపూజలు, కార్తికదీపోత్సవం, వైకుంఠఏకాదశి, పర్వదినాలలో ఆలయం ప్రత్యేకశోభతో అలరారేది. ప్రతిపౌర్ణమికి అనేకప్రాంతాలనుంచి భక్తులు వచ్చి, ప్రత్యేకపూజలు నిర్వహించి, తమమొక్కుబడులు చెల్లించుకుంటారు.

1900 సం॥లో ఈ కోదండరామాలయాన్ని శ్రీమొగిలి రెడ్డినారాయణస్వామిరెడ్డిగారు జీర్ణోద్ధరణ చేశారు. ఈ ఆలయ అభివృద్ధి 1979 సం॥లో విస్తరించబడింది. 1979 జూలై 11న ఆలయంలో అష్టబంధనం, ధ్వజస్తంభస్థాపన, కుంభాభిషేకం జరిగింది. ఈ కార్యక్రమాలతో ఈ ఆలయానికి పూర్వవైభవం వచ్చింది. 2015, సెప్టెంబర్ 23వ తేదీన తి.తి.దే. అనుబంధ ఆలయపరిధిలోకి వచ్చింది. అప్పటినుండి ఈ ఆలయం నిత్య కల్యాణం పచ్చతోరణంలా పూర్వవైభవంతో విరాజిల్లుతున్నది. తిరుమలకు, తిరుపతికి వచ్చినభక్తులు నిత్యం ఈ ఆలయాన్ని దర్శించడానికి వస్తుంటారు.

మన దేవాలయాలు



భాగవత కథాసాగరం

# ప్రహ్లాదుని ఆహ్లాదగుణాలు

- డా॥ వైష్ణవాంఘ్రి సేవకదాస్

సోదరుని మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలని సంకల్పించిన హిరణ్యకశిపుడు మొదట జరామరణవిముక్తుడు కావాలని నిర్ణయించుకుని, మందరపర్వతలోయకు వెళ్ళి, కాలి బొటనవేళ్లపై నిల్చి, చేతులను ఆకాశంలోకి చాచి, ఘోర తపస్సు చేయడం మొదలుపెట్టాడు.

ఇది దేవతలకు ఎంతో భీతిని కలిగించింది. అందరూ బ్రహ్మదేవుడిదగ్గరకు వెళ్ళి, ఆలస్యం చేయకుండా తగిన ప్రతిచర్య తీసుకొమ్మని చెప్పారు. అపుడు బ్రహ్మ భృగువు, దక్షుడు మున్నగువారితో గూడి, మందరపర్వత లోయకు చేరుకున్నాడు. శల్యగతప్రాణుడై హిరణ్యకశిపుడు చేసిన తపస్సు బ్రహ్మకే ఆశ్చర్యాన్ని కలిగించింది. ప్రసన్ను డైన అతడు ప్రశాంతవదనంతో వరం ఇవ్వడానికి సిద్ధ పడ్డాడు.

"కశ్యపతనయా! నీకు శుభమగు గాక! వెంటనే తపస్సునుండి లెమ్ము. నీవు కోరినవరాన్ని ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను. మహర్షులకైనా సాధ్యం కానట్టి ఘోరమైన తపస్సును చేసి, నీవు నన్ను జయించావు" అని పలికి, బ్రహ్మదేవుడు తనకమండలంలోని జలాన్ని హిరణ్య కశిపునిపై చల్లాడు. ఆ జలప్రభావంతో హిరణ్యకశిపుడు అపూర్వబలసంపన్నుడయ్యాడు. ఆ అసురుడు బ్రహ్మకు వందనం చేసి, గద్గదకంఠంతో స్తుతించి, తన మనస్సులోని మాటను బయటపెట్టాడు.

"దేవా! వరదశ్రేష్ఠా! నీవు నాకు వరాన్ని ఇవ్వ దలిస్తే నీచే సృష్టించబడ్డ ఎవ్వరిచేతను నాకు మరణం కలుగనట్లుగా అనుగ్రహించాల్సిందని ప్రార్థిస్తున్నాను. ఇంట్లో గాని, బయటగాని, పగలుగాని, రాత్రిగాని, నేలపైన గాని, ఆకాశంలో గాని నేను మరణించనివరాన్ని ఇవ్వు. ఏ ఆయుధాలచేతగానీ, మానవులచేతగానీ, స్థావరజంగమ జీవులలో దేనిచేతగానీ, దేవదానవులవల్లగానీ, అధో లోకంలోని మహాసర్పాలచేతగానీ మరణింపని వరాన్ని నేను కోరుకుంటున్నాను. యుద్ధరంగంలో నాకు ప్రతిద్వంద్వి ఉండకూడదు. సమస్తలోకపాలురపై సర్వాధిపత్యాన్ని నాకు ఇవ్వు. ఆ పదమువల్ల కలిగే సమస్తయశస్సును కూడ నాకు ఇవ్వు. తపోయోగాదులచే కలుగునట్టి అష్టసిద్ధులను కూడ నాకు ప్రసాదించు" అని.


హిరణ్యకశిపుడు అడిగిన వరాలు దుర్లభాలైనప్పటికీ అతనితపస్సుకు మెచ్చినబ్రహ్మ వాటిని ఇచ్చి, తనలోకానికి వెళ్లిపోయాడు. వెంటనే హిరణ్యకశిపుడు వికటాట్టహాసం చేసి, తనఆసురీప్రవృత్తిని లోకానికి చూపించడం మొదలు పెట్టాడు. సైన్యసమేతంగా ముల్లోకాలపై దాడి చేసి, వాటి నన్నింటిని తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. ఏకంగా ఇంద్ర భవనాన్నే అతడు తననివాసంగా మార్చుకున్నాడు. ఆ సమయంలో దేవతలు అతనిపాదాలకు నమస్కరించాల్సి వచ్చేది. అతడు వారిపట్ల అతికఠినంగా వర్తించేవాడు. అసురరాజు పెట్టే బాధలకు తల్లడిల్లిన లోకపాలురు విష్ణువును శరణుజొచ్చారు. తమగోడును వెలిబుచ్చారు. అపుడు వారికి ఒక అశరీరదివ్యవాణి వినిపించింది.

"దేవతాశ్రేష్ఠులారా! భయపడకండి. మీకు సమస్త శుభాలు కలుగుతాయి. నా నామకీర్తన చేయండి, నా కథ లను వినండి, నన్ను స్తుతించండి. ఈ కార్యాలన్నీ జీవులకు వరాలను ఇవ్వడానికి ఉద్దేశించబడ్డాయి. హిరణ్యకశిపుని దుష్కర్మలు నాకు తెలుసు. త్వరలోనే వాటిని నేను నిలుపు జేస్తాను. అప్పటి దాకా మీరు ఓపిక పట్టండి. ప్రశాంతుడు, నిర్వైరి, తనపుత్రుడునైన ప్రహ్లాదుణ్ణి అతడు కష్టపెట్టడం మొదలు పెట్టగానే అతణ్ణి నేను సంహరిస్తాను. బ్రహ్మదేవుని వరాలు ఉన్నప్పటికీ ఆ దానవుణ్ణి నేను వధిస్తాను."

లోకగురుడైన భగవంతునిమాటలను విని, దేవ తలు హిరణ్యకశిపుడు ఇక చచ్చినట్లేనని నిర్ణయించుకుని,



చేసినట్టి తప్పు గాచినదే దొరతనము



తమ తమ నివాసాలకు వెళ్లిపోయారు. హిరణ్యకశిపునికి నలుగురు కుమారులు.

వారిలో ప్రహ్లాదుడు సర్వశ్రేష్ఠుడు. విశుద్ధభక్తుడైన అతడు దివ్యగుణనిధియై ఉండేవాడు. కేవలం ఐదేళ్లబాలుడే అయినా అతడు చక్కని నడవడితో, పరతత్త్వాన్ని తెలుసుకోవాలనే కృతనిశ్చయంతో బ్రహ్మణ్యగుణసంపన్నుడై ఉండేవాడు. సకలజీవులపట్ల దయాస్వభావం కలిగి ఉండేవాడు. అతడు అందరికీ మిత్రునిలాగా వర్తిస్తూ, పెద్దలపట్ల సేవకునిలాగా, దీనులపట్ల తండ్రిలాగా, సమానులపట్ల సోదరునిలాగా మెలగేవాడు. గురువులను, పెద్దవారైన తోటిశిష్యులను అతడు భగవంతునితో సమానంగా చూచేవాడు. విద్య, సౌందర్యం, ఉన్నతకుల జన్మంవల్ల కలిగే సహజగర్వానికి అతడు సర్వదా దూరంగా ఉండేవాడు. అసురవంశంలో జన్మించినప్పటికీ అతడు విష్ణుభక్తుడయ్యాడు. వైష్ణవులను అతడెన్నడూ ద్వేషించలేదు. ఎటువంటి పరిస్థితులలోనైనా అతడు కలత చెందేవాడు కాడు.

నిజానికి ప్రహ్లాదునికి చిన్నప్పటినుండే ఆటలపై రుచిలేదు. అతనిచిత్తం సర్వదా శ్రీహరిస్మరణలో నిలిచి ఉండేది. శ్రీహరిచింతనలో మునిగినవాడై అతడు కూర్చుండుట, నిలబడుట, నడచుట, అన్నపానీయాలు స్వీకరించుట, సంభాషించుటవంటి పనులు ఏ విధంగా జరిగిపోతున్నవో గుర్తించేవాడు కాడు.

సర్వత్ర శ్రీహరినే దర్శించే ప్రహ్లాదుడు ఒకప్పుడు రోదించేవాడు, ఒకప్పుడు నవ్వేవాడు, ఒకప్పుడు ఆహ్లాదం కనబరచేవాడు, మరొకప్పుడు గానం చేస్తుండేవాడు, ఉయ్యాలలో పడుకోబెట్టి తల్లి వెళ్లిపోగానే పసిపిల్లవాడు ఎలా ఏడుస్తాడో అదేవిధంగా ప్రహ్లాదుడు శ్రీహరిదర్శనం కాకపోతే ఏడ్చేవాడు.

"శ్రీమన్నారాయణుడెక్కడ ఉన్నాడు" అంటూ అటుఇటూ చూస్తూ విరహభావనను పొందేవాడు.

"నాయనా! ఏడవకు, వస్తున్నాను" అని పలుకుతూ తల్లి పిల్లవాని చెంతకు వచ్చినట్లు తనను ఊరడించడానికి భగవంతుడు రావడం చూచి, "అదిగో! నా దైవం వస్తున్నాడు" అని భావిస్తూ అతడు నృత్యం చేసేవాడు.

ఒక్కొక్కసారి అతడు భావవిహ్వలుడై భగవల్లీలలను అనుకరించేవాడు. ఇంకొకసారి భగవంతునికరస్పర్శకు పులకితుడై అర్ధనిమీలితనేత్రాలనుండి ఆనందాశ్రువులు రాలుస్తూ మౌనంగా ఉండిపోయేవాడు.

అంతటి పరమభాగవతోత్తముని పారవశ్యలక్షణాలను చూచి, ఆధ్యాత్మికావగాహన లేనివారుకూడ పునీతులయ్యేవారు.

# వైనతేయుడికి వందనం...

- డా॥ కప్పగంతు రామకృష్ణ

గరుత్మంతుడనే పేరు చెప్పగానే రోమాలు నిక్క బొడుచుకుంటాయి. తెలియనిఆవేశం, శక్తి కలుగుతాయి. మహావీరుడిఅండ మనచెంతనే ఉందన్నధైర్యం కలుగు తుంది. మరెవ్వరితో పోల్చలేనంతబలం గరుత్మంతుడి సొంతం. వేగంలోనూ గరుడవేగం అందుకోవటం మరే ఇతర ప్రాణికీ సాధ్యం కాదు. కేవలం తన రెక్కలు విసిరి, రాక్షసుల ప్రాణాలు సంహరించే మహత్తరశక్తి అతని సొంతం. ఇతడు పక్షులరాజుగా మాత్రమే కాదు... తల్లిని దాస్యం నుంచి విడిపించిన గొప్పపుత్రుడిగా గరుత్మంతుడు నేటితరానికి మార్గదర్శకుడిగా నిలుస్తాడు. ఇన్ని ఘనతలు తనకు ఉన్నా శ్రీహరిదాసుడిగా, సేవకుడిగా, వాహకుడిగా అత్యంత వినయంతో హరిముంగిట నిలుస్తాడు- వైనతేయుడు.

శ్రావణశుద్ధపంచమి గరుత్మంతుడు పుట్టినరోజు. ఇందుకు ప్రతీకగా ఆ రోజును గరుడపంచమిగా జరుపు కోవటం ఆనవాయితీగా వస్తోంది. గరుత్మంతుణ్ణి అర్చించిన వారికి సర్పబాధలనుంచి విముక్తి కలుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి.


గరుత్మంతుడిపేరుతో అథర్వణవేదంలో ప్రత్యేకంగా ఉపనిషత్తుకూడా ఉంది. దీన్ని గారుడోపనిషత్తు అంటారు. ఇందులో గరుత్మంతుడి గురించి ఎన్నో గొప్ప విశేషాలను ప్రత్యేకంగా వివరించటం జరిగింది. గరుత్మంతుడివిగ్రహ స్వరూపంకూడా ఇందులో ఉంది. దీనిప్రకారం గరుత్మం తుడు తనకుడిపాదాన్ని స్వస్తికంగా, ఎడమపాదాన్ని కుంచితంగా ఉంచి, విష్ణువుకు నమస్కరిస్తున్న భంగిమంలో ఉంటాడు. ఆభరణాలుగా శ్రేష్ఠమైన జాతికి చెందిన నాగుల్ని ధరిస్తాడు. వాసుకి అనే సర్పాన్ని యజ్ఞోపవీతసూత్రంగా, తక్షకుణ్ణి కటిసూత్రంగా, కర్కోటకుణ్ణి హారంగా ధరిస్తాడు. కుడిచెవికి పద్ముడిని, ఎడమచెవికి మహాపద్ముడిని కుండలాలుగా పెట్టుకుంటారు. శిరస్సుమీద శంఖుడు, భుజాలమధ్య గుళికుడు అలంకారాలుగా ఉంటారు. ఇతర ఆభరణాలు కూడా సర్పాలుగా ఉంటాయి. పొడవైన బాహువులు, పెద్దమూపు, వందచంద్రుల కాంతి గల ముక్కు కలిగి ఉంటాడు. గరుత్మంతుడిని ధ్యానించటం, అర్చించటం వల్ల కలిగే ఫలితాలు ఈ ఉపనిషత్తులో ఉన్నాయి.

గరుత్మంతుడి పరాక్రమానికి, శక్తికి ప్రతీకగా నిలిచే ఘట్టం రామాయణంలో ఉంది. ఇంద్రజిత్తు చేసిన మాయా యుద్ధప్రభావంవల్ల, నాగాస్త్ర ప్రయోగంవల్ల రామలక్ష్మణులు ఇద్దరూ మూర్ఛపోతారు. వారిదేహమంతా బాణాలదెబ్బ లతో నిండిపోయింది. అమోఘమైననాగపాశాలనుంచి వారిని విడిపించటం ఎవరివల్లా కాలేదు. తననాగాస్త్రబంధం నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరనే గర్వంతో ఇంద్రజిత్తు లంకకు వెళ్తాడు. రామలక్ష్మణులు ఎంతసేపటికీ మూర్ఛనుంచి తేరుకోక పోవటంవల్ల విభీషణుడితోసహా వానరసేన ఆవేదన చెందుతుంది. ఇంతలో గరుత్మంతుడు మహాప్రభంజనంగా దేవలోకంనుంచి వస్తాడు. అతడు వస్తున్నప్పుడు వీచిన గాలికి సముద్రం అల్లకల్లోలమవుతుంది. అతడు రామలక్ష్మణులను సమీపించటంతోనే వారిని బంధించిన నాగపాశాలన్నీ విడిపోతాయి. గరుత్మంతుడు వారికి నమస్కరించి, తన రెండుచేతులతో వారిసర్వావయవాలను నిమురుతాడు. క్షణకాలంలో గాయాలు మాని, వారిద్దరికీ దివ్యతేజస్సు కలగటంతో పాటు ఇంతకుముందుకంటే ఎక్కువబలం కలిగింది. గరుత్మంతుడు చేసినమేలుకు అందరూ అతణ్ణి ప్రశంసిస్తారు. గరుత్మంతుడుమాత్రం రాముడిని నారాయణా వతారంగా కీర్తించి, అతడికి నమస్కరించి, దేవలోకానికి వెళ్లిపోతాడు. గరుత్మంతుడు గనుక ఆదుకోకపోతే రామా యణకథ ఏ మలుపు తిరిగేదో!!



లోతు కొలదే పాతు

ప్రతివ్యక్తి రాత్రి నిద్రపోయేముందు **'రామం స్కందం హనూమంతం వైనతేయం వృకోదరం, శయనే యః పఠేన్నిత్యం దుస్స్వప్నం తస్య నశ్యతి'** అనే శ్లోకాన్ని చదువుకోవాలని శాస్త్రాలు చెబుతున్నాయి. రాముడు, సుబ్రహ్మణ్యస్వామి, హనుమంతుడు, గరుత్మంతుడు, భీముడు వీరిని తలుచుకుంటే దుస్స్వప్నాలు కలగవని దీనిభావం.



తిరుమల కొండపై శ్రీవారికి జరిగే బ్రహ్మోత్సవాల్లో అగ్ర తాంబూలం గరుత్మంతునిదే. శ్రీవారిఉత్సవాల ప్రారంభసూచకంగా గరుత్మంతుని చిత్రం ఉన్న పతాకాన్ని అర్చకస్వాములు ఎగురవేస్తారు. దీన్నే ధ్వజారోహణం అంటారు. ముక్కోటిదేవతల్ని ఉత్సవాలకు రావల్సిందిగా గరుత్మంతుడు ఆహ్వానిస్తాడు. ఉత్సవాల్లో గరుడపతాకా విష్కరణకు ఎంతో ప్రాధాన్యత ఉంది.

అలాగే, బ్రహ్మోత్సవాల్లో జరిగే వాహనసేవల్లో గరుడవాహన సేవ ఎంతో ప్రత్యేకమైంది. ఈ ఉత్సవాన్ని చూడటానికి లక్షలాదిమంది భక్తులు కొండకు చేరుకుంటారు. దాసుడిగా, మిత్రుడిగా, విసనకర్రగా, ఆసనంగా, ఆవాసంగా, ధ్వజంగా ఇలా తన జీవితసర్వస్వాన్నీ శ్రీహరి సేవకు అంకితం చేసినదాసోత్తముడు గరుత్మంతుడు. వైష్ణవసంప్రదాయంలో గరుత్మంతుడుని గరుడాళ్వార్ అనే పేరుతో దైవంగా కొలుస్తారు.

పక్షిజాతిలో మరెవ్వరికీ దక్కనిదీ గరుత్మంతునికి మాత్రమే దక్కిన ఘనత అతనిపేరుతోనే ఒక పురాణం ఏర్పడటం. వ్యాసమహర్షి వ్రాసిన 18 పురాణాల్లో గరుడపురాణం ఒకటి. శ్రీమహావిష్ణువు స్వయంగా గరుత్మంతునికి ఉపదేశించిన ధర్మరహస్యాలన్నీ ఇందులో ఉంటాయి.

**'ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం కాలః కలయతా మహం। మృగాణాంచ మృగేంద్రోఽహం వైనతేయ శ్చ పక్షిణామ్ (10:30)'** 'పక్షులలో గరుత్మంతుణ్ణి నేనే అంటూ జగద్గురువు శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో స్వయంగా చెప్పినమాట ఇది. ఇంతకుమించి గరుత్మంతుని ఘనత చెప్పటానికి మరొక ఉదాహరణం అవసరం లేదు.

అన్నమాచార్యులుకూడా తన సంకీర్తనల్లో అనేకచోట్ల గరుత్మంతుని ప్రస్తావన చేస్తాడు. గరుడాళ్వారుగా, మిత్రుడుగా, సేవకుడిగా, పరాక్రమవంతుడిగా గరుత్మంతుణ్ణి అనేకవిధాలుగా కొనియాడుతూ– అన్నమయ్య సంకీర్తనా గానం చేశాడు.

**'గరుడధ్వజం బెక్కె కమలాక్షుపెండ్లికి పురుషులదివో వచ్చి పై పై సేవించను'** అంటూ నల్లనిస్వామిపెళ్లిలోని వైభవానికి గరుత్మంతుడుకూడా ఓ కారణమంటాడు– అన్నమయ్య.

# శ్రీవేంకటాచలమాహాత్మ్యంలో 'వకుళమ్మ' చిత్రణ

- శ్రీమతి వరిగొండ సునంద

ఆంధ్రవాఙ్మయంలో వేంకటాచలమాహాత్మ్య రచయితలలో పదకవితాపితామహుడు అన్నమయ్య మొదటివాడు. కాని అన్నమయ్యరచన అలభ్యం. తరువాతికాలంలో వేంకటాచలమాహాత్మ్యం రచించిన ప్రసిద్ధకవయిత్రి తరిగొండ వెంగమాంబ. ఈ మాహాత్మ్యకావ్యంలో ఆరు ఆశ్వాసాలున్నాయి. ఈ ఆరు ఆశ్వాసాలలో వకుళమ్మ ప్రశస్తి నాలుగు, ఐదు, ఆరవ ఆశ్వాసాలలో కనిపిస్తుంది.

తరిగొండ వెంగమాంబ వేంకటాచలమాహాత్మ్యం నాల్గవఆశ్వాసంలో వరాహదేవునిచెంత పరిచారికగా (4.195) వకుళమ్మను పరిచయం చేసింది. వకుళమ్మ ఎవరో కాదు. పూర్వజన్మలో యశోద. బాలకృష్ణుని బాల్యలీలలను కళ్ళారా చూచి, పరవశించిన మాతృమూర్తి. శ్రీకృష్ణుడు మధురానగరానికి వెళ్ళాక ఆ తల్లి శూన్యమనస్క అయింది. సంవత్సరాలు దొరలిపోతున్నాయి. 'కాలగతి'లో ఆవిడ తనువు చాలించింది. సృష్టికర్త అయిన బ్రహ్మ 'యశోదవృత్తాంత మరసి' అట్లు చేయుట కాదటంచు వకుళమ్మపేరుతో ఆ తల్లికి మరో మానవజన్మ ప్రసాదించాడు. అంతమాత్రమే కాదు భూవరాహస్వామిచెంత (4.196) నిలిపినాడట! మరుజన్మలో యశోదకు ప్రతిరూపమైన వకుళతల్లిదండ్రులను, వారి ఉనికి గురించి వెంగమాంబ రచనలో ఏవీ కనిపించవు. కాని వకుళమ్మ ఒకసారి తిరుమలేశునితో తాను కన్యకాదీక్ష నిక్కంబుగా పూని గురునిష్ఠతో ఉండగా పరమగురుడు నీయట్టి పుత్రరత్నంబును కనక పెంచక నిచ్చె (4.320) అని మాటవరుసకు చెప్పుకొంది.

వైకుంఠవిరక్తుడయిన స్వామి తిరుమలపై వేంచేసిన భూవరాహస్వామిని దర్శించి, తనకు వాసం కల్పించవలసిందిగా కోరినప్పుడు ఆ దేవుడే వకుళమ్మను పరిచారికగా నియమనం చేశాడు. ఆనాటినుండి వకుళమ్మ వేంకటేశుణ్ణి తనపుత్రునిగా భావించి, ఆలనపాలన చేసేది. వకుళమ్మ స్వామిని చూచుకొన్నతీరులో 'పుత్రప్రేమ' ఉట్టిపడుతుంది.

లోకంలో వ్యక్తుల బాధలు రకరకాలు. స్వామికున్న బాధ చిత్రమయింది. లక్ష్మీదేవి అలిగి వైకుంఠం వదలిపోవడం, దేవేరి అయిన లక్ష్మిలేని వైకుంఠం, స్వామికి శూన్యంగా కనిపించడం, అశాంతితో శేషాచలం రావడం, ఎవరికీ మొగం చూపించడం ఇష్టంలేక, కాననసీమలో పుట్టలో నిరాహారిగా కాలం గడపడం, చివరకు అయాచితంగా స్రవించినపాలతో రోజులు నెట్టుకురావడం, ఆపై వల్మీక నివాసం వదలి, తిరుమలలోనే ఉండాలని భూవరాహస్వామిని వేడడం ఇలాంటివి. వకుళమ్మకు ఈ సంగతులు తెలుసో తెలియదో గాని వరాహస్వామిపరిచారికగా శ్రీనివాసుని దగ్గరికి వెళ్ళినవేళ ఆ స్వామి ఆకలిదప్పులతో అలమటిస్తున్నాడని చప్పున గ్రహించింది. తానిక పరిచారికగా మసలదలచుకోలేదు.

యుగాలు మారినా, జగాలలో మార్పులు వచ్చినా, ఏ తల్లి అయినా తన కుమారునికి తానే అన్నం తినిపించాలనుకోవడం సహజం. ఈ చర్యలో తల్లి పొందే ఆనందం అద్వితీయం. అంచేత వకుళమ్మ ముందు స్వామికి 'శ్యామకాన్నంబు దేనెయున్ భోజనం' సేయించిందట (4.195). మొదటిది కడుపునిండడానికి. రెండవది బలవర్ధకానికి. ఏదయితేనేం? తల్లి పెట్టే అన్నంతో స్వామి తేరుకొన్నాడు. ముందటి జవసత్త్వాలు వచ్చాయి. పరిసరప్రాంతాలలో తచ్చాడడం మొదలయింది.

వకుళమ్మలోని 'మాతృత్వం' పొంగిపొరలిన రెండవ సన్నివేశం. స్వామి పద్మావతిచెలులరాళ్ళదెబ్బలకు ఒళ్ళు హూనమయి అవమానంతో గూడు చేరుకొన్నవేళ వకుళమ్మ కొడుకుదైన్యాన్ని గుర్తించింది. ముసుగెట్టుకొని పడుకొన్న మురారిని చూచింది. దగ్గరకు వెళ్లింది. శూన్యంలో దిక్కులు చూస్తున్న సుతుని చూడగానే వకుళమ్మకు కడుపులో చేయెట్టి కలచినట్టయింది. ఈ సన్నివేశాన్ని తరిగొండ వెంగమాంబ కరుణరసాత్మకంగా వర్ణించింది.



దైవము చేసిన సేత తప్పించరాదు

'అన్నా! వేంకటా! లే లే! ఆకలికారణంగా నిదరో తున్నావా? అన్నం, పరమాన్నభక్ష్యాలతో వచ్చాను. లేచి తిందువుగాని' అన్నదట! ఉలుకు, పలుకు లేకపోతే వకుళమ్మ దిగాలుపడింది.

తండ్రీ! నీకు వచ్చిన ఆపదేమిటి? కన్నీళ్ళెట్టుకొం టున్నావేమిటి? నీ బాధలేమిటి? పగటిపూట నిదరోవడం తప్పని తెలిసికూడా నిదరపోతున్నావెందుకు? నీ ధైర్యం సడలిందా? నీ స్థైర్యం కదలిందా? నీ ఉత్సాహం నీరుగారి పోయిందా? ఎందుకీ దైన్యం? నాతో చెప్పవా? అని బతి మాలింది.

దిగాలుపడినహృదయం కనుక అడవిలో 'అయ్యకు' అవాంతరాలేమో అనుకొంది. ఢిల్లీకి రాజయినా తల్లికి కొడుకు కనుక.

'అడవికి వేఁటబోయి మఱి యచ్చటి క్రూరమృగ వ్రజంబునుం బొడగని భీతి నొందితివా? భూతము సోఁకెనొ లేక ఱాలపై వడి చెడి జాఱి నేలబడి వాగులఁ జేరితొ యేమి చెప్పుమా కొడుక! నిజంబు నాకు వొగి గొబ్బున నిప్డు చికిత్సఁ జేసెదన్' అన్నది. పడి లేచి వుంటే తైలమర్దనం చేస్తాను. జారిపడి వుంటే వేడిజలం పోస్తాను. జడుసుకొని వుంటే మంత్రం వేస్తాను అంటూ ఆపాదశీర్షం నిమిరింది. ఆ నిమరడంలో రాళ్ళ దెబ్బల ఉబ్బులు చూచి భయపడింది. కట్టిన వస్త్రం తొలగించింది. లేవనెత్తి కూర్చోబెట్టింది. వేరే వస్త్రం కప్పింది. చందనం పూసింది. చల్లనినీటితో కనులు తుడిచింది. మెల్లగా శరీరమంతా నివిరింది. వేంకటేశుడు తల్లిస్పర్శతో కుదుటపడ్డాడు. ఇదొక మానసికస్థితి. ఇబ్బం దులున్నవేళ ఓదార్పు అందులోను ఆత్మీయుల ఉపచారాలు! స్వామి తేరుకొన్నాడు.

రాళ్ళదెబ్బల ఉబ్బులు తెలిసి వకుళమ్మ ఇవన్నీ 'వయసు మిటారి కత్తెల పని' అని స్త్రీగా క్షణంలో గుర్తించి, నీవు కాననంలో కిన్నరాంగను చూచావా? గీర్వాణకాంత కళ్లబడిందా? గంధర్వకాంతల పనా? అని వాకబుచేస్తూ 'కూపీ' లాగడం మొదలెట్టింది. చివరకు బ్రహ్మాస్త్రంలాగా మాటాడకపోతే వరాహస్వామికి అంతా చెబుతాననే సరికి స్వామి నోరు కదిపాడు. ఆపై అసలు జరిగింది దాచావంటే నన్ను మరోలా చూచావంటే నేను బతకడం వ్యర్థం. నాకీ దేహం వద్దని కన్నీరెట్టుకుంది.

తల్లి కన్నీరెట్టుకొంటే ఏ బిడ్డయినా చూడలేడు. ఇది ముల్లోకాల సత్యం. అంచేత 'చల్లకు వచ్చి ముంత' దాచనేల అని స్వామి సర్వమూ చెప్పాడు. ఎలాగయినా పద్మావతితో పెండిలి సేయుమని వేడుకొన్నాడు. ఈ సన్నివేశాన్ని ఒక సామాన్యగృహవాతావరణంగా వెంగమ్మ చిత్రించి 'వకుళ మాలికను' మాతృమూర్తిగా నిలబెట్టింది. ఆలస్యం తగదను కొంది. స్వామితొందర తెలిసి, దేవమాయా నిర్మితమయిన తురగం ప్రత్యక్షమయింది. స్వామి తురగానికి ఆజ్ఞ ఇచ్చాడు. తల్లిని గుర్రంపై కూర్చోబెట్టి నారాయణవనం కేసి కది లేలా చేశాడు. ఒక ప్రయాణసమయంలో కొడుకు చేసే సన్నాహం తల్లికి ప్రీతి, హాయి గనుక వకుళమ్మ సంత సించింది.

భూవరాహస్వామికి చెప్పక వచ్చానని వకుళమ్మ కాసంత బాధపడిందేమో. వెళ్లబోయేది పవిత్రకార్యం. కొడుకుసంసారం నిలబెట్టే కార్యక్రమం. మానవబలమెంతైనా దైవబలం అవసరమని కపిలేశ్వరునికి నమస్కరించింది.

మగవారలకంటె ఆడవారు ఉపాయచతురులని ప్రసిద్ధి. స్వామి వకుళమ్మను నారాయణవనం పంపాడు గాని అంతఃపురప్రవేశాదులకు ఉపాయం చెప్పలేదు. కాని వకు ళమ్మ ధీర, చతుర. అందుకే ఆకాశరాజు ఆత్మజ చెలికత్తెను మచ్చిక చేసుకొంది. రుద్రాభిషేకం నిమిత్తం వారు వచ్చారని తెలుసుకొంది. వకుళమ్మతో చెలి 'అమ్మా! జంకెందుకు? రుద్రాభిషేకం పూర్తయ్యేదాక ఆగమ్మా! ఆపై నేనే నిన్ను అంతః పురానికి తీసుకెళతానంది! ఈ సందర్భంలో వకుళమ్మ ఉపాయానికి జేజేలు పలకవలసిందే. చెలికత్తెతో వచ్చిన వకుళమ్మకు అంతఃపురంలో అనుకోని స్వాగతం లభించింది. సమయోచితసంభాషణలతో ధరణీదేవిని ఆకట్టుకొంది. చివరకు ఆకాశరాజు ఇచ్చిన బంగారురేకు మీద వ్రాసిన లేఖతో తిరుమల చేరుకొంది.

పాతకాలం గృహస్థులకు పుణ్యకార్యం ఎలాంటి విఘ్నాలు లేకుండా జరగాలనే ఆకాంక్ష సహజం. వకుళమ్మకు కూడ శ్రీపద్మావతీశ్రీనివాసులవివాహం శుభంగా జరగాలని ఆకాంక్ష. అయినా అదే సందర్భంలో ఆవిడకు పెళ్లిఖర్చులు గుర్తుకు వచ్చాయి. చివరకు బాధితులు ఆత్మీయులతో తర్కించేలా వకుళమ్మ వరాహస్వామి దగ్గరికి వెళ్ళి, తనచింత ప్రకటించుకొంది. ఈ సందర్భంలోని వెంగమ్మ పద్యం మనోహరం.

'అర్థమిచట లేదు; వివాహ మేలీల నౌ;
నందులకే యుపాయము సేయ
నెసగు ధనము; పడుచ నిచ్చెడివారు
భాగ్యవంతులు వారితో సరిగాఁ
దులదూగవలయు'

అంటూ చెప్పడంలో లేనివారిమనస్తత్వం అందంగా ప్రకటితం.

స్వామి తనవివాహానికి రమ్మని భూదేవీసహిత వరాహస్వామిని అభ్యర్థించాడు. అప్పుడా వరాహస్వామి 'క్షేత్ర మంతయు ఫలించినది గనుక రాఁ దీరదిపుడు నిర్ణయముగ నా మాఱు వకుళయ పెండ్లికి వచ్చు (5-149) అని ఆ స్వామి వకుళమ్మనే పెద్దగా కొనియాడినాడు.

ఒక కన్యకు వివాహమయ్యాక ఆమెను భర్తతో పంపడం సంప్రదాయం. కాని ఆకాశరాజు పుత్రికా వ్యామోహం వదలుకోలేక 'నా తల్లి పసిబిడ్డ. ప్రౌఢగాదు. నేనిప్పుడంపలే' నన్నాడు. హరి లక్ష్మిని చూచి, కనుసైగ చేశాడట. అపుడా కొల్హాపురిలక్ష్మి 'పద్మను చక్రితో పంప వచ్చు. 'వకుళమాలిక తల్లివలె ప్రోచు నచ్చట నన్యు లెవ్వారు లేరని (5.226) భరోసా ఇచ్చింది. లక్ష్మికి వకుళమ్మపైగల గౌరవానికి ఈ మాట ఒక్కటి చాలు.

వేంకటాచలమాహాత్మ్యం షష్ఠాశ్వాసంలో వకుళమ్మ పాత్ర భిన్నమయింది. స్వామి తనసతి లక్ష్మీదేవిని ప్రసన్నురాలినిగా చేసుకోదలచుకొన్నాడు. పద్మావతి అడ్డు చెప్పలేదు. చివరకు స్వామి కరవీరపురానికి ప్రయాణం కట్టాడు. పద్మావతీరక్షణ ఎలాగా? అని ఒక సందేహం. తన్ను కాపాడినట్టే పద్మావతి బాగోగులు వకుళమ్మ చూడగలదని భరోసా. అందుకే స్వామి వకుళతో, వరాహస్వామితో చెప్పి, కొల్హాపురం కదిలాడు. వివాహమయ్యాక భార్య మోహానికే మొగ్గుచూపువారుండగా తల్లిని మరవలేదనడం స్వామికి తల్లిపై గల గౌరవానికి సాక్ష్యం.

స్వామి కొల్హాపురలక్ష్మిని వెంటబెట్టుకవస్తానని పద్మావతితో చెప్పి వెళ్ళాడు. ఇరువది రెండేండ్లు గడిచాయి. పద్మావతికి దిగులు పుట్టింది. స్వామి కేమయిందో ననే చింత. ఆ సందర్భంలో పద్మావతి వకుళమ్మతో తన బాధను –

వకుళా! వెన్నుడు నన్ను శేషగిరిపై వర్తింప నేమించినా
డకలంకంబుగ మాటలాడి చని రాఁడయ్యోమహాచింతచే
నొక నాఁడొక్క యుగంబుగాఁ గడపలేనోయమ్మ నా ప్రాణ నా
యకుఁడా లక్ష్మినిగూడి యెందరగినాడంచు న్విచారించుదున్

–అని తనచింతను ప్రకటించుకొంది. అపుడు వకుళమ్మ పద్మావతిని ఆశ్వాసించింది.

అమ్మా! సంతోషస్వాం
తమ్మును దనరారుచుండు తద్దయ నే ఖే
దమ్మును బూనకు లక్ష్మిని
నెమ్మదిఁ దోడ్కనుచు నిటకు నెఱి హరి వచ్చున్.

అలనాడు తిరుమలలో హరిని ఆశ్వాసించినట్టు పద్మావతిని ఓదార్చడంలోని వకుళమ్మపెద్దరికాన్ని, వాత్సల్యాన్ని వెంగమ్మ సహజంగా వర్ణించింది.

**ఎడమచేతితో కరోనాను ఓడించవచ్చు**

**బయటికి వెళ్లినప్పుడు ఏ పనైన గాని ఎడమ చేతితో మాత్రమే చేయండి. నోట్లు తీసుకోవడం, లిఫ్ట్ డోరు తెరవడం ఇలా ఏ పనైన ఎడమ చేతితో చేస్తే పొరపాటునైన మనం కుడిచేతితో కళ్లు, ముక్కు, ముఖం, తాకడం లాంటివి చేస్తే వైరస్ సోకే ప్రమాదం చాలా తక్కువ.**




# స్వామి కరుణ ముందు... కరోనా ఎంత?


- శ్రీ ఐ.ఎల్.ఎన్.హర్షవర్ధన్‌రావు

కలియుగ వరదుడైన శ్రీనివాసుడు భక్తులు నమ్మి... "నీవే నాకు దిక్కు స్వామి.." అని ప్రార్థిస్తే... అన్నీ తానే దగ్గరుండి చూచు కుంటాడు. భక్తులను తప్పకుండా కరుణిస్తాడు. శ్రీనివాసుడి లీలలు ఒకటా? రెండా?...!!

నేను 2013వ సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో బి.టెక్. చివరి సంవత్సరం పరీక్షలు రాశాను. ఆగష్టునాటికి ఫలితాలు వచ్చాయి. పై చదువులకు విదేశాలకు వెళ్లాలని ఆలోచించి, అందుకు హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నాను. అయితే, అనివార్యకారణాలవల్ల వెళ్లలేక పోయాను. దీనితో, మా నాన్న- "చదువు పూర్తయ్యాక ఖాళీగా ఉండ కూడదు. రాను రాను పోటీ అధికమౌతుంది.. ఏదైనా బ్యాంక్ లేదా సర్వీస్ కమీషన్ కోచింంచికు వెళ్లు" అన్నారు.

మా నాన్నగారు డిగ్రీకళాశాల అధ్యాపకులు. ఆయన ఎంతో అనుభవం ఉన్నవారు కనుక ఈ విషయాన్ని విడమర్చి చెప్పారు. అయితే, నాకు సాఫ్ట్‌వేర్ రంగం అంటే ఇష్టం. అదే తల్లిదండ్రులకు తెలిపి 2013 డిసెంబరులో ఒక నెలరోజుల లోపు నేను ఉద్యోగం సంపాదించుకుం టాను అని చెప్పి బెంగుళూరు బయలుదేరాను.

"స్వామీ! నా కోరిక తీర్చు" అని తిరుమల వేంకటేశ్వరస్వామిని మొక్కుకున్నాను. శ్రీనివాసుడిభక్తులైన నా తల్లిదండ్రులుకూడా అదే వేడుకున్నారు. బెంగుళూరుకు వెళ్లి, రెండు మూడుఇంటర్వ్యూలకు హాజరయ్యాను. డిసెంబరు చివరకు నాకు ఉద్యోగం లభించింది. 2014వ సంవత్సరం జనవరి 2వ తేదీన నేను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరాను.



ఆ స్వామికి కృతజ్ఞతలు తెలుపుకుని మొదటిజీతం అందు కుంటూనే ఫిబ్రవరి 2014లో తిరు మలకు వెళ్లి, స్వామివారిని దర్శించి మొక్కు తీర్చుకున్నాను. ఈ విషయం జరిగి ఆరుసంవత్సరాలు అయ్యింది.

మళ్లీ నేను కంపెనీ మారదలచి ఈ సంవత్సరం ఫిబ్రవరిలో నూతనకంపెనీకి ఎంపికయ్యాను. మార్చిచివరకు పాత దానిలో మాని వేసేందుకు అనుమతి పొంది, మే నెలలో నూతన ఉద్యోగంలో చేరాలనుకున్నాను.

అయితే, ఈ లోగా కరోనా వచ్చి, ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. మార్చిలో పాతకంపెనీ నుంచి మాని వేశాను. కరోనావిపత్తువల్ల ఎందరికో ఉద్యోగాలు ఊడిపోతూ ఉన్నాయి. నా పరిస్థితి ఏమిటి.. కంపెనీ వారు చేర్చుకుంటారా? లేదా? అని ఒకటే ఆలోచనలు.. నా తల్లిదండ్రులు స్వామివారికి మొక్కుకున్నారు. నేనూ అదే పని చేశాను.

అంతే, "మీరు జూన్ 1న ఉద్యోగంలో చేరండి. మే నెలలో మీకు కావలసిన ల్యాప్‌టాప్ రాలేదు, అందువల్ల మీకు సమా చారం అందివ్వడం ఆలస్య మైంది" అన్నారు. భయం పోయింది. చివరకు జూన్ 1న నూతన ఉద్యోగంలో చేరాను.

అంతా, ఆ స్వామి వారికృపే! నమ్మినవారి వెంట ఉండి, నడిపించే స్వామి శ్రీనివాసుడు.

# సంపద నాకు లభించుగాక!

– బ్రహ్మశ్రీ డా॥ మైలవరపు శ్రీనివాసరావు


బాలప్రబోధం

ఒకసారి ఆదిశంకరులవారు భిక్షాపాత్ర చేతబట్టుకుని వీథులవెంట తిరుగుతూ, తిరుగుతూ ఒక ఇంటిముందాగి 'భిక్షాం దేహి!' అని అడిగారు.

ఇంటి వాకిలికి వచ్చింది... సాక్షాత్తూ శంకరాచార్యులవారు. తెచ్చింది– సాక్షాత్తు భగవంతుడైన శంకరునిచేతిలోని పాత్రతో సమానమైనశక్తిగల భిక్షాపాత్ర. ఆ ఇంటిఇల్లాలు ఇల్లంతా కలయజూచింది. నట్టింట ఏమున్నాయో ఆమెకు తెలియదు గనుకనా? స్వామివారు వచ్చారు కాబట్టీ– అంతటివారు తమఇంటిముందు ఆగినకారణంగా ఏమైనా లభించకపోతుందా? అనేది తన ఊహ కాబట్టీ– ఇల్లంతా వెదికి వెదికి సిగ్గుతో చితికిపోయి, తమఇంట భిక్షం పెట్టడానిక్కూడ ఏమీ లేదనే మాటను, దివ్యపురుషునిలా వెలిగిపోతున్న పరమాత్మస్వరూపుడైన శంకరాచార్యులవారితో చెప్పలేక, గబగబా దొడ్డి వైపుకు వెళ్లింది. అదే సమయానికి తన అదృష్టం కొద్దీ ఉసిరికచెట్టు నుండి ఒక ఉసిరికాయ నేలపై పడింది. ఆమె ఆనందానికి హద్దు లేకపోయింది! 'కనీసం ఏదో సమర్పించుకోగలిగాను గదా!' అని వెంటనే పరుగు పరుగున వచ్చి, ఆయనజోలిలో వేస్తూ 'మహేశ్వరార్పణమస్తు' అంది.

చాలసేపటినుండి ఆమెనూ, ఆమె దారిద్ర్యకారణంగా కళ్లలో కన్పిస్తున్న దీనభావాన్నీ గమనిస్తూన్న శంకరాచార్యులవారు మిక్కిలి జాలిపడి వెంటనే లక్ష్మీదేవిని ప్రార్థిస్తూ అక్కడికక్కడ ఆశువుగా 'కనకధారాస్తోత్రమ్' అనే పేరిట లక్ష్మీదేవిని స్తుతించేశ్లోకాలను చెప్పేశారు. ఇప్పటికీ ధనం కావాలనిపిస్తే ఈ స్తోత్రాన్ని చదవడం సంప్రదాయంలో ఉంది.

అంతే! ఆమె ఇంటినిండా బంగారు ఉసిరికాయలవర్షం ప్రారంభమైంది. ఆమెకు ఎంత ఈయాలని స్వామికి అన్పించిందో అంతవర్షం కురిసేంతవరకూ ఆయన అక్కడే నిలబడి ఆ మీదట అడుగు కదిల్చారు.



వర్షం ఆగిపోయింది. తనకారణంగా ఇంత ధన వర్షం ఆమె ఇంట కురిసింది గదా! అనే అతిశయం ఆయనలో లేదు. అంత ధనం ఆమెకి లభించింది కాబట్టి (దానిలో) 'తనకి ఎంత?' అనే ఊహకూడా కలలో వారికి లేనేలేదు. ఆ స్త్రీ పరమకృతజ్ఞతతో సాష్టాంగపడి ఆనందబాష్పాలను విడిచింది.

పరమైశ్వర్యాన్ని సంపాదించ గలిగిన శక్తి ఉండి కూడా, ఆర్థికమైనకష్టాలలో ఎవరుంటే వారికి ఆ కష్టాన్ని తీర్చాలని భావిస్తూ, ఎవరు 'తమను గూర్చి తాము ఆర్థికంగా అసలు ఆలోచించనే ఆలోచించరో' వారు నిజమైన సంన్యాసులని ఈ ఇతివృత్తం చెప్తుంది. అంత ధనాన్ని ఇతరులకి ఇప్పించగలిగి ఉండికూడా, జోలె పట్టినవారు కాబట్టే ఆదిశంకరులు నిజమైన సంన్యాసులన్న మాట.

# దరిదాపులకు రానీయవద్దు!

- ప్రాచార్య శలాక రఘునాథశర్మ

పాండురాజు ఒకమునిశాపం కారణంగా పుత్రుల్ని పొందటానికి వీలులేనివా డయ్యాడు. పుత్రులు లేకపోతే ఉత్తమ లోకాలు కలుగవు. అందువలన ధర్మపద్ధతిద్వారా తనయుల్ని పొంద మని, తన ధర్మపత్ని కుంతిని ప్రార్థించాడు. ఆమె చిన్న ప్పుడు దుర్వాసమహర్షి ఇచ్చినఒకమంత్రంద్వారా ధర్మదేవత అనుగ్రహంతో ధర్మరాజునూ, వాయుదేవునిదయవల్ల భీమ సేనుణ్ణీ, ఇంద్రునిప్రసాదంతో అర్జునుణ్ణీ కొడుకులుగా పొందింది. అలాగే తనమంత్రబలంతో తనసవతి మాద్రికి అశ్వినీదేవతల వరంగా నకులసహదేవు లనే పుత్రుల్నికూడా అనుగ్రహించింది.

ధృతరాష్ట్రునికి గాంధారి పట్టపురాణి. ఎక్కడో దిక్కు మాలినచోట తపస్సు చేసుకుంటూ ఉన్న తనతోటికోడలు కుంతికి కొడుకు పుట్టా డని విన్న ఆమెకు ఈర్ష్య కలిగింది. తాను గర్భంతాల్చి, బహుకాలమైనా-ఇంకా గండం గడిచి పిండం బయట పడలేదు. ఆ బాధా, ఈ ఈర్ష్యా రెండూ ఏకమై ఆమె కడుపు బాదుకొన్నది. ఒక పెద్దపిండం క్రిందపడింది. సర్వజ్ఞుడైన వ్యాసు డిది తెలుసుకొని వచ్చి, కోడలి అవివేకానికి బాధపడి ఆమెను మందలించి, ఆ పిండాన్ని నూటొక్కభాగాలుగా చేసి, వేర్వేరుగా మట్టిపాత్రలలో ఉంచి పరిరక్షించ మని ఆదేశించి వెళ్లిపోయాడు. ఆ పాత్రలనుండి రోజుకొకడు చొప్పున కొడుకులు నూరుగురూ, ఒక కూతురూ పుట్టారు. వారిలో పెద్దవాడు దుర్యో ధనుడు. అమ్మాయి పేరు దుస్సల. రెండవకొడుకు దుశ్శాసనుడు. నిజానికి వీ ళ్లందరూ కురువంశంవాళ్లే కనుక కౌరవులే! అయినా పాండురాజుకొడుకుల్ని ప్రత్యేకించి పాండవులు అంటారు. ధృత రాష్ట్రునికొడుకులు వందమందీ కౌరవులు.

రాజ్యంకోసం వీళ్లల్లో వీళ్లకి పగ ఏర్పడింది. నిజానికి రాజ్యంమీద అధికారం కలవాడు ధర్మరాజే. అయినా అతని మంచితనంవల్లా, పితృభక్తివల్లా దుర్యోధనుడు పెత్తనాన్ని చేజి క్కించుకున్నాడు. భీష్ముడు, ద్రోణుడు మొదలైన పెద్దలు వంశం సురక్షితంగా ఉండా లని దుర్యోధనునితులువపనులను సహిస్తూ వచ్చారు. పగలు పెరగకుండా ఉండటానికై పాండవులకు వేరే రాజ్యాన్ని కల్పించారు- పెద్దలు. కానీ అదికూడా దుర్యోధనునికి అసహ్యమైంది. తనమేనమామ శకునీ, తనమిత్రుడు కర్ణుడూ, తనతమ్ముడు దుశ్శాసనుడూ తోడు కాగా వంచన చేసి, కపటపు జూదం ఆడి ధర్మరాజునూ, ధర్మపత్ని ద్రౌపదినీ, తక్కిన పాండవు లనూ అడవులపాలు చేశాడు. అంతతో ఊరుకోలేదు. అజ్ఞాత వాసం కల్పించాడు. అంటే పాండవులు జనపదాలలో ఉండి, వీళ్లు పాండవులు అని ఎవరికీ తెలియకుండా ఒకసంవత్సరం గడపాలి. బయటపడితే మళ్లీ అరణ్యవాసం, మళ్లీ అజ్ఞాతవాసం.

పాండవులు దైవబలమూ, ధర్మబలమూ నిండుగా గల వాళ్లు. అందుచేత దుర్యోధనునిమాయ లన్నింటినీ ధైర్యంతో ఎదుర్కొని, ప్రమాదాలనుండి బయటపడ్డారు. అరణ్యవాసమూ, అజ్ఞాతవాసమూ ఏ లోపమూ లేకుండా గడచిపోయాయి. తిరిగి వచ్చి,మారాజ్యం మా కి మ్మని అడిగారు. నాలుగురాయబారాలు గడిచాయి. చివరకు శ్రీకృష్ణభగవానుడు బోధించినా దుర్యోధనుని హృదయం మెత్తపడలేదు. వాడిసూదిమొన యించుక తాకినంత భూమికూడా పాండవులకు ఇవ్వ నని తెగవేసి చెప్పాడు. వేరే దారిలేక పాండవులు కౌరవులతో యుద్ధం చేశారు. అది పదునెనిమిదిఅక్షౌహిణులతో పదునెనిమిదిరోజులు సాగిన ఘోర యుద్ధం. అందులో ఇంచుమించుగా దుర్యోధనునితో పాటు అందరూ మరణించారు. పాండవులు గెల్చారు. ధర్మరాజు పట్టాభి షిక్తు డయ్యాడు.

దుర్యోధనుడు మనకు అందించినగుణపాఠం- లోభం వల్ల కలిగేఅనర్థం ఏమిటో తెలియజేయటం. 'చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష' అనే విధంగా అతితీవ్రంగా దురాశతో వ్యవహరిం చటం, పరద్రవ్యాసక్తి కల్గి ఉండటం లోభగుణం. అది మనిషిని కుక్కకన్నా హీనుణ్ణిగా చేస్తుంది. "కొంచెమైనను దగ పంచి కుడువ మేలు" అంటారు- పెద్దలు. 'కలిసి ఉంటే కలదు సుఖం' అనేమాట తరచుగా వింటూ ఉంటాము. ఆ కలుపు గోలుతనం లేనివాడు తనవా ళ్లందరితోపాటు నశించిపోతాడు. కనుక లోభాన్ని దరిదాపులకుకూడా రానీయరాదు. ఆ పద్ధతి మనిషిని మహోదాత్తస్థితికి చేరుస్తుంది.



హరిదాస వాఙ్మయంలో...

# శ్రీవేంకటాచలాధీశుడు

4

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

## దాస్యభక్తి-కీర్తన భక్తి

యుగభేదాల ననుసరించి కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో యజ్ఞయాగాదులు, ద్వాపరయుగంలో వ్రతాలు, అర్చనలు భగవదనుగ్రహంకోసం చేస్తే - కలి యుగంలోమాత్రం పై సత్కర్మానుష్ఠానఫలంతో సహ భగవదనుగ్రహం సంకీర్తనంవల్ల కలుగుతుందని శ్రీమద్భాగవతం చెబుతుంది.

భాగవతంలో చెప్పిన విషయాన్ని  శ్రీపాదరాయలవారు ఇలా చెప్పారు.

ధ్యానవు కృతయుగది । యజిన యజ్ఞవు త్రేతాయుగది
దానవాంతకన దేవతార్చనెయు ద్వాపరయుగది- ఆ
మానవరిగెష్టు ఫలవో అష్టుఫలవు - ఈ కలియుగది
గానది కేశవ యెనలు కైకొడువరంగవిఠల ॥

అందుకేనేమో యుగధర్మానుసారం హిరణ్యకశిపుడు తపస్సు, దశరథుడు యజ్ఞం, గోపికలు వ్రతాలు చేశారు. మరి ఈ కలియుగంలో భక్తితో కీర్తిస్తే చాలు, భగవంతుని కీర్తించడంవల్ల వచ్చేఫలితాన్ని శ్రీమద్భాగవతం చక్కగా తెలిపింది.

పాపనివృత్తికి, నరకవిమోచనానికి పరమాత్ముని గుణగానం చక్కటిసాధనం. దీనికి అజామిళుడే సాక్షి. వేదార్థాలు తెలియక, భాగవతధర్మాన్ని నిర్దుష్టంగా తెలియక స్వర్గాదిఫలాలకోసం యజ్ఞాదులతో కాలహరణం చేయడం కన్నా భక్తితో భగవంతుని నామసంకీర్తన చేస్తే చాలు.

నామసంకీర్తనంవల్ల అనేకపాపరాశులు దహించిపోతాయి. అంతేకాక, ''భక్తితో ఎలుగెత్తి గట్టిగా భగవన్నామాన్ని గానం చేసేవాడు యముని శిక్షలకు భయపడవలసిన అవసరం లేదు. అంతేకాక శ్రీహరి మహిమలను పాడేవాడు, వినేవాడు తద్ద్వారా ఆనందించే వాడు, దానివల్ల మనఃపరివర్తనమొంది శ్రీహరిని సేవించే వాడు, భవసాగరాన్ని సునాయసంగా దాటగలడు.

భగవంతుని నామసంకీర్తనం చేయడంవల్ల, వినడంవల్ల అంతరంగంలోని అజ్ఞానం, పాపం తొలగిపోతాయి. అది ఎలాగంటే... సూర్యోదయమైన వెంటనే లోకంలో చీకట్లు, గాలివీచిన వెంటనే కారుమబ్బులు తొలగిపోయినట్లుపోతాయి. శ్రీహరినామసంకీర్తనంవల్ల అగ్ని స్పర్శచే లోహాలు కరగిపోయినట్లు పాపాలన్నీ తొలగిపోతాయని మధ్వాచార్యులు చెప్పారు.

అందుకే ద్రవిడభాషలో పద్య గద్య చంపూ కావ్యాలున్నప్పటికీ "సద్యః ఫలతి సంగీతం" అన్నట్లు గీతా వాద్య నృత్య ప్రధానమైన సంగీతశైలిలో పద్య సుళాది కీర్తనలలో హరిదాసులు దేవుణ్ణి కీర్తించడంతో పాటు ఎన్నో తాత్త్విక విషయాలను మనస్సుకు హత్తుకునేటట్లు రంజక రాగ, తాళాలతో, నాట్యానికి అనుకూలమయ్యేటట్లు భక్తి, అనురాగ, వైరాగ్య, ఆధ్యాత్మికభావంతోను, ప్రభు, మిత్రకాంతాసమ్మితంతోను, నారికేళ, కదళి, ద్రాక్షాపాకాలతోను వలసిన చోట సందర్భోచితంగా మేళవించి, వ్యాసులవారివాణిని సులభ ద్రవిడశబ్దాలతో మధ్వాచార్యుల సత్సిద్ధాంతసంప్రదాయాలను వినేవారికి, పాడేవారికి వారియోగ్యతానుసారం అవగతమయ్యేటట్లు రచించి పాడినారు.

"కీర్తిసి జనరెల్ల హరియ గుణ । కీర్తిసి జనరుకృతార్థ రాగిరో"

"జనులంతా శ్రీహరిగుణాలను కీర్తించి కృతార్థులు కండీ!" అని శ్రీపాదరాయలవారు చెబుతూ శ్రీహరి



మక్కువతో వింటే మాటలాడవచ్చు

నామాన్ని కీర్తించిన వాల్మీకి, శబరి, అహల్య పునీతులైయినారని అంటారు.

ఈ కలియుగంలో నామకీర్తనంవల్ల అందరూ తరిస్తారని పురందరదాసులవారు చెబుతూ– నామసంకీర్తనంవల్ల కేసరిపిల్లను చూచినఏనుగు సమూహాలు పరుగెత్తునట్లు, అగ్ని స్పర్శనవల్ల అడవి కాలిపోయేటట్లు, సూర్యోదయానికి చీకట్లు మాయమయ్యేటట్లు, వజ్రాయుధానికి కొండలు తెగిపడేటట్లు, గరుత్మంతునికి పాములు భయపడేటట్లు– పాపాలన్నీ పటా పంచలైపోతాయన్నారు.

భక్తితో గానంచేస్తే శ్రీహరిమూర్తిని చూచినవాడవుతాడు. ఇది యోగమార్గాల్లో ఒకటి. అందుకే విజయదాసులవారు **"గానలోలన కుళ్ళిరిసి ధ్యానదింద భజిసువె"** శ్రీహరి గానలోలుడు కనుక అతణ్ణి గానంతోనే భజిస్తానంటారు. సులభోపాయమైన శిశుపశుఫణిప్రాణులు సహితం తలలూపే పాటల పద్ధతిలో ఆడుతూ, పాడుతూ శ్రీహరిని కొలిచితే బంధవిముక్తి కల్గుతుంది.

## వైకుంఠపాళి

### :: 55- సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 పుం | | 2 క్రో | థ | 3 వ | శ | 4 ర | | |
| డ | | ధి | | న | | మ | | 5 వా |
| 6 రీ | తి | | 7 అ | చ | ల | | 8 శాం | త |
| కం | | 9 శం | | రం | | 10 రే | | ము |
| | 11 ఆ | ఖు | వు | | 12 వే | ణు | వు | |
| 13 నం | | డు | | 14 అం | | క | | 15 పిం |
| 16 దు | ర్గ | | 17 పూ | త | న | | 18 ప | గ |
| డు | | 19 వే | | ర్యా | | 20 రి | | ళు |
| | | 21 ప | ద్మ | మి | త్ర | పు | త్రు | డు |

హరికథామృతసారమనే గ్రంథంలో కూడ శ్రీజగన్నాథదాసులవారు డాంబికానికి గాని, కడుపుకోసం గాని, రోగోపద్రవాలందు గాని, అణిగి ఉన్నప్పుడు గాని, నోరునొవ్వంగ శ్రీహరికీర్తనాన్ని చేస్తే– స్వామి తనచేతిని అందించి, ఈ భవసాగరాన్ని విఠలుడు దాటిస్తాడని అంటారు.

**బిట్టగళ నెవదిందలాగలి । హొట్టగోసుగవాద డాగలి**
**కెట్టరోగ ప్రయుక్తవాగలి । అణకదిందొమ్మె**
**నిట్టుసిరినింబాయ్దెరెదు హరి విఠలా సలహేందెనలుకై–**
**గొట్టుకావ కృపాళు సంతత తన్న భకుతరను ॥**

ఇదే విషయాన్ని పదకవితాపితామహుడైన అన్నమయ్య కూడా –

**ఇహపర సాధనమిదియొకటే,**
**సహజపు మురారి సంకీర్తనొకటే....** అనీ

**సంతోషకరమైన సంకీర్తనం**
**సంతాప మణగించు సంకీర్తనం**

**జంతువుల రక్షించు సంకీర్తనం**
**సంతతము దలచుడీ సంకీర్తనం**

**జలజాసనుని నోరిసంకీర్తనం**
**చలికొండసుత దలచు సంకీర్తనం**

**చలువ కడు నాలుకకు సంకీర్తనం**
**చలపట్టి తలచుడీ సంకీర్తనం**

**సరవిసంపదలిచ్చు సంకీర్తనం**
**సరిలేనిదిదియ పో సంకీర్తనం**

**సరుస వేంకటవిభునిసంకీర్తనం**
**సరుగనను దలచుడీ సంకీర్తనం**

అని అన్నమయ్య సంకీర్తనపద్ధతిని అనుసరిస్తూ– దాని ప్రాశస్త్యాన్ని తెలియజేశాడు. కర్ణాటకహరిదాసులుకూడా సంకీర్తనపద్ధతిని అనుసరించి, శ్రీకృష్ణలీలాతరంగాలను చక్కటి పదాల కూర్పుతో పాడారు. *(ఇంకా ఉంది)*

## ఎంత చూచినా...

ప॥ ఎంత చూచినా- తనివితీరదే
వేంకటరమణుని - సుందర రూపము

చ॥ గడ్డము క్రిందుగ- గంధలేపనము
ఉరమున మెరిసే- ఇరువురు సతులు
ధగధగమెరిసే- బంగరునగలు
ధరియించిన, ఆ- వేంకటరూపము

చ॥ కళకళలాడే- కన్నుల నడుమలో
తళతళమెరిసే- మూడునామములు
శంఖచక్రములు- తులసీమాలలు
ధరియించిన, ఆ- శ్రీహరిరూపము

చ॥ ఊయలసేవలు- ఉత్సవమ్ములు
కమనీయమ్మగు- కల్యాణమ్ములు
ఆలయసేవలు- అభిషేకమ్ములు
అందుకొనే, ఆ- గోవిందరూపము

చ॥ కలిలో పిలిచిన- పలికే దైవము
మదిలో మెరసిన- మంగళరూపము
ఆనందనిలయాన- ఆశ్రితజనులకు
అభయమొసగు, ఆ- ఆనందరూపము

*- శ్రీ గొల్లాపిన్ని సుబ్రహ్మణ్యశర్మ*

## గ్రంథసమీక్ష

శుద్ధవైదికవిధానంతో కూడిన సంప్రదాయం నేడు మరుగున పడిపోతున్నది. అలా జరగడంవల్ల భారతీయసంస్కృతి దెబ్బతింటోంది. అలా జరగకూడదని హిందూమతపీఠాలు భావిస్తున్నాయి. హిందూ మతాన్ని, ఆర్షసంస్కృతిని వికసింపజేయటానికి, పెంచ డానికి వివిధఆర్షగ్రంథాలను వ్రాస్తున్నారు. ఆ పరంపరలో వెలువడిందే 'శ్రీచక్రనవావరణార్చనా విధిః' అనే గ్రంథం.

### శ్రీచక్రనవావరణార్చన విధిః

సంకలనం - శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి,
సైజు-1/8 డెమ్మీ సైజు, పుటలు-180, వెల- రూ.180/-,
దొరుకుచోటు - విశాఖశ్రీశారదాపీఠం, చినముషిడివాడ,
పెందుర్తి, విశాఖపట్నం. ఫోన్-0891-2763332

నవావరణార్చనకు ఆధారభూతమైనది ఉపనిషత్తు. నవరంధ్రాత్మకమైన దేహానికి నవచక్రాత్మక శ్రీచక్రమునకు భేదములేదని పండితులంటున్నారు. ఇందులో మనశరీరంలోని పరదేవతను ఏ విధంగా ఆరాధించాలి? అనే నిర్గుణోపాసనను తెలిపి ఉన్నారు. అయితే, అందరికీ నిర్గుణోపాసన సాధ్యం కాదు కాబట్టి, సగుణోపాసనద్వారా చిత్తశుద్ధి కలిగి, నిర్గుణోపాసన ద్వారా పరదేవత అనుగ్రహం పొందవచ్చునని పెద్దలు చెబుతున్నారు. ఈ బాహ్యాఅర్చనయందు పాత్రసాధన అనేది ముఖ్యమైంది.

ఈ బాహ్యాఅర్చనలో శంఖపాత్ర, మధుపర్క పాత్ర, ప్రస్తరపాత్ర, స్నపనపాత్ర, అమృతపాత్ర, శ్రీపాత్ర, గురుపాత్ర, శక్తిపాత్ర, భోగపాత్ర, బలిపాత్ర, నైవేద్య పాత్ర, ఆత్మపాత్ర, దేవపాత్ర అనేవి ఉన్నాయి. ఈ అంశాలన్నీ ఈ గ్రంథంలో తెలుపబడ్డాయి.

*- డా॥ నాదెండ్ల శ్రీమన్నారాయణ.*



నేరము వట్టితే తన నీడే తనకు పగ!

జూలై, 2020

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** శరీరఆరోగ్యం, ఎడతెగనిసంతోషమూ, బంధుమిత్రులతో కలసి ఆనందంగా ఉండుట, పుత్రసౌఖ్యం, ధనలాభం. విధినిర్వహణలో ఇతరులపై ఆధిపత్యం సాధించడానికి ప్రయత్నించడం. మాసాంతంలో ఇంట్లో కలహాలు. ప్రయాణాలు కలసిరావు.



**వృషభం–** మాసారంభంలో మాటతొందరవల్ల శత్రుత్వం, తదుపరి ధైర్యం, ప్రణాళికలతో ముందుకు వెళతారు. కార్యసిద్ధి, ఆరోగ్యం, నిత్య సంతోషం, బంధుమిత్రుల సమాగమం, సంతానవృద్ధి, పుత్ర సౌఖ్యం, ధనలాభం.



**మిథునం–** అకారణంగా ఇతరులతో విరోధాలు, క్రోధం, నరాల నిస్సత్తువ, నోటిపూత, మెడ, తల నరాలనొప్పులు, శరీరారోగ్యం అంతంతమాత్రంగా ఉండడం. వృత్తి, ఉద్యోగాల్లో మార్పులు సంభవిస్తాయి.



**కర్కాటకం–** స్థానభ్రంశం, స్థానచలసూచనలు, స్వస్థానాన్ని వదలి, దూరప్రాంతాలకు వెళ్లాల్సి రావడం. చేసేపనిలో ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. మాసద్వితీయార్ధంలో ఉపశమనం కల్గుతుంది. ఆరోగ్యం కుదుటపడుతుంది.



**సింహం–** వృత్తివ్యాపారాల్లో కలసివచ్చినప్పటికీ దూరప్రాంతాల్లో సంచరించుటవల్ల త్రిప్పట, వేళ నతిక్రమించి భుజించడంవల్ల స్వల్పఅనారోగ్యం, మార్గావరోధాలు. ఇంట్లో కల్యాణాదిశుభకార్యాల నిర్వహణ.



**కన్య–**ఈ మాసమంతా అనుకూలం. తలచిన పనులు సత్వరమే నెరవేరుతాయి. ధనలాభం, సంపదలు పెరుగుట, వస్తువాహనసౌఖ్యం కల్గుతుంది. కార్యసిద్ధి. భూ, గృహ స్థిరాస్తులకు సంబంధించి మార్పులు చేయుటవల్ల లాభాలు సంప్రాప్తిస్తాయి.



**తుల–**శరీరమందు సోమరితనం, పాపకార్యోన్ము ఖులగుటవల్ల కీర్తి నశిస్తుంది. చేసినచెడుపనుల వల్ల ఇతరులపై ప్రభావం పడుతుంది. వృత్తి వ్యాపారాల్లో మిశ్రమఫలితాలు. గోచరిస్తాయి. నష్టముండదు.



**వృశ్చికం–**దూరప్రాంతాల్లో సంచరించుట, వేళ నతిక్రమించి భుజించుట, ఆవేశం, క్రోధం తగ్గించుకుంటే మంచిది. వృత్తివ్యాపారాల్లో లాభాలు కలసివస్తాయి. ధైర్యంతో ఏకార్యాన్నైనా సాధిస్తారు.



**ధనుస్సు–** సుబ్రహ్మణ్యేశ్వరునకు మన్యుసూక్త సహితంగా అభిషేకం చేయించడంవల్ల శత్రు జయం కలుగుతుంది. అన్నిరంగాలలో పురోగమిస్తారు. మిత్రుల అండదండలు కల్గుతాయి. అనుకున్న పనులు సజావుగా అవుతాయి.



**మకరం–**భూములను కొనుగోలుచేసే అవకాశం ఉంది. ఉద్యోగస్థులకు కీర్తి, ఆర్థిక పరిపుష్టి కల్గుతాయి. శుభకార్యాలవల్ల ధనవ్యయం. వ్యవహారప్రతిబంధకాలు కలిగే అవకాశం ఉంటుంది.



**కుంభం–**మాసాంతంలో ఆర్థికవిషయాల్లో కొంత ఊరట. మొండిబాకీలు వసూలు అవుతాయి. అయితే గతంలో చేసిన బాకీల ప్రభావం ఉంటుంది. మానసికవ్యథకు గురి అవుతారు. శ్రీలక్ష్మీఅష్టోత్తరమ్ నిత్యం పఠించండి.



**మీనం–** శ్రమకు తగ్గ ఆదాయంలేకపోవుట, కార్యాచరణలో విఫలమగుట, గృహవిషయాల్లో భార్యాభర్తలమధ్య మాటకలవకపోవడం, అశాంతి, మానసికఅస్థిమితం తొలగుటకు సుబ్రహ్మణ్య ఆరాధన మంచిది.

# ఆరోగ్య పరిరక్షణకు... ధనియాలు



- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ

విశిష్టమైనటువంటి, సంస్కరింపబడినటు వంటి, మనసుకు శరీరానికి హితకరమైనటువంటి, ఇష్టమైన రుచులతో కూడి మనోహరంగా ఉండి, శుచిశుభ్రంతో కూడినటువంటి తాజాగా ఉన్న ఆహారం సేవనకు యోగ్యమైంది. ఇటువంటి ఆహారపదార్థాల, వంటకాల తయారీలో రంగు, రుచి, సువాసనకొరకువాడే వివిధవంటింటి దినుసులలో ధనియాలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. మనం నిత్యం దైనందిక జీవితంలో ఎదుర్కొనే అనేకానేక అనారోగ్య సమస్యలను తుద ముట్టించే అపారఔషధ గుణాలు కూడా ఈ ధనియాలలో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.

ధనియాలను వేయించి ఔషధంగా వాడుకోవాలి.

**1)కడుపులో మంట, తలదిమ్ము-** ధనియాలచూర్ణం 50 గ్రాములు, జీలకర్రను వేయించి చేసిన చూర్ణం, పటికబెల్లం పొడి వీటిని ఒక్కొక్కటి 50 గ్రాముల చొప్పున కలిపి ఉంచుకొని ఉదయం, సాయంత్రం 2-3 గ్రాముల పొడిని 50 మి.లీ. నీటిలో కలిపి సేవిస్తుండాలి.

**2)మొటిమలకు-** ధనియాలచూర్ణంలో ఆయుర్వేద ఔషధ విక్రయశాలలో లభ్యమయ్యే వచచూర్ణం, సుగంధిపాల చూర్ణాలను సమానంగా కలిపి ఉంచుకొని, రోజు ఒక్కసారి తగినంత పొడిలో నీరు చేర్చి, కలిపి పేస్టులా చేసి ముఖంపై లేపనం చేసి, గంటసేపు ఆగి కడిగేస్తు ఉండాలి. ఇలా వాడటంవల్ల మొటిమలు తగ్గటమే కాకుండా ముఖంపై వచ్చే మచ్చలుకూడా తగ్గి, ముఖం కాంతిమంతంగా తయారౌతుంది.

**3)అధికఉష్ణానికి-** ధనియాలపొడి 50 గ్రాములు గసగసాలను వేయించి చేసిన పొడి 50 గ్రాములు, కిస్‌మిస్ 100 గ్రాములు, ఆయుర్వేద ఔషధ విక్రయశాలలో లభించే అతిమధురచూర్ణం 100 గ్రాములు కలిపి, మిక్సిలో వేసి బాగా కలిసిపోయేలా చేసి పిదప అరకిలో స్వచ్ఛమైన ఆవు నెయ్యి వేసి కలిపి ఉంచుకొని రోజు రెండుపూటలా పూటకు ఒక టీ స్పూను సేవించి పిదప 100 మి.లీ. పాలు సేవిస్తుంటే కళ్ళమంటలు, మూత్ర, మలద్వారంవద్దమంట, కాళ్ళుచేతులు మంట, శరీరంమంటలుగా ఉండటం, నోట్లో తరుచు పుళ్ళు రావడం మొదలగు ఇబ్బందులుకూడా తొలగిపోతాయి.

**4) పడకలో మూత్ర విసర్జన-**ధనియాలు, ఎండిన దానిమ్మ పూలు, తుమ్మబంక, వేయించిన నల్లనవ్వులు, పటిక బెల్లం చూర్ణాలను ఒక్కొక్కటి 25 గ్రాముల చొప్పున తీసుకొని అన్నింటిని కలిపి ఉంచుకొని ఉదయం, సాయంత్రం 2-3 గ్రాముల పొడిని 50 మి.లీ. నీటిలో కలిపి సేవించాలి. పిల్లలకు ఒకగ్రాము ప్రమాణం వాడాలి.

**5) పాదాల, మడమల పగుళ్ళకు-** రోజు ఒకసారి 200 మి.లీ. నీటిలో 5 గ్రాముల ధనియాలు, 5 గ్రాముల జీలకర్ర, 2-3 గ్రాముల తాటికలకండ, చింతగింజంత నలగ్గొట్టిన అల్లం ముక్క వేసి 100 మి.లీ. నీళ్ళు మిగిలేలా మరిగించి, దించి, చల్లార్చి, వడగట్టి సేవిస్తూ ఉండాలి. ఇందువల్ల రక్తశుద్ధి జరిగి, వివిధరకాల చర్మసమస్యలు కూడా తగ్గుతాయి.

**6) తల తిరగటం-**ఉదయం ఒక మట్టిపిడతలో 200 మి.లీ. నీళ్ళు ఒక టీ స్పూను చొప్పున ధనియాలు, ఉసిరిక పెచ్చులు వేసి రాత్రి వరకు నానించి వడగట్టి ఆ నీళ్ళను త్రాగాలి. అట్లే రాత్రికూడా ఇదేవిధంగా నీటిలో నానించి, ఉదయం పూట వడగట్టి సేవిస్తు ఉంటే సమస్య త్వరగా తగ్గుతుంది.

**7)జ్ఞాపకశక్తిపెరిగేందుకు-**ధనియాలు, సోంపు, యాలుకలు, సీమబాదం పప్పులు, పటికబెల్లంచూర్ణాలను ఒక్కొక్కటి 30 గ్రాముల చొప్పున కలిపి ఉంచుకొని, రోజు పడుకోనేటప్పుడు 100 మి.లీ. గోరువెచ్చని పాలలో 2-3 గ్రాముల పొడిని కలిపి సేవిస్తుంటే జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ధారణ, స్మరణశక్తి పెరుగుతాయి. మానసిక ప్రశాంతత కలుగుతుంది.

సీమ బాదం పప్పులను 1-2 గంటలు వేడి నీటిలో నానిచ్చి, పొట్టు తీసి పప్పును ఎండించి, చూర్ణించి వాడుకోవాలి.

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-03

నిర్వహణ - మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య & కిరణ్ భట్

## संयुक्ताक्षराणि (సంయుక్తాక్షరాలు)

| | |
|---|---|
| ठ् + ठ = ठ्ठ | ఠ్ + ఠ = ఠ్ఠ |
| ठ् + य = ठ्य | ఠ్ + య = ఠ్య |
| ठ् + र = ठ्र | ఠ్ + ర = ఠ్ర |
| ठ् + व = ठ्व | ఠ్ + వ = ఠ్వ |
| ड् + ग = ड्ग | డ్ + గ = డ్గ |
| ड् + ज = ड्ज | డ్ + జ = డ్జ |
| ड् + ड = ड्ड | డ్ + డ = డ్డ |
| ड् + ढ = ड्ढ | డ్ + ఢ = డ్ఢ |
| ड् + ब = ड्ब | డ్ + బ = డ్బ |
| ड् + भ = ड्भ | డ్ + భ = డ్భ |
| ड् + म = ड्म | డ్ + మ = డ్మ |
| ड् + य = ड्य | డ్ + య = డ్య |
| ड् + र = ड्र | డ్ + ర = డ్ర |
| ड् + व = ड्व | డ్ + డ = డ్వ |
| ढ् + ढ = ढ्ढ | ఢ్ + ఢ = ఢ్ఢ |
| ढ् + म = ढ्म | ఢ్ + మ = ఢ్మ |
| ढ् + य = ढ्य | ఢ్ + య = ఢ్య |
| ढ् + र = ढ्र | ఢ్ + ర = ఢ్ర |
| ढ् + व = ढ्व | ఢ్ + వ = ఢ్వ |
| ण् + ट = ण्ट | ణ్ + ట = ణ్ట |
| ण् + ठ = ण्ठ | ణ్ + ఠ = ణ్ఠ |
| ण् + ड = ण्ड | ణ్ + డ = ణ్డ |
| ण् + ढ = ण्ढ | ణ్ + ఢ = ణ్ఢ |
| ण् + ण = ण्ण | ణ్ + ణ = ణ్ణ |
| ण् + म = ण्म | ణ్ + మ = ణ్మ |
| ण् + य = ण्य | ణ్ + య = ణ్య |
| ण् + व = ण्व | ణ్ + వ = ణ్వ |
| त् + क = त्क | త్ + క = త్క |
| त् + ख = त्ख | త్ + ఖ = త్ఖ |
| त् + त = त्त | త్ + త = త్త |
| त् + थ = त्थ | త్ + థ = త్థ |
| त् + न = त्न | త్ + న = త్న |
| त् + प = त्प | త్ + ప = త్ప |
| त् + फ = त्फ | త్ + ఫ = త్ఫ |
| त् + म = त्म | త్ + మ = త్మ |
| त् + य = त्य | త్ + య = త్య |
| त् + र = त्र | త్ + ర = త్ర |
| त् + व = त्व | త్ + వ = త్వ |
| त् + स = त्स | త్ + స = త్స |
| थ् + न = थ्न | థ్ + న = థ్న |
| थ् + य = थ्य | థ్ + య = థ్య |
| थ् + र = थ्र | థ్ + ర = థ్ర |
| थ् + व = थ्व | థ్ + వ = థ్వ |
| द् + ग = द्ग | ద్ + గ = ద్గ |
| द् + घ = द्घ | ద్ + ఘ = ద్ఘ |
| द् + द = द्द | ద్ + ద = ద్ద |
| द् + ध = द्ध | ద్ + ధ = ద్ధ |
| द् + भ = द्भ | ద్ + భ = ద్భ |
| द् + म = द्म | ద్ + మ = ద్మ |
| द् + य = द्य | ద్ + య = ద్య |
| द् + र = द्र | ద్ + ర = ద్ర |
| द् + व = द्व | ద్ + వ = ద్వ |

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక మాసపత్రిక)



## చందా నమోదు పత్రం

1. పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పని సరి)

సెల్ నెం.

2. కావలసిన భాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం (సంవత్సరచందా మాత్రమే) ☐

3. సంవత్సర/జీవిత చందా :
రూ.60/- ☐ రూ.500/- ☐

4. చందా పునరుద్ధరణ :
(అ) చందా నెంబరు :
(ఆ) భాష :

5. చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. :
తేది :
(చెక్కులు స్వీకరించబడవు)

ప్రదేశం :
తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.60/-, జీవితచందా రూ.500/-లు; డి.డి. / ఎం.ఓ.ను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.


2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులో గానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి, పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప-మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# 55 వైకుంఠపాళి



నిర్వహణ శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)కశ్యపునిభార్య. దక్షప్రజాపతి కుమార్తెల్లోఒకతె(5); 6)విధం(2); 7)భూమి(3); 8)ఋష్యశృంగుని భార్య(2); 11)ఎలుక(3); 12)శ్రీకృష్ణుని చేతిలోనున్నది(3); 16)పార్వతి(2); 17)బాలకృష్ణునికి విషంపాలును ఇచ్చిన స్త్రీ(3); 18)ద్వేషం(2); 21)పద్మాలకు స్నేహితుడైనవాని కుమారుడు(7)

### నిలువు

1)ఆగ్నేయదిక్కునందలి మగఏనుగు(4); 2)కోపిష్ఠి(2); 3)కోతి(4); 4)లక్ష్మి(2); 5)వాయువు(3); 9)విరాటరాజుకొడుకు (3); 10)జమదగ్నిమహర్షిభార్య(3); 13)శ్రీకృష్ణునిపెంపుడు తండ్రి(3); 14)పరమాత్మ(4); 15)బ్రహ్మ(4); 19)ఉగాది పచ్చడిలో కలిపే పువ్వు(2); 20)శత్రువు(2).

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

\- ప్రధాన సంపాదకుడు



Edited and published on behalf of T.T.Devasthanams by Prof. K.Rajagopalan, Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by Sri P.Ramaraju, M.A., Special Officer (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.



ఇటు గరుడని నీ వెక్కినను
పటపట దిక్కులు బగ్గనఁ బగిలె

ఎగసిన గరుడని యేపున 'ధా' యని
జిగిదొలఁక చబుకు చేసినను
నిగమాంతంబులు నిగమసంఘములు
గగనము జగములు గడగడ వడఁకె

బిరుసుగ గరుడని పేరెము దోలుచు
బెరసి నీవు గోపించినను
సరస నఖిలములు జర్జరితములై
తిరుపున నలుగడ దిరదిరఁ దిరిగె

పల్లించిన నీ పసిఁడి గరుడనిని
కెల్లున నీ వెక్కినయపుడు
ఝల్లనె రాక్షస సమితి నీ మహిమ
వెల్లి మునుఁగుదురు వేంకటరమణా ॥

- అన్నమయ్య
(సంపుటం 1 - సంకీర్తన 92)



గరుడపంచమి
25-07-2020

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
printing on 30-07-2020. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742, Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020



తిరుమల శ్రీవారి పవిత్రోత్సవం
30-07-2020 నుండి 01-08-2020 వరకు